ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం fb.com/vaartha

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-1-2025 సోమవారం సంపుటి: 30 సంచిక: 359 పేజీలు: 12 వెల: 6.50


ఆ 90వేల మందిపై ట్రంప్ ప్రభుత్వం వేటు!

అవినీతి కేసులో రాజపక్ష కుమారుని అరెస్టు

5లో




ఆదివారం న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథి ప్రబొవో సుబియాంటో, రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోడీ శకటాల ప్రదర్శనను వీక్షిస్తున్న దృశ్యం

# అద్వితీయ సైనిక పాటవం

## గణతంత్ర దినోత్సవాలలో ఆకట్టుకున్న త్రివిధ దళాల కవాతులు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

### విశిష్ట అతిథిగా హాజరైన ఇండొనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో

### వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోడీ, పలువురు కేంద్రమంత్రులు

**న్యూఢిల్లీ, జనవరి 26:** దేశవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. స్వర్ణిమ్ భారత్; విరాసత్ ఔర్ వికాస్ అనే థీమ్‌తో శకటాలను రూపొందించారు బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లుప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిలిటరీ కవాతులో త్రివిధ దళాలు తమ సత్తాచాటాయి. కర్తవ్య పథ్‌లో 9 కిలోమీటర్లమేర ఈ కవాతు కొనసాగింది. గణతంత్ర వేడుకల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకకు ఇండొనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఆయన రాష్ట్రపతితో కలిసి ప్రత్యేక గుర్రపు బండిలో వేదికవద్దకు చేరుకున్నారు. అనంతరం సైనిక దళాలనుంచి గౌరవ వందనం స్వీకరించారు.
ఈ వేడుకల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోడీ పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. 300 మంది కళాకారుల బృందం వివిధ రకాల దేశీయ వాయిద్యాలతో సారే జహాసే అచ్చా గీతాన్ని వాయించారు. అనంతరం గగనతలంనుంచి హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. గ్రూప్ కెప్టెన్ అలోక్ అహ్లావత్ దీనికి నాయకత్వం వహించారు. ఇండొనేసియాకు చెందిన నేషనల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌నుంచి >>2



ఆదివారం విజయవాడలో గణతంత్రదినోత్సవ ప్రసంగం చేస్తున్న గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్

# పేదరిక నిర్మూలనే ప్రాథమిక లక్ష్యం

### 10 సూత్రాల అమలుతో లక్ష్యాలను సాధిస్తాం

### వాట్సప్ ద్వారా 150 పౌర సేవలు

### 2026 డిసెంబరుకు పోలవరం పూర్తి

### 76వ గణతంత్ర దినోత్సవాల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్

**విజయవాడ.జనవరి26,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిక నిర్మూలనే ప్రాథమిక లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తోందని గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ స్పష్టం చేసారు. ఇందుకోసం తమ ప్రభుత్వ అనేక కీలక ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హజరయ్యారు. సతీమేతంగా హజరైన ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి ఘనంగా స్వాగతంపలికారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసారు. ఈ >>2

# మంత్రుల పనితీరుపై నివేదికలివ్వండి

### కెమెరామెన్ లేకుండానే.. ఎఐ సాంకేతికతతో సిఎం చంద్రబాబు ప్రెస్‌మీట్

2లో



ఆదివారం విజయవాడలో జరిగిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర శకటం

### • సిఎంఒ నుంచి ఆదేశాలు • మంత్రులపై వచ్చిన ఫిర్యాదులపై దృష్టిపెట్టిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జనవరి26, ప్రభాతవార్తప్రతినిధి:** పనితీరు నివేదికలు ఇంకా ఇవ్వని మంత్రులకు సిఎంఒ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గత ఏడు నెలలుగా అమాత్యులు పాల్గొన్న అధికారిక కార్యక్రమాలు, శాఖాపరంగా అమల్లోకి తెచ్చిన సంస్కరణలపై నివేదికలు కోరింది. నిర్ణయాల అమలు, పరిశీలనలో ఉన్న ప్రతిపాదనలు, తదితర సమాచారాన్ని ఆరు నమూనాల ద్వారా ఇవ్వాలని ఆదేశించింది. ఒకే మంత్రి పర్యవేక్షిస్తున్న శాఖలు ఒకటి కంటే ఎక్కువగా ఉంటే అందుకు తగ్గట్లు విడివిడిగా సమాచారం ఇవ్వాలని సిఎంఒ సూచించింది. కొందరు మంత్రులు మాత్రమే నివేదికలు ఇవ్వడంపై ఇటీవల మంత్రివర్గ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తంచేశారు. నివేదికలు ఇవ్వని మంత్రులకు సిఎంఒ మరోసారి ఆదేశాలు జారీచేసింది. ఇటీవలే సిఎం చంద్రబాబు మంత్రులతో సమావేశమయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయం సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రులుగా, ప్రభుత్వపరంగా ప్రజల్లో ఎలాంటి అభిప్రాయం ఉందో సమాచారం తెప్పించుకుంటున్నట్లు తెలిపారు. ఆరు నెలల పనితీరుపై ముగ్గురు మాత్రమే సెల్ఫ్ అప్రైజల్ ఇచ్చారని వివరించారు. నిమ్మల రామానాయుడు, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌లు మాత్రమే సెల్ఫ్ అప్రైజల్ అందజేశారని వెల్లడించారు. అమాత్యుల పనితీరును తాను ప్రత్యేకంగా మానిటర్ చేస్తున్నట్లు చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎపిలో రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో మంత్రుల పని తీరు పైన చంద్రబాబు ప్రత్యేకంగా ఫోకస్ చేసారు. మంత్రుల సమర్థత, పనితీరు పైన నివేదికలు కోరిన చంద్రబాబు.. వారి పైన వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీస్తున్నారు. మంత్రులకు వారి సామర్థం ఆధారంగా ర్యాంకులు ఖరారు చేస్తున్నారు. అయితే, కొందరు మంత్రుల పేషీల్లో జరుగుతున్న వ్యవహారాల పైన సిఎం ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో...వారి పైన కీలక నిర్ణయం దిశగా చంద్రబాబు అడుగులు వేస్తున్నట్లు సమాచారం.
ఎన్డీఏ కూటమిలోని మంత్రుల పనితీరుపైన చంద్రబాబు నివేదికలు సిద్ధం అవుతున్నాయి. నిఘా వర్గాలతో పాటుగా.. అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా చంద్రబాబు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సమాచారం తెప్పించుకుంటున్నారు. ఈ సారి కొత్త వారికి చంద్రబాబు మంత్రులుగా అవకాశం కల్పించారు. వారిలో ఇద్దరి వ్యవహార శైలి పైన ఫిర్యాదులు అందుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలకు వెళ్లిన సమయంలో కూటమి పార్టీలకు చెందిన వారి సమన్వయం..కేటాయించిన శాఖలపైన పట్టు విషయంలో మరోముగ్గురు మంత్రులు వెనుకంజలో ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో, >>2

# 'స్వర్ణాంధ్ర' పథంలో గణతంత్ర శకటాలు

**విజయవాడ జనవరి 26 ప్రభాతవార్త ప్రతినిధి:** 76వ భారత గణతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న అలంకృత శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వర్ణాంధ్ర 2047 పది సూత్రాల ప్రగతి సోపానల విజన్ డాక్యుమెంట్ స్ఫూర్తిగా తీసుకొని వివిధ శాఖలు రూపొందించిన శకటాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి భవిష్యత్తు దార్శనికతపై ప్రభుత్వ చిత్తశుద్ధి నిబద్ధతను ప్రతిబింబించేలా రూపొందిన శకటాలను నగర ప్రజలు తిలకించేందుకు వీలుగా వేడుకల అనంతరం ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం నుంచి బెంజ్ సర్కిల్, రామవరప్పాడు రింగ్, గుణదల ఏలూరు రోడ్డు, కంట్రోల్ రూమ్, బందర్ రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా శకటాల ప్రదర్శన నిర్వహించారు. 1.గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మరియు ప్రణాళికా శాఖలు:పేదరికం లేని సమాజమే మన ప్రభుత్వం ఆశయం, 2.గృహ నిర్మాణం శాఖ: 2029 నాటికి అర్హులకు పక్కా ఇళ్లు ఇంటి నివాస స్థలాల, 3. పరిశ్రమలు: యాంప్లిఫైయింగ్ ఆంధ్రప్రదేశ్ న్యూ ఇంపెటస్ న్యూ ఎరా, 4 పర్యాటక శాఖ: పర్యాటక వారసత్వం మరియు సంస్కృతి , 5. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యా శాఖ : విద్యా వికసిత ఆంధ్ర, 6.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్:స్కిల్లింగ్ ఆంధ్రా, 7 ఆరోగ్యం >>2



ఆదివారం ఎట్‌హోమ్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ నజీర్, సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ , హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, డిజిపి ద్వారకా తిరుమలరావు, సిఎస్ విజయానంద్

# రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం'

### గవర్నర్ తేనేటి విందుకు హాజరైన సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, పలువురు మంత్రులు, ప్రత్యేక అతిథులు

**విజయవాడ జనవరి 26 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రంవిజయవాడలోని రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ తేనీటి విందు ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, ఉప ముఖ్య >>2

# దేశంలో అత్యంత ప్రాధాన్యతగల రాష్ట్రం ఎపి

**విజయవాడ,జనవరి26,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే అత్యంత ప్రాధాన్యత గల రాష్ట్రంగా ఏపీ అవతరిస్తోందని సిఎం చంద్రబాబు అన్నారు. సిఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన వ్యక్తిగత కార్యాలయం గణతంత్ర వేడుకలను నిర్వహించారు. గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. దేశ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుల త్యాగాలను మరోసారి స్మరించుకుందామని వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ సాధనకు రాజ్యాంగ స్ఫూర్తితో కృషి చేద్దామని సిఎం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల తమ దావోస్ పర్యటనలో ఎన్నోఅంశాలు చోటు >>2


మీ బ్యాంక్‌లో 10 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నుండి క్లెయిమ్ చేయకుండా పడి ఉన్న మీ డబ్బుని మళ్ళీ ఉపయోగపరచుకోండి.



UDGAM లో దాన్ని కనుగొని బ్యాంక్ నుండి దాన్ని ఎలా పొందాలో తెలుసుకోండి.

- UDGAM పోర్టల్‌పై నమోదు చేసుకోండి.
- ఖాతాదారుని పేరు, బ్యాంక్(ల) పేరు మరియు జన్మదినం, ప్యాన్ కార్డ్ మొదలైనటువంటి వివరాలను ఉపయోగించి వెతకండి.

UDGAM అనేది ఒక అన్వేషణ సౌకర్యం మాత్రమే. క్లెయిమ్ చేయబడని డిపాజిట్లను ఆయా బ్యాంక్(ల) నుండే క్లెయిమ్ చేసుకోవలసి ఉంటుంది.



UDGAM పోర్టల్‌పై బ్యాంక్‌ల జాబితా లభిస్తుంది.

మరిన్ని వివరాల కొరకు https://rbikehtahai.rbi.org.in/ud సందర్శించండి
ఈ సందేశంపై అభిప్రాయం కోసం, rbikehtahai@rbi.org.inకి వ్రాయండి

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in



ఆదివారం ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రదర్శించిన ఎపి ఏటికొప్పాక బొమ్మల శకటం

# ఢిల్లీ గడ్డపై ఏటికొప్పాక ఖ్యాతి

## దేశ విదేశీయులను ఆకట్టుకొన్న బొమ్మల శకటం

**విశాఖపట్నం, జనవరి 26, ప్రభాతవార్త:** గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ శకటం అందరి మన్ననలు అందుకుంది. చాలాకాలం తర్వాత ఏటికొప్పాక బొమ్మల కళాకారుల నైపుణ్యాలతో అత్యంత అరుదైన గుర్తింపు ఆంధ్రప్రదేశ్‌కు లభించింది. ఢిల్లీ కర్తవ్యపథ్‌లో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ఏటికొప్పాక బొమ్మల శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏటికొప్పాక బొమ్మలు ఆంధ్రప్రదేశ్ కీర్తి కిరీటంలో కలికి తురాయి అని చెప్పొచ్చు. అంకుడు కర్రతో తయారుచేసిన ఈ బొమ్మలు దేశ విదేశాలలో ఖ్యాతిని ఆర్జించాయి. ఈ కర్రను ఉపయోగించి విభిన్న ఆకృతులను ఎంతో నునుపుగా తయారు చేయగల సామర్థ్యం ఏటికొప్పాక కళాకారులకు మాత్రమేఉందని అనేకసందర్భాల్లో నిరూపితమైంది. దేశ ప్రధాని మోడీ సైతం ఈ బొమ్మలను చూసి మంత్రముగ్ధులయ్యారట. ఈ బొమ్మలకు 2017 లోనే భౌగోళిక విశిష్ట గుర్తింపు దక్కింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ బొమ్మలకు డిమాండ్ పెరిగింది. హిందూ పురాణాలు ఇతిహాసాలలో ఉన్న పాత్రలకు ఏటికొప్పాక బొమ్మలు ప్రాణం పోసాయని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఈ బొమ్మలకు సహజమైన రంగులు వాడడం వలన పర్యావరణ అనుకూలమైన వస్తువులుగా పరిగణిస్తున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అందరి నోట శభాష్ అర్పించుకున్న ఈ కళాఖండాలకు మరింత ఖ్యాతి లభించాలని కోరుకుందాం.

# గణతంత్ర పెరేడ్‌లో 'రోబోడాగ్స్'

**కోల్‌కత్తా, జనవరి 26:** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కత్తాలో ఆదివారంజరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రోబోడాగ్స్ పేరేడ్‌ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బెంగాల్ గవర్నర్ సివి ఆనంద్‌బోస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిఎం మమతా బెనర్జీ ఇతర మంత్రులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఆర్మీ, నేవీ, వైమానికదళం, బెంగాల్‌పోలీసులు, కోల్‌కత్తాపోలీసులు, ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్, విపత్తు నిర్వహణ బృందాలు కవాతుచేసాయి. పాఠశాలల విద్యార్థులుప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అయితే ఈపరేడ్‌లో ఆర్మీకి చెందిన రోబో శునకాలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాయి. మల్టీ యుటిలిటీ లెగ్డ్ ఎక్విప్‌మెంట్ (మ్యూల్)గా పేర్కొంటున్న రోబోటిక్ డాగ్‌కు సంజయ్‌గా నామకరణంచేసారు. ఈ రోబో డాగ్స్ మెట్లతోపాటు కొండలనునిటారుగా ఎక్కడంతోపాటు అడ్డంకులనుసైతం దాటేస్తాయి. జీవనరసాయన అణుపదార్థాలను పసిగట్టే సెన్సార్లు కలిగి ఉన్న ఈ రోబో డాగ్స్ నిఘాతోపాటు బాంబులను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయడం వంటి సేవలకోసం ఆర్మీ ఇపుడు వినియోగిస్తోంది. 15 కిలోల బరువును కూడా ఈ డాగ్స్ మోస్తాయి. అలాగే 40 డిగ్రీలనుంచి 55 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లోకూడాపనిచేస్తాయి. ఆర్మీలోని వివిధ యూనిట్లలోసుమారు వందవరకూ రోబో డాగ్స్ ఉన్నట్లు అధికారులు తెలిపారు.



కోల్‌కతా గణతంత్ర వేడుకల్లో రోబోడాక్స్ ప్రదర్శన దృశ్యం

### గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన

# డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ.జనవరి26.ప్రభాతవార్తప్రతినిధి:** గణతంత్ర దినోత్సవ భారతీయులందరికీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. మన దేశం సర్వసత్తాక గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజు జనవరి 26 అని అన్నారు. 75 ఏళ్లుగా రాజ్యాంగం మన దేశానికి సమగ్ర దిశానిర్దేశం చేస్తోందని.. రాజ్యాంగ స్ఫూర్తిని శాశ్వతంగా వర్ధిల్లేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తిని.. రాజ్యాంగాన్ని రచించి మన దేశం గణతంత్ర రాజ్యంగా అవతరించేందుకు తమ జ్ఞాన సంపదను ధారపోసిన మేధావుల ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి అని అన్నారు.

# సుసంపన్న భారతావనిని ఆవిష్కరిద్దాం

## ప్రధానిమోడీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ జనవరి 26:** దేశం 76వ గణతంత్ర దినోత్సవాలు జరుపుకుంటున్నవేళ రాజ్యాంగం అమలుకు వచ్చి కూడా 75 ఏళ్లుపూర్తయిందని ఈ ఏడాది మొత్తం భారతావనికి ఎంతో ముఖ్యమైన సంవత్సరం అని ప్రధానిమోడీ పేర్కొన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశప్రజలకు ఆయన శుభాకాంక్షలు చెపుతూ ఎక్స్‌లో పోస్టుచేసారు. ఈరోజు మనం 75 అత్యంతప్రకాశవంతమైన గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మన రాజ్యాంగం తిరుగులేనిదని శక్తివంతమైనదని నిరూపించేందుకు కృషిచేసిన గొప్ప నాయకులు మహిళాప్రముఖులకు మనంశిరసు వంచి ప్రణమిల్లే రోజుఅని మోడీ అన్నారు. మనప్రయాణమే ప్రజాస్వామ్యవ్యవస్థతో ముడిపడి ఉందని, ప్రజాస్వామ్యం, వ్యక్తిత్వ వికాసం, సమైక్యత నినాదాలతోనే భారతావని ముందుకు వెళుతున్నదన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన మౌలిక సూత్రాలపరిరక్షణకు మనం నిరంతరం కృషిచేయాలని ఆదిశగానే ముందుకు పోతున్నామని మోడీఅన్నారు. భారత్‌ను మరింత శక్తివంతమైన దేశంగా రూపుదిద్దేందుకు సమైక్య బాటలో నడవాలని ఆయన కోరారు.

# పేదరిక నిర్మూలనే ప్రాధమిక లక్ష్యం

>> క్రమంలో సాయుధ దళాల గౌరవ వందనాన్ని గవర్నర్ స్వీకరించారు. పోలీస్, ఎన్‌సీసీ, స్కౌట్ కవాతు మధ్య ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు.గవర్నర్ ప్రత్యేక అలంకరించిన వాహనంలో ఆహుతులకు, అధికారులకు, వివిధదళాలకు అభివాదాలు చేసారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం రిపబ్లిక్ డే ప్రసంగాన్ని చదివి వినిపించారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గత ప్రభుత్వం భారీ అప్పులు చేసి సమస్యలు సృష్టించిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ వచ్చేలా ఈ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం కలగాలనేదే తమ నినాదమని పేర్కొన్నారు. ప్రభుత్వ పది సూత్రాల అమలు ద్వారా అనుకున్న లక్ష్యాలు సాధిస్తామని ఆయన వివరించారు.. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తోందని వెల్లడించారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసి సమస్యలు తెచ్చిపెట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా విధ్వంసం చేసింది.ప్రతి రంగంలోను భారీగా అప్పులు పెరిగాయన్నారు.వ్యవస్థలను నిర్వీర్యం చేసాయన్నారు.వీటన్నింటిని అధిగమిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ సహయ సహకారాలతో రాష్ట్రాన్ని పునర్జీవింపచేసే దిశలో అడుగులు వేస్తున్నామన్నారు.పోలవరం రాష్ట్రానికి జీవనాడన్నారు.ఈ ప్రాజెక్టు ధయా ఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు.ఈ 12వేల కోట్లకుపైగా నిధులను తక్షణ సహయంగా ఇచ్చేందుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. ప్రాజెక్టు పనులకు నిధులు విడుదల చేసిందన్నారు. 2026 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని వెల్లడించారు.

విజన్ 2047కి పదిసూత్రాల ప్రణాళికలతో ముందుకువెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. ప్రతి గ్రామం ప్రతి వర్గం లో అభివృద్ధి ఉండాలనేదే తమ ఆశయం అని చెప్పారు. పేదరికం లేని సమాజంపై దృష్టి పెట్టామని చెప్పుకొచ్చారు. గోదావరి పెన్నా అనుసంధానం చేస్తామని గవర్నర్ చెప్పారు.రిపబ్లిక్ డే ప్రసంగంలో గవర్నర్ మరి కీలక అంశాలను ప్రస్తావించారు. ఉద్యోగాల కల్పన తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా చెప్పుకొచ్చారు. కోస్తా తీరాన్నిఅంతర్జాతీయ సరిహద్దు గా సమన్వయం చేసుకుని అభివృద్ధిపై దృష్టి పెడతామని వెల్లడించారు. నదుల అనుసంధానం గురించి వివరించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్ వరద జలాల ఆధారంగా నిర్మాణం చేపడతామని.. ఈ నిర్ణయం ఏపీకి గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి పెట్టిందని వివరించారు. పేదరికం లేకుండా చేయడమే ప్రధాన కర్తవ్యంగా గవర్నర్ పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఒక ఎంట్రప్రెన్యూర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జనవరి 8 నాటికి 17040 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించామని గవర్నర్ పేర్కొన్నారు. వాట్సప్ ద్వారా 150 సర్వీసులు అందిస్తామని ప్రకటించారు.

2047 నాటికి 15శాతం గ్రోత్ సాధిస్తామని గవర్నర్ వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అప్పుల భారం ఎక్కువగా ఉందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వివరించారు. స్వర్ణాంధ్ర 2047కు ఒక రోడ్ మ్యాప్ తయారు చేస్తున్నామని వివరించారు. సాంకేతిక వృత్తి పరమైన నైపుణ్యాలను పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం ఏపి అభివృద్ధిలో కూడా సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎన్డీయే కూటమి ప్రభుత్వం అభివృద్ధి చెందుతుందని గవర్నర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వృత్తిజీవనంలో ప్రతిభావంతంగా వ్యవహరించిన పోలీసు ఉద్యోగులకు,సాయుదళ సిబ్బందిరి గవర్నర్ షిల్డ్,ట్రోఫీలు అందించారు.

**ఆకర్షణగా నిలిచిన శకటాల ప్రదర్శన**

వివిధ శాఖలకు సంబంధించిన శకటాలను రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రదర్శించిన ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శనను ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా పరిశ్రమలు, పర్యాటక, సెర్ప్, గృహనిర్మాణ శాఖ, పాఠశాల విద్య, నైపుణ్యాబివృద్ధి కార్పొరేషన్ శకటాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమం, జలవనరుల శాఖ, అటవీ, వ్యవసాయ, మత్స్యశాఖ, ఏపీసీ ఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఇంధనశాఖ ఉద్యాన, స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర, ఆర్‌టీజీఎస్ శకటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని చెప్పారు.

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పవన్,లోకేష్ బేటీ**

రిపబ్లిక్ డే వేడుకలకు హాజరైన డిప్యూటీ సిఎం పవన్ మంత్రి లోకేష్ మధ్య మంత్రాంగం సాగింది. కీలక అంశాలు ఇద్దరి మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య సాగిన సంభాషణ ఇప్పుడు ప్రభుత్వ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.ఇటీవలే పవన్‌కు సమాంతరంగా నారా లోకేష్‌కు ఉపముఖ్యమంత్రి ఇవ్వాలనే అంశంపై టిడిపి శ్రేణులు ఒక వాదన తీసుకుని వచ్చాయి.దీనికి టిడిపినే చెక్ పెట్టింది.గణతంత్ర దినోత్సవాలకు హాజరైన లోకేష్,పవన్ ఇటీవల దావోస్ పర్యటనపై చర్చలు జరిగాయంటున్నారు.అక్కడ లోకేష్ ఎంతో మెళుకువగా జరిపిన దౌత్యాన్ని పవన్ ప్రశంచారంటున్నారు. అంతకు మందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్‌ల నడుమ ఆసక్తికర సంభాషణ జరిగింది.

# అద్వితీయ సైనిక పాటవం

>> 152 మంది బృందం కవాతులో పాల్గొంది. మరో 190 మంది సభ్యుల బ్యాండ్‌బృందం మార్చ్ నిర్వహించింది. లెఫ్టినెంట్ ఆహాన్‌కుమార్ నాయకత్వంలోని 61 మంది అశ్వికదళం కవాతును నిర్వహించింది. తర్వాత టియర్‌టి-90 భీష్మ, బిఎంపి-2శరత్‌తోపాటు నాగ్,బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థలు, పినాక, అగ్నిబాణ్, మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు, ఆకాశ్ వెపన్ సిస్టమ్, చేతక్, బజరంగ్, ఐరావత్‌తో సహా పలు ఆయుధాలనుప్రదర్శించారు. ఈవేడుకల్లో త్రివిధ దళాలు సంయుక్తంగా ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సశక్త్‌ఔర్ సురక్షిత్‌భారత్ అనే థీమ్‌తో దీన్ని తయారుచేసారు. వివిధప్రాంతాల నుంచి ఐదువేలమంది కళాకారులు జయతి జయమహాభారతం పాటకు 11 నిమిషాలపాటు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. మోటారు సైకిళ్లపై డేర్‌డెవిల్స్‌చేసిన విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. బుల్లెట్ సెల్యూట్, ట్యాంక్‌టాప్, డబుల్‌జిమ్మీ, డెవిల్స్‌డౌన్ వంటి అంశాలుప్రదర్శించారు. 22 ఫైటర్‌జెట్‌లు 11 ట్రాన్స్‌పోర్టుఎయిర్‌క్రాఫ్ట్‌లు,ఏడు హెలికాప్టర్లు వైమానిక ప్రదర్శన వీక్షకులను కట్టిపడేసింది. వీటిలో రఫేల్, సు-30, జాగ్వార్, సి-130, సి-295, సి-17, డోర్నియర్-228, ఎఎన్-31 విమానాలతోపాటు ఎంఐ-17 హెలికాప్టర్లు ఉన్నాయి. అలాగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 16 శకటాలు కేంద్ర మంత్రిత్వశాఖలకు చెందిన 15శకటాలు కవాతులో ఆకర్షణగా నిలిచాయి.

# అసెంబ్లీలో గణతంత్ర వేడుకలు

## పతాకాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ,జనవరి26,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభ ప్రాంగణంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు.భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి రావడంతో భారతదేశం గణతంత్ర రిపబ్లిక్‌గా అవతరించింది. రాజ్యాంగం మనకు స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మ గౌరవం, అందరికీ ఓటు హక్కు కల్పించింది. ఈ ఓటు హక్కు ద్వారా ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం మనకులభించింది అని అన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను అనుభవించడమే కాకుండా, దేశాన్ని అభివృద్ధి చేసి, అభివృద్ధి ఫలితాలను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు.రాజ్యాంగాన్ని సవరించే వెసులుబాటును రాజ్యాంగ నిర్మాతలు కల్పించారని, ఇప్పటివరకు 106 సార్లు రాజ్యాంగాన్ని సవరించుకున్నామన్నారు. ప్రజాస్వామ్య బలహీనతకు కారణమవుతున్న శాసనసభ పనిదినాల తగ్గుదలపై ఆందోళన వ్యక్తం చేశారు. 100కి పైగా సభ్యులున్న చట్టసభలు ఏడాదికి కనీసం 75 రోజులు సమావేశాలు జరపాల్సిన అవసరాన్ని సూచించారు.16వ శాసనసభకు కొత్తగా ఎన్నికైన 84 మంది సభ్యులతో పాటు మిగతా సభ్యులకు శాసనసభ నియమాలు, పద్ధతులపై అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి ఇన్నాళ్లయినా పేదరికం, నిరక్షరాస్యత, అవినీతి, అసమానతలు, లింగవివక్ష, ఉగ్రవాదం వంటి సమస్యలు పరిష్కారం కావలసిన అవసరం ఉందన్నారు.



ఆదివారం అసెంబ్లీ ప్రాంగణంలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, శాసనసభ కార్యదర్శి జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, ఇతర అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాధాన్యతగల రాష్ట్రం ఎపి

>> చేసుకున్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సముద్ర రవాణా ఎపిలో రాబోతుందని,అందుకు అనుగుణంగా కార్యచరణ చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.సముద్ర రవాణా కంపెనీలలో ఒకటైన డెన్మార్క్‌కు చెందిన మార్స్క్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తోందని తెలిపార. 130 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ, ప్రపంచ సముద్రరవాణా రంగంలో రారాజులా వున్న మార్స్క్ రాష్ట్రానికి వస్తే సముద్రరవాణాలో ఎపి దేశంలోనే అగ్రగామి రాష్ట్రం అవుతుందన్నారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) సదస్సు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్స్క్ కంపెనీ సిఇఒ విన్సెంట్ క్లర్క్‌తో కీలక చర్చలు జరిపారు. వెయ్యి కిలోమీటర్ల పైనే తీరప్రాంతం కలిగి వుండటం, విస్తారంగా పోర్టులు ఉండటం ఆంధ్రప్రదేశ్ బలమని, మానవ వనరులకు లోటు లేదని.విన్సెంట్ క్లర్క్‌కు ముఖ్యమంత్రి తెలిపారు.పళ్ల రసాలు, శీతల పానీయాలు, బీర్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, ఉత్పత్తి చేసే కార్ల్స్ బెర్గ్ గ్రూప్ సీఈవో జాకబ్ ఆరుప్ ఆండర్సన్‌తోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపారు. ఇంటిగ్రేటెడ్ బ్రూవరీ, బాట్లింగ్ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయమని కోరారు. ఇందుకోసం విశాఖపట్నం, కృష్ణ పట్నం, శ్రీ సిటీలోని ఇండస్ట్రియల్ పార్కులను పరిశీలించమని సూచించారు. బార్లీ, మొక్కజొన్న, వరి వంటి అధిక నాణ్యమైన ఆహార ఉత్పత్తులను సేకరించేందుకు రాష్ట్రంలోని రైతులతో భాగస్వామి కావాల్సిందిగా కోరారు. ఎల్జీ కెమ్ లిమిటెడ్ సిఇఒ షిన్ హక్ చియోల్‌కు రాష్ట్రంలో వివిధరంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. ఎల్జీ కెమ్ దక్షిణ కొరియాలో అతిపెద్ద కెమికల్ కంపెనీ, 1.5 బిలియన్ లిథియంఅయాన్ బ్యాటరీ ప్లాంట్ ఏర్పాటు యోచనలో వున్న ఎల్జీ కెమ్ అనుబంధ సంస్థ ఎనర్జీని రాష్ట్రంలో నెలకొల్పాల్సిందిగా ముఖ్యమంత్రి ఈ భేటీలో కోరారు. పెట్రో కెమికల్ రంగంలో యూనిట్లు మూలపేట విశాఖలోనూ, సెమీకండక్టర్ యూనిట్ తిరుపతిలోనూ నెలకొల్పేందుకు వున్న అవకాశాలను పరిశీలించమని సూచించారు.

రాష్ట్రంలో తయారీకి అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు వేగంగా ప్లాంట్ ఏర్పాటయ్యేలా పూర్తి మద్దతిస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే ఆంధ్రప్రదేశ్, దక్షిణ కొరియా మధ్య పెట్టుబడుల కోసం ఎల్జీ కెమ్ సిఇఒను అంబాసిడర్‌గా ఉండాలని అభ్యర్థించారు.

కార్ల్స్‌బెర్గ్ గ్రూప్ సిఇఒ తో చర్చలు: పళ్ల రసాలు, శీతల పానీయాలు, బీర్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, ఉత్పత్తి చేసే కార్ల్స్ బెర్గ్ గ్రూప్ సిఇఒ జాకబ్ ఆరుప్ ఆండర్సన్‌తోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపారు. ఇంటిగ్రేటెడ్ బ్రూవరీ, బాట్లింగ్ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయమని అభ్యర్థించారు. ఇందుకోసం విశాఖపట్నం, కృష్ణ పట్నం, శ్రీ సిటీలోని ఇండస్ట్రియల్ పార్కులను పరిశీలించమని చెప్పారు. బార్లీ, మొక్కజొన్న, వరి వంటి అధిక నాణ్యమైన ఆహార ఉత్పత్తులను సేకరించేం దుకు ఆంధ్రప్రదేశ్‌లోని రైతులతో భాగస్వామి కావాల్సిందిగా కోరారు.

### కెమెరామెన్ లేకుండానే.. ఎఐ సాంకేతికతతో

# సిఎం చంద్రబాబు ప్రెస్‌మీట్

**విజయవాడ జనవరి 26 ప్రభాతవార్త ప్రతినిధి:** అత్యాధునిక సాంకేతికత వినియోగంలో ముందుండే ముఖ్యమంత్రి చంద్రబాబు కృత్రిమ మేధను వినియోగించుకొని వినూత్నంగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. వీడియోగ్రాఫర్లు, కెమెరామెన్ లేకుండా పూర్తిగా ఎఐతో పనిచేసే వ్యవస్థను వినియోగించారు. ఉండవల్లిలోని సిఎం నివాసంలో 4 కెమెరాలతో మల్టీవీడియో కెమెరా వ్యవస్థ ఏర్పాటుచేశారు. దీని ద్వారా లైవ్ కవరేజీ అందించారు. సమాచార శాఖ అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించారు. సమావేశ మందిరంలోకి చంద్రబాబు వచ్చిన సమయంలో ఒకకెమెరాకు సూచనలు ఇవ్వడం ద్వారా ఆయన్ను కేంద్రంగా చేసుకుంటూ అదే వీడియో రికార్డింగ్ మొదలుపెట్టింది. చంద్రబాబు సెంటర్ ఫ్రేమ్‌లో ఉండేలా చూసుకుంటూ అవసరమైన సర్దుబాట్లు చేసుకొని వీడియో ఔట్‌పుట్ ఇచ్చింది. 8 మందితో చేసే పనిని ఈ ఎఐ కెమెరా వ్యవస్థ ద్వారా ఒక్కరితోనే చేయొచ్చు. ఫలితంగా సమావేశ మందిరంలో ఎక్కువమంది అటూ, ఇటూ తిరగాల్సి అవసరం ఉండదు. గందరగోళానికి తావుండదు. నో మ్యాన్ విధానంలో ఆటోమేటిక్‌గా పని జరుగుతుంది. దావోస్ పర్య టన విశేషాలు చెప్పేందుకు చంద్రబాబు శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ ఎఐ సాంకేతికతను వినియోగించారు. మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ ఎఐ సాంకేతికత కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేయించారు. ముఖ్య మంత్రి క్యాంపు కార్యాలయమైన ఉండవల్లి నివాసంలో ప్రభుత్వ నిధులతో ఈ వ్యవస్థ ఏర్పాటు చేసే అవకాశమున్నా లోకేశ్ అందుకు అంగీకరించలేదు. తన సొంత నిధులతో దాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

# రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం'

>> మంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, నారాయణ, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, పార్థసారథి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, సవిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఎంపీలుఎమ్మెల్యేలు, సీఎస్ విజయానంద్, డిజిపి ద్వారకా తిరుమలరావు, సిపిఐ రామకృష్ణ ఇతర సీనియర్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నారా లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరు సాధ్యమైనంత వరకు అందరితో కలవిడిగా తిరుగాడుతూ మాటలు కలిపారు.రాష్ట్ర ఉపసభాపతి కార్యక్రమంలో ఉత్సాహం వ్యవహరించారు.ఈ కార్యక్రమానికి హజరైన ప్రతి ఒక్కరి వద్దకు గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ వినమ్రంగా నమస్కరిస్తూ పలుకరించారు.ప్రపంచ చదరంగం క్రీడాకారిణి కోనేరు హంపీ,రేజర్లు పూర్ణ వంటి క్రీడాకారులతో పాటు ఫ్రంట్‌లైన్ వర్కర్లుతో ఆయన ప్రత్యేకంగా పలుకరించారు.ఈ సారి ఈ కార్యక్రమానికి వివిధ అంశాల్లో ప్రతిభను చూపిన చిన్నారులను ఆహ్వానించారు.జాతీయ గీతాలాపనతో ఆరంభమైన ఈ కార్యక్రమం తిరిగి జాతీయగీతాలాపనతో ముగిసింది.ఈ కార్యక్రమంలో సిఎం, డిసిఎం, గవర్నర్ జస్టిస్ నజీర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్‌ల నడుమ ఆసక్తికర సంభాషణ జరిగింది.

# మంత్రుల పనితీరుపై నివేదికలివ్వండి

>> తాజాగా మంత్రుల కార్యాలయాలకు కీలక ఆదేశాలు అందాయి. ఈ నివేదికల ద్వారా మంత్రుల నుంచి వచ్చిన నివేదికలు తమ వద్ద ఉన్న సమాచారంతో పోల్చి చూసి ఒక అంచనాకు రానున్నారు. ఆ తరువాత ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఇక, ఉత్తరాంధ్రకు చెందిన ఒక మంత్రితో పాటుగా, గోదావరి జిల్లాలకు చెందిన మరో యువ మంత్రి పైన ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. సీమలో ప్రధాన జిల్లాకు చెందిన కీలక మంత్రి పైన పార్టీలో చర్చ సాగుతోంది. ఇక.. జనసేన మంత్రులకు సంబంధించిన సమాచారం డిప్యూటీ సిఎం పవన్‌కు పంపిస్తున్నారు. ఈ నివేదికల ఆధారంగా చేయాల్సిన మార్పులు చేర్పుల పైన చంద్రబాబు .. పవన్ కల్యాణ్ తుది నిర్ణయం తీసుకోనున్నారు.మంత్రుల శాఖలకు సంబంధించి ఈ ఏడు నెలల కాలంలో తీసుకున్న నిర్ణయాలు.. సంస్కరణలతో పాటుగా సాధించిన ప్రగతి గురించి నివేదికలు పంపాలని సూచించారు. అందులో అధికారంలోకి వచ్చిన తరువాత జూలై నుంచి డిసెంబర్ వరకు ఈ నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. మంత్రిగా శాఖల్లో తీసుకున్న నిర్ణయాలతో పాటుగా ఇంఛార్జ్ మంత్రులుగా అక్కడ ఎలాంటి ప్రభావం చూపించారనే కోణంలో నివేదికలు సేకరిస్తున్నారు.

### రిపబ్లిక్‌డే వేడుకలకు ప్రధాని మోడీ

# రాజస్థాన్ తలపాగా

**న్యూఢిల్లీ, జనవరి 26:** దేశరాజధాని కర్తవ్యపథ్‌లో 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోపాల్గొన్న ప్రధాని తలపాగా అందరినీ ఆకర్షించింది. ఎరుపు, పసుపు కలగలిసిన వర్ణంతో ప్రత్యేకంగా ఉంది. రాజస్థాన్ సంస్కృతికి ప్రతీకగా ఆయన సఫాను ధరించారు.ఏటా స్వాతంత్ర్య గణతంత్ర వేడుకలకు ప్రధానిమోడీ విభిన్నమైన తలపాగాలు ధరించి హాజరవుతారు. దేశంలోని వివిధప్రాంతాల సంస్కృతిని ప్రతిబింబించేలా ఆయన జాగ్రత్త తీసుకొంటారు. 2024 గణతంత్రవేడుకల్లో కుంకుమ, గులాబీ, తెలుపు, పసుపురంగులతోకూడిన తలపాగా ధరించారు. ఇది గుజరాత్ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. 2023లో మహారాష్ట్రకు చెందిన ఫెటా 2022 వేడుకల్లో ఉత్తరాఖండ్‌కు చెందిన టోపీని ధరించారు.

2021లో గుజరాత్‌లోని జామ్‌నగర్ సంస్కృతిని ప్రతిబింబించే హలారీ పగడ్డీ ప్రత్యేక ఆకర్షణగా మారింది. సాంస్కృతిక వారసత్వప్రాముఖ్యాన్ని మాత్రమేకాకుండా ప్రాంతీయ హస్తకళల నైపుణ్యాన్నికూడా ప్రతిబింబిస్తుందని మోడీ అన్నారు. 2020లో గణతంత్ర వేడుకల్లో కుంకుమ రంగులోని బంధేజ్ తలపాగాధరించారు. ఇది రాజస్థాన్, గుజరాత్‌ప్రాంతాల్లోని మారుమూల ప్రజల సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిచేదిగా ఉంది.

## గణతంత్ర శకటాలు

>> కుటుంబ సంక్షేమం: కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యం, 8 మహిళా భివృద్ధి, శిశు సంక్షేమం: కిశోరి వికాసం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్, 9.జలవనరుల శాఖ: తెలుగు తల్లికి జల హారతి, 10. అటవీ శాఖ: నగర వనం ఎకోటూరిజం, 11. రైతు సాధికార సంస్థ : వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయం, 12. మత్స్య శాఖ: మౌలిక వసతుల కల్పనతో ఆక్వాకల్చర్ లో అధిక ఉత్పత్తులు, 13. ఏపీసీఆర్‌డీఏ: మన అమరావతి ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం, 14. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి: పల్లె పండుగ -పంచాయతీ వారత్సోవాలు, 15. ఇంధన శాఖ: పర్యావరణ సహిత విద్యుత్ వనరుల ఉత్పత్తి లక్ష్యం, 16.ఉద్యానవన శాఖ: డీప్ టెక్నాలజీస్ అనుసంధానంతో ఉద్యానవన ఆంధ్రప్రదేశ్. 17.స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పర్యావరణ రక్షిత స్వచ్ఛాంధ్రప్రదేశ్, 18.రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ: సాంకేతికతో పాలనలో విప్లవాత్మక అడుగులు ఇవన్నీ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించిన శకటాలు.

## వారం - వర్జ్యం

తేది : 27-01-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
త్రయోదశి రా.8.55
మూల ఉ.9.01
వర్జ్యం ఉ.7.24-9.05, 2) సా.6.36-8.12
దు.మ.12.51-1.36, 2) మ.3.06-3.51
శుభసమయం: ఉ.9.40-10.20
సా.3.55-4.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఇతరుల విషయంలో జోక్యం వద్దు.

**వృషభం :** నూతన గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి. కొత్త ఉద్యోగ అవకాశాలు లాభిస్తాయి.

**మిథునం:** పిల్లల విషయమై చింతించ వలసిన అవసరము లేదని గ్రహించి ఊపిరి పీల్చుకుంటారు.

**కర్కాటకం :** ఎలర్జీ, అజీర్తి వంటి స్వల్ప ఇబ్బందుల పట్ల అప్రమత్తంగా ఉండటం చెప్పదగిన సూచన.

**సింహం:** మొండి పట్టుదల ఉపకరించేది కాదని గ్రహించండి. సంఘంలో విశేష గౌరవం లభిస్తుంది.

**కన్య :** మీకు నచ్చిన వ్యక్తులతో ఆనందంగా గడుపుతారు. ఋణాలను కొంతవరకు తీర్చగలుగుతారు.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కుటుంబ సమస్యల నుండి బయట పడతారు.

**వృశ్చికం:** సోదరులు, మిత్రుల నుండి ధన, వస్తులాభాలు పొందుతారు. ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** వ్యాపార విస్తరణకుగాను చేపట్టే చర్యలు కలిసివస్తాయి. పనులు సక్రమంలో పూర్తి.

**మకరం:** మీ ఉన్నతి చూసి ఓర్వలేని వారు అధికమవుతారు. ఆర్థికపరిస్థితి అనుకూలం.

**కుంభం:** విలాసాలకు అర్థికంగా ధనం ఖర్చు చేస్తారు. చిన్న తరహా పరిశ్రమలవారికి అనుకూలం.

**మీనం :** ఒక మంచి కార్యక్రమాలను నిర్వహించడానికి గాను ప్రాణాలను సేకరిస్తారు.

# తిరుమల విజన్-2047 అమలుతోనే మౌలిక సదుపాయాలు

## భక్తుల సేవకు ఉద్యోగులు పునరంకితంకావాలి: గణతంత్రదినోత్సవంలో టిటిడి ఇఒ శ్యామలరావు




**తిరుపతి,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతి చెందిన తిరుమల పుణ్యక్షేత్రాన్ని మరింతగా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు తిరుమల విజన్ 2047 అమలుతోనే మౌళికసదుపాయాలు కల్పన సులభమవుతుందని టిటిడి ఇఒ జె. శ్యామలరావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలతోనే అలిపిరి బేస్ క్యాంప్, బహుళస్థాయి పార్కింగ్, స్మార్ట్ పార్కింగ్, నూతన లింకురోడ్డుల నిర్మాణం, సబ్‌వేల నిర్మాణం, రెండు ఆర్టీసి బస్టాండులు, పాతసత్రాల పున:నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంనలుమూలల నుండి వస్తున్న లక్షలాదిమంది భక్తుల సేవకు ఉద్యోగులు పునరంకితంకావాలని ఆయన పిలుపునిచ్చారు. 76వ గణతంత్రదినోత్సవాన ఆదివారం ఉదయం తిరుపతిలోని టిటిడి పరిపాలనభవనం ప్రాంగణంలో ఆయన త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచడం, ఉద్యోగులకు సేవలపై పలు కీలక అంశాలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా టిటిడికి అనుబంధంగా ఉన్న ఆలయాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జాతీయనాయకుల స్ఫూర్తితో టిటిడి ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకుని భక్తులకు మెరుగైన సేవలందించాలని ఇఒ శ్యామలరావు తెలిపారు. టిటిడి నిర్వహణలోని అన్ని ఆలయాల్లో జీయంగార్లు, ఆగమశాస్త్ర నిపుణుల సలహాల మేరకు నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా జరిపిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 4వతేదీ రథసప్తమికి తిరుమలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహాకుంభమేళాలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటుచేసి ఉత్తరాదిభక్తులకు స్వామి వారి సేవలను, దర్శనం కల్పిస్తున్నామన్నారు. భక్తులకు రుచికరమైన అన్నప్రసాదాలు, లడ్డూల తయారీకి నాణ్యమైన ముడిసరుకులు వినియోగిస్తున్నట్లు చెప్పారు. టిటిడి ఆధ్వర్యంలోని పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో 40నెలల కాలంలో 3,500 గుండె ఆపరేషన్లు,17 గుండె మార్పిడి చికిత్సలను విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. మరింత ప్రణాళికా బద్ధంగా శ్రీవారిసేవలో మార్పులుతీసుకువచ్చి భక్తులకు చక్కటి ఇతోధిక సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తున్నామని, బ్రహ్మోత్సవాల బహుమానం శాశ్వత ఉద్యోగులకు 15,400 రూపాయలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 7,535 రూపాయలు అందించడం జరిగిందని ఇఒ శ్యామలరావు తెలిపారు.

అంతముందు ఆయన టిటిడి పరేడ్‌గ్రౌండ్‌లో టిటిడి సెక్యూరిటీ సిబ్బంది నుండి గౌరవవందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వి.వీరబ్రహ్మం, డిఎల్ఒ వరప్రసాదరావు ,సిఇ సత్యనారాయణ, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, అదనపు సివిఎస్ఒ శివకుమార్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## పాలకడలిలో సప్తగిరులు

రాత్రివేళ మారిన వాతావరణం..వేకువజామున మంచులాగా కురుస్తున్న పొగమంచుతో తెల్లని వెండిమబ్బుల్లో సప్తగిరులు పూర్తిగా మునిగిపోయాయన్నట్లు కమ్మేసింది. మేఘాలు దివినుండి భువికి దిగాయన్నట్లు ఆదివారం ఉదయం అపూరూపకమనీయ దృశ్యం తిరుమల రెండవ ఘాట్ నుండి శేషాచలంకొండలపై పొగమంచుతో హిమగిరుల సుందరం కనువిందుచేసింది.

ఫొటో: టి.శ్రీనివాసులు-తిరుమల,ప్రభాతవార్త

# ఒకరోజు బ్రహ్మోత్సవానికి ముస్తాబవుతున్న తిరుమల

## సామాన్యభక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు

**తిరుమల,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:** మాఘ మాస సప్తమితిథి ఫిబ్రవరి 4వతేదీ మంగళ వారం ఒకరోజు బ్రహ్మోత్సవంగా ఏడుకొండలపై జరిగే రథసప్తమి పర్వదినానికి తిరుమల ముస్తాబవుతోంది. ఒకేరోజు ఉదయం నుండి రాత్రి వరకు వరుసగా ఏడు వాహనాలపై ఉత్సవ మూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్ప స్వామి దర్శనం ఇవ్వనున్నారు. ఈ మినీ బ్రహ్మోత్సవానికి సామాన్యభక్తుల కోసం టిటిడి విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఆలయ పరిసరాల్లోనూ, మాఢవీధుల్లోనూ గ్యాలరీలు, ప్రత్యేక జర్మన్‌షెడ్లు నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. మాఢవీధుల్లో ఫిబ్రవరి 4వతేదీ వేకువజామున నుండి రాత్రివరకు నిరీక్షించే భక్తులకు అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు కల్పనపై స్వయంగా టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షణలో డిప్యూటీ ఇఒలు పి.హరీంద్రనాథ్,



లోకనాథం, భాస్కర్, సిఇ సత్యనారాయణ, విఎస్ ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర పర్యవేక్షణలో భద్రతా పరంగా చర్యలు, ముస్తాబు చేసే పనులు మొదలయ్యాయి. ఆలయం ముందువైపు, మాఢవీధుల్లో వేచివుండే భక్తులకోసం గ్యాలరీలను, జర్మన్ షెడ్లను పూర్తి స్థాయిలో సిద్దంచేస్తున్నారు. ఆలయ మాఢ వీధుల్లో హారతి ప్రాంతాలు, రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు.



## గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ.జనవరి26,ప్రభాతవార్తప్రతినిధి:** గణతంత్ర దినోత్సవ భారతీయులందరికీ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. మన దేశం సర్వసత్తాక గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజు జనవరి 26 అని అన్నారు. 75 ఏళ్లుగా రాజ్యాంగం మన దేశానికి సమగ్ర దిశానిర్దేశం చేస్తోందని.. రాజ్యాంగ స్ఫూర్తిని శాశ్వతంగా వర్ధిల్లేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన దేశ స్వాతంత్ర్యంకోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తిని రాజ్యాంగాన్ని రచించి మన దేశం గణతంత్ర రాజ్యంగా అవతరించేందుకు తమ జ్ఞాన సంపదను ధారపోసిన మేధావుల ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి అని అన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలి : సిఎస్ విజయానంద్

**సచివాలయం,జనవరి 26,ప్రభాతవార్త:** సమాజంలోని ప్రతి ఒక్కరూ మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలని అప్పుడే రాజ్యాంగ నిర్మాతల కలలు సాకారం అవుతాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు.76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాక్ వద్ద జరిగిన కార్యక్రమంలోఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించి,మువ్వన్నెల జాతీయజెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనదని నాటి రాజ్యాంగ నిర్మాత ఎంతో ముందుచూపుతో దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు ఆర్ధిక అసమానతలను తొలగించేందుకు అన్ని అంశాలను పొందుపర్చి ఒక గొప్ప రాజ్యాంగాన్ని మనకు అందించారని గుర్తు చేశారు.వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర 2047నాటికి రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా చేసేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున ప్రణాళికలు అమలు చేస్తుందని ఆయా లక్ష్యాల సాధనకు ప్రభుత్వ యంత్రాంగమంతా కృషిచేయాల్సిన అవసరం ఉందని సిఎస్‌విజయానంద్ స్పష్టంచేశారు. ప్రతి ఉద్యోగి, అధికారి చిత్తశుద్దితో పనిచేసి ప్రభుత్వం అమలు చేసే అభివృద్ది సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిపేదవారికి సక్రమంగా చేరే విధంగా పనిచేయాల్సిన అవసరంఉందని పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.కార్యక్రమంలోసాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్‌కు మార్ మీనా, అదనపుకార్యదర్శికాళీకుమార్,సిఎస్ఒ మల్లికార్జున, పలువురు పాల్గొన్నారు.



రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం గౌరవ వందనం స్వీకరిస్తున్న సిఎస్ విజయానంద్

# అభిప్రాయవ్యవస్థతోనే భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం

## సమస్యలను అధిగమించి సంతృప్తికర సేవలు

### గణతంత్ర వేడుకలో టిటిడి అదనపు ఇఒ చౌదరి



**తిరుమల,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:** వేంకటేశ్వ రస్వామి దర్శనం కోసం దేశంనలుమూలల నుండి వస్తున్న భక్తుల నుండి ఎప్పటికప్పుడు మార్పులు,సూచనలపై అభిప్రాయసేకరణ వ్యవస్థ(ఫీడ్‌బ్యాక్‌సిస్టం)ద్వారా అభిప్రాయాలు తీసుకుని చక్కగా సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే మా ధ్యేయమని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఉద్ఘాటించారు. స్వామివారి దర్శనాన్ని వీలైనంత త్వరగా చేయించడంతోబాటు వసతి సదుపాయం పారదర్శకంగా కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం తిరుమలలోని గోకులం విశ్రాంతిభవనంలో 76వ గణతంత్రదినోత్సవాన ఆయన జాతీయజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అదనపు ఇఒ మాట్లాడుతూ తిరుమలతిరుపతిదేవస్థానం తిరుమలకు వస్తున్న భక్తులకు వీలైనంత వరకు సంతృప్తికరంగా స్వామివారి దర్శనం చేయించడమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారన్నారు. శ్రీవారిసేవకుల సహాయంతో అభిప్రాయాలు తీసుకుంటూ మరింతగా భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తామన్నారు. టిటిడి ఉద్యోగులు సమిష్టికృషితో అంకిత భావంతో పనిచేసి మరింత మెరుగైన సేవలందించాలని ఆయన కోరారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాదాలు, క్యూలైన్ల నిర్వహణ మార్పులు చేపట్టామన్నారు. భక్తులకు మరింత నాణ్యమైన అన్నప్రసాదాలు అందించేందుకు అత్యాధునిక యంత్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పదిరోజుల వైకుంఠద్వారదర్శనాలను 6.80 లక్షల మంది భక్తులకు దర్శనం బాగ్యం కల్పించామని, 96శాతంమంది భక్తులు దర్శన ఏర్పాట్లు చాలా బావున్నాయని తెలిపారన్నారు. తిరుమలలో వసతిగదుల కొరతను పరిష్కరించి, మరికొన్ని కాటేజీల్లో మరమ్మతులు త్వరగా పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెంకయ్యచౌదరి తెలిపారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఈ హుండీ విధానం మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. అంతకుముందు ఆయన గోకులంలో టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది నుండి గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీవిద్యార్థులకు, ఉద్యోగులకు స్వీట్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ సత్యనారాయణ, విజిలెన్స్ వింగ్ విఎస్ఒ ఎస్టీవిరామ్‌కుమార్, అల్లం సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి

## రాష్ట్ర శాసనమండలి అధ్యక్షుడు కొయ్యే మోషేన్ రాజు

**సచివాలయం, జనవరి 26,ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రతి పేదవానికి అందినప్పుడే సమాజంలోని అసమానతలు పూర్తిగా తొలగుతాయని రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్‌రాజు అన్నారు.76వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ భవనం ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ప్రపంచంలోనే మన భారత రాజ్యాంగం ఒకఉత్తమ రాజ్యాంగంగా నిలిచిందంటే అందుకు కారణం మన రాజ్యాంగ నిర్మాతలు ఎంతో ముందు చూపుతో అన్నిఅంశాలను పరిగణనలోనికి తీసుకొని గొప్ప రాజ్యాంగాన్ని మనకు అందించడమేనని చైర్మన్ మోషేన్ రాజు పేర్కొన్నారు. ఆనాడు దేశానికి స్వాతంత్రాన్ని సాధించేందుకు అనేకమంది వారి ప్రాణాలను ఫణంగాపెట్టారని వారి త్యాగాలను మనం ఎప్పటికీ మరువరాదని హితవు పలికారు. ప్రజలకు కల్పించిన హక్కుల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఎస్.ప్రసన్నకుమార్, ఉపకార్యదర్శులు రాజ్‌కుమార్, సుబ్బారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తొలగిస్తాం: మంత్రి సవిత



**విజయవాడ,జనవరి26,ప్రభాతవార్తప్రతినిధి:** సత్యసాయి జిల్లా సీకే పల్లి బీసీ హాస్టల్ లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని ఘటనపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖమంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి ఆదేశాలతో బీసీ సంక్షేమశాఖాధికారులు భోజనం సదుపాయం కల్పించారు. హెచ్ డబ్ల్యూవోపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం మంత్రి సవిత కలెక్టర్ తోనూ. బీసీ సంక్షేమ శాఖాధికారులతోనూ ఫోన్లో మాట్లాడారు. సీకే పల్లి బాలుర హాస్టల్ లో మధ్యాహ్న భోజనం ఎందుకు సమకూర్చలేదని మంత్రి ఆరా తీశారు. హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణి సరికాదని మండిపడ్డారు. తక్షణమే విద్యార్థులకు భోజనం సదుపాయం కల్పించాలని, రాత్రికి కూడా ఎటువంటి లోటూ రానివ్వొద్దని స్పష్టంచేశారు. విద్యార్థులను ఆకలితో బాధపడేలా చేసిన సీకే పల్లి బీసీ బాలుర హాస్టల్ హెచ్ డబ్ల్యూవో నారాయణ స్వామిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఫోన్లో కలెక్టర్ ను మంత్రి సవిత ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు భోజనం సదుపాయం కల్పించారు. హెచ్ డబ్ల్యూవోను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ టీఎస్ చేతన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనకు సంబంధించి విచారణ చేపట్టి వివరాలు అందివ్వాలన్నారు. అధికారులపై నమ్మకంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పిస్తున్నారని, వారిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# రైల్వేలో ఘనంగా గణతంత్ర వేడుకలు

**గుంతకల్లు రైల్వే,జనవరి 26,ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ కేంద్రంలో ఘనంగా జరిగాయి. స్థానిక రైల్వే క్రీడా మైదానంలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి రైల్వేరక్షక దళం,రైల్వే పాఠశాల విద్యార్థులు, భారత స్కౌట్,గైడ్స్ సమర్పించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కార్మికులకు పంపిన సందేశాన్ని,డివిజన్ సాధిస్తున్న ప్రగతిని వివరించారు. సమావేశంలో అదనపు డిఆర్ఎం సుధాకర్,సిఎంఎస్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి,సీనియర్ డిఎస్‌సి మురళీకృష్ణ, ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు క్యాప్రియల్ అరోరా,శ్రావణ్ కుమార్, రామక్రిష్ణ, శ్రీనివాస్, వీరయ్య, యల్లయ్య, సుదర్శన్‌రెడ్డి, రామిరెడ్డి,ఎంకె నగార్, మంగాచార్యులు, చంద్రశేఖర్, సూర్యనారాయణ, మధుసూదనరావు, సీనియర్ సబార్డినేట్లు, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రైల్వే ఎస్‌పి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రైల్వే ఎస్‌పి రాహుల్ మీనా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డిఎస్ఆర్‌పి హర్షిత,ఐఆర్‌పిలు బివి నాగేష్‌బాబు,బివి రమణ,చిన్నరాయుడు తదితరులున్నారు.రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలోడివిజనల్ కార్యదర్శి ప్రభాకర్,మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో డిఎస్ విజయ్‌కుమార్, ఎస్‌సి,ఎస్‌టి కార్యాలయంలో అధ్యక్షులు సాయిబాబా,డిఆర్ఎం కార్యాలయం,డివిజనల్ రైల్వే ఆసుపత్రి,డీజిల్ షెడ్,రైల్వే కోర్టు,స్టేషన్‌లతో పాటు రైల్వేలో వివిధ విభాగలకు చెందిన డిపో కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.



రైల్వేలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పతాకావిష్కరణ గావించిన డిఆర్ఎం గుప్తా

# రాజ్యాంగం స్ఫూర్తికి విఘాతం కలుగకుండా న్యాయ వ్యవస్థ కోగార్డియన్‌గా పని చేస్తుంది

## గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్


**విజయవాడ జనవరి 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆవరణలో 76వ భారత గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సభికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలుకు ఎటువంటి విఘాతం కలుగకుండా న్యాయ వ్యవస్థ కో గార్డియన్ లా పనిచేస్తున్నదన్నారు. అటువంటి వ్యవస్థలో పనిచేసే న్యాయ మూర్తులు, న్యాయవాదులు ఎంతో బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ కోర్టు గదులకే పరిమితం కాకుండా గ్రౌండ్ రియాలటీలను అర్ధం చేసుకుని దానికి తగ్గట్టుగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. రాష్ట్ర న్యాయవాదల మండలి అధ్యక్షుడు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రజా స్వామ్య వ్యవస్థ మనుగడ సాగించడంలో న్యాయ వ్యవస్థ కీలక భూమి పోషిస్తున్నదన్నారు. హైకోర్టు న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి సం రక్ష కుల బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు.

ఈ గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పలువురు న్యాయమూర్తులు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి.పొన్నారావు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శ్రీనివాస శివరాం. పలువురు రిజిస్ట్రార్లు బార్ అసోసియేషన్ బార్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సేవకు పునరంకితంకావాలి

## ఉత్తమసేవలకు ఉద్యోగులకు వెండి డాలర్లు బహూకరణ

**తిరుమల,జనవరి 26ప్రభాతవార్తప్రతినిధి:**ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హిందూ ధార్మికసంస్థ టిటిడిలో వేలాదిమంది ఉద్యోగులు సేవాభావంతో విధులు నిర్వహిస్తున్నారని, భక్తుల సేవకు పునరంకితంకావాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతిలోని టిటిడి పరేడ్ మైదానంలో 76వగణతంత్రదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా భక్తుల సేవలో నిరంతరం సేవాభావంతో విధులు నిర్వహిస్తూ మెరుగైన సేవలందించడంలో ముందుంటున్న 36మంది అధికారులు, 267మంది ఉద్యోగులకు 5గ్రాముల శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రాలుతో సన్మానించారు. మీ ఉత్తమ సేవలు తోటి ఉద్యోగులకు ఆదర్శమని, భవిష్యత్తులో ప్రతి ఉద్యోగి ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఇఒ, అదనపు ఇఒ సూచించారు. ఈ సందర్భంగా ఎస్వీబిసిలో 7మంది ఉద్యోగులకు కూడా 5గ్రాముల శ్రీవారి వెండిడాలర్లు, ప్రశంసాపత్రం అందజేశారు. వారిసేవలు కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బోర్డుసెల్ డిప్యూటీ ఇఒ ప్రశాంతి, ఏవిఎస్ఒ కళావతి, సివిఎస్ఒ కార్యాలయం సూపరింటెండెంట్ పద్మావతి, ఇఇ నరసింహమూర్తి, తిరుమల డిఇ చంద్రశేఖర్, డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, సిఇ సత్యనారాయణ, జెఇఒ పిఎస్ నటరాజ, ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీ ఇఒ నటేశ్‌బాబు,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, తిరుచానూరు పద్మావతి ఆలయ డిప్యూటీ ఇఒ గోవిందరాజన్ అందుకున్నారు.



## మధ్యాహ్న భోజనంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం

**విజయవాడ,జనవరి26,ప్రభాతవార్తప్రతినిధి:** సత్యసాయి జిల్లా సికేపల్లి వసతి గృహంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌తో సీఎం చంద్రబాబు మాట్లాడారు. వసతి గృహంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వార్డెన్, సంబంధిత ఉద్యోగులు వండకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం తెలిసిన వెంటనే విద్యార్థులకు భోజనం సమకూర్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేసి నిర్లక్ష్యం వహించిన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తక్షణమే విద్యార్థులకు భోజనం సదుపాయం కల్పించాలని, రాత్రికి కూడా ఎలాంటి లోటూ రానివ్వొద్దని స్పష్టం చేశారు.

# సమష్టి కృషితో జిల్లాను నం.1గా నిలుపుదాం..

## 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

**విజయవాడ జనవరి 26 ప్రభాతవార్త ప్రతినిధి:** అత్యున్నత ప్రజాస్వామ్యం, గణతంత్ర దినోత్సవం స్ఫూర్తితో స్వర్ణాంధ్ర" 2047 ఆశయాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో జిల్లా ప్రగతికి ఐక్యతతో టీమ్ ఎన్‌టీఆర్‌గా సమష్టిగా కృషిచేద్దామంటూ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఆదివారం 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని విజయవాడ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ. అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహంతో పాటు విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి రైరల్ జోన్ డీసీపీ కేంఎ మహేశ్వరరాజు తదితరులతో కలసి పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పది సూత్రాల వృద్ది సోపానాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన విజన్ డాక్యుమెంట్‌లోని లక్ష్యాల సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన, సంకల్పం చెప్పుకోవాల్సిన అవసరముందున్నారు. పేదరిక నిర్మూలన ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ది ఇంటింటికి నీటి భద్రత, రైతు-వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ శక్తి-ఇంధనాల వ్యయ నియంత్రణ అన్ని రంగాల్లో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానలతో స్వచ్ఛాంధ్ర అన్ని దశల్లో సమగ్ర సాంకేతికత మార్గదర్శక సూత్రాల స్ఫూర్తిగా పనిచేయాలని సూచించారు. అన్ని రంగాల్లోనే జిల్లాను నెం.1గా నిలిపేందుకు కృషిచేద్దామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు సిబ్బంది, వ్యక్తి గతంగా బృందంగా సామాజిక సేవలో భాగ స్వాములవుతున్న విశిష్ట వ్యక్తులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. రెవెన్యూ పోలీస్, వైద్య ఆరోగ్యం, మునిసిపల్ వ్యవసాయం పరిశ్రమలు ఇలా వివిధ శాఖల అధికారులతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మొత్తం 517 మందికి కలెక్టర్ లక్ష్మీశ ప్రశంసా పత్రాలు అందజేశారు.విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ తిరువూరు ఆర్‌డీవో కె.మాధురిప్రశంసా పత్రాలు అందుకున్నారు.

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

-సి.డబ్ల్యు వెండెల్

# యుద్ధభూమిలో వింత వైరస్!

ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర గత మూడేళ్లుగా కొనసాగుతోంది. తాను అధికారంలోకి రాగానే ఉక్రెయిన్ రష్యా యుద్ధం ఆపేస్తానని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనల పైనే ఇప్పుడు ఉక్రెయిన్ వాసులు ఆశలతో ఉన్నారు. పాశ్చాత్యదేశాలన్నీ పర్యటించి అందరి మద్దతును కూడ గట్టుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ఇప్పుడు కొత్త సమస్య వచ్చిపడింది. కొత్తతరహా బ్యాక్టీరియా బాధిస్తోంది. సాధారణంగా వాడే యాంటిబయాటిక్స్ వారికి పని చేయడంలేదు. కొంతమంది బతుకుతామన్న ఆశలు వదులుకున్నారు. వీటన్నింటినీ పరికిస్తే రష్యా యుద్ధతంత్రంలో ఇదొక భాగమా అనిపిస్తోంది. యుద్ధతంత్రాలను గమనిస్తే పౌరజీవన ప్రాంతాలపై దాడులు చేసేముందు సరైన హెచ్చరికలు చేయాలి. ప్రస్తుతం రష్యా చేస్తున్న దాడుల్లో హెచ్చరికలు లేనివే ఎక్కువ ఉన్నాయి. దీనికితోడు ఆయుధాలతోపాటు రసాయన దాడులతోకూడా ప్రత్యర్థులను మట్టుబెట్టే తంత్రాన్ని పుతిన్ అమలు చేస్తాడన్నది తెలిసిందే. ప్రస్తుతం రష్యాదాడుల్లో గాయపడిన ఉక్రెయిన్‌వాసులను 'యాంటీమైక్రోబ యాల్ రెసిస్టెన్స్' అనేవింత ఇన్‌ఫెక్షన్ సోకుతోంది. సాధారణంగా వాడే యాంటి బయాటిక్స్‌తో పాటు అత్యంత శక్తివంతమైన విదేశీ యాంటిబయాటిక్స్‌ను దిగుమతి చేసుకుని మరీ వినియోగిస్తున్నప్పటికీ అతి కొద్దిమంది మాత్రమే బతికి బట్టకడుతున్నా వారి శేష జీవితాలు అనుమానమేనని ఉక్రెయిన్ వైద్యనిపుణులే చెపుతున్నారు. యుద్ధగాయాలకు చికిత్స అందించే అనేక క్లినిక్‌లలో ఈఎం ఆర్‌కేసులే ఎక్కువ ఉన్నాయి. వాస్తవానికి ఈ ఎఎంఆర్ ఇన్‌ఫెక్షన్‌తో రెండేళ్ల గణాంకాలు చూస్తే ప్రపంచంలో మొత్తం 14లక్షలమంది చనిపోయా రు. గతఏడాది బ్రిటన్‌లో యాంటిబయాటిక్ రెసిస్టెంట్ ఇన్ఫెక్షన్లు 67వేలవరకూ నమోదయ్యాయి. ఉక్రెయిన్‌లో మాత్రం కేవలం రష్యా దండయాత్రలో వినియోగించిన ఆయుధాల కారణంగానే ఈ వింత బ్యాక్టీరియా కేసులు అనూహ్యంగా పెరుగుతున్నట్లు తేలింది. ఆ చిన్న దేశంలో యాంటిబయాటిక్స్‌ను కూడా తట్టుకుని వ్యాప్తిచెందే వైరస్‌లు ఉత్పత్తి అవుతున్నాయంటే ఆదేశానికి ప్రపంచ దేశాల వైద్యసాయం అనివార్యం అనిపిస్తోంది. అందుబాటులో ఉన్న వైద్యవిధానాలతో చేస్తున్నప్పటికీ రష్యా యుద్ధతంత్రంలో ఈ రసాయన ఆయుధ వినియోగం మరింత పెరిగితే ఉక్రెయిన్ మొత్తం మరుభూమిగా మారుతుందని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ఇప్పటికే లక్షలాది ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఆయుధస్థావరాల పైనా దాడులు జరుగుతుంటే లక్షలాది మంది పొరుగుననే ఉన్న చిన్నదేశాలకు వలసపోయారు. శరణార్థులుగా కొనసాగుతున్నారు. ఈక్రమంలో ఉక్రెయిన్‌ను ఈ ఎం ఆర్ ఇన్ఫెక్షన్లు మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే యుద్ధప్రభావంతో అనేక ఇన్ఫెక్షన్ల బారినపడి ఆసుపత్రులకు వస్తున్నవారు లక్షల్లో ఉన్నారు. కొందరు యుద్ధభూమి నుంచి వెళ్లిపోతుంటే మరికొందరు ఉక్రెయి న్ దేశపరిరక్షణకు యువత రావాలన్న పిలుపుపై వచ్చి స్వచ్ఛందంగా చేరుతున్నారు. అలాంటి వారితోపాటు గత మూడేళ్లుగా యుద్ధభూమిలో ఉన్నవారికి ఈ ఎఎంఆర్ బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు సోకుతున్నాయి. సాధారణ యాంటి బయాటిక్స్ కూడా పనిచేయని ఈ ఇన్ఫెక్షన్ కొనసాగుతూనే మరోపక్క సెప్సిస్ వంటివి కూడా సోకుతున్నట్లు ఉక్రెయిన్ రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు చెపుతున్నారు. అటు ఆర్థికపరంగాను, మానవ వనరులపరంగాను, మౌలిక వనరులపరంగాను అపార నష్టం చవిచూసిన ఈ ఉక్రెయిన్‌ను ఆరోగ్యపరంగా కూడా ఈ వింత వైరస్‌లు, ఇన్ఫెక్షన్లు బాధిస్తున్నాయి. యుద్ధం లేదా సైనికచర్య అంటూ ప్రారంభిస్తే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తనవద్ద ఉన్న అన్ని అస్త్రశస్త్రాలను వినియోగిస్తాడన్నది ప్రపంచ దేశాలకు తెలియనిదికాదు. ఈ క్రమంలోనే తనకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని మట్టుబెట్టడంలో పుతిన్ అందెవేసిన చేయి. విదేశాల్లో ఉన్నవారినిసైతం రసాయన ప్రయోగంతో సులువుగా మట్టు బెట్టే కుతంత్రాలను అమలు చేస్తాడు. ఈ ఆరోగ్య విపత్తు నుంచి ఉక్రెయిన్‌ను రక్షించకపోతే ప్రపంచ చిత్ర పటంలో ఉక్రెయిన్ కనుమరుగయ్యే ప్రమాదం సమీపంలోనే ఉంది. ప్రపంచఆరోగ్యసంస్థ, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికలు తక్షణమే యుద్ధవిరమణకు కార్యాచరణ ప్రారంభించాలి. నిత్యజీవనమే గగనంగా మారుతున్న ఉక్రెయిన్‌కు అటు పాశ్చాత్య దేశాలన్నీ బాసటగానిలవాలి. ఆర్థికంగాను, వనరులు, నిత్యా వసరాల సరఫరాపరంగా ఆదుకోకపోతే ఆకలిచావులతో పాటు వైరస్‌లు చుట్టుముట్టి ఇక ఉక్రెయిన్ కనుమరుగ య్యే ముప్పుతప్పదన్న హెచ్చరికలను అగ్రరాజ్యాలపెద్దలు వెంటనే పరిగణనలోనికి తీసుకోవాలి. అటు నాటోకూటమితోపాటు అభివృద్ధిచెందిన దేశాలు యుద్ధసాయంతోపాటు యుద్ధనివారణకు సైతం రష్యాపై ఒత్తిడి పెంచకపోతే ఈ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల ముప్పు ఇరుగు పొరుగు దేశాలకు సైతం విస్తరించక మానదు. అప్పుడు, ఇపుడున్న వైరస్‌లకు తోడు ప్రపంచదేశాలకు ఈ కొత్త ఎఎంఆర్ ఇన్ఫెక్షన్‌ను మనమే అందించినవారం అవుతాం. ఇప్పటివరకూకరోనా, హెచ్‌ఎంపివి, బర్డ్‌ఫ్లూ వైరస్‌లను ఎదుర్కొంటున్న ప్రపంచం తక్షణ కార్యాచరణకు దిగకపోతే ఈ కొత్త యాంటీ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లపేరిట కొత్త వైరస్ ప్రపంచదేశాలను ముఖ్యంగా యూరోపియన్ దేశాలను చుట్టుముట్టే ప్రమాదం లేకపోలేదు. ఈతరుణంలో యుద్ధాన్ని విరమింప చేస్తానని ఎన్నికల్లో ప్రకటించిన అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఈబృహత్తర బాధ్యతను తన భుజాలపై వేసుకోకుంటే ఉక్రెయిన్ మానవాళికి ఎఎంఆర్ ముప్పు మరో మహమ్మారి అవుతుందని భావించక తప్పదు.

జీవితం అంతకంతకూ తన్మయత్వం నొందించే సాహసకార్యంలా కనిపిస్తుంటుంది. అందులో మనం నేర్చుకోవలసింది, చేయవలసింది ఎంతో ఉంది.



నెహ్రూ

డబ్బులేని వారిని చట్టం శాసిస్తుంది. చట్టాన్ని ధనవంతులు శాసిస్తారు.



గోల్డ్‌స్మిత్

# ఆకాశం ప్రమాదాలకు నిలయం కాకూడదు

**సరైన శిక్షణ లేకుండా అవసరాలకు పైలట్ల సంఖ్య పెంచి వినియోగించుకోవడం మొదలుపెట్టే సాంకేతిక పొరపాట్లతో పాటు అనుభవరాహిత్యం వల్ల ఎక్కువ తప్పిదాలు జరిగే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశాల మధ్య ముఖ్యంగా సరిహద్దు దేశాలమధ్య విభేదాలు చీటికి మాటికి తలెత్తుతున్న నేపథ్యంలో ప్రమాదాలు నివారించడానికి ముందు జాగ్రత్త చర్యలతోపాటు సరైన శిక్షణ సంబంధిత చోదకులకు చాలా అవసరం. ప్రభుత్వాలు ఇందుకు సంబంధించిన విషయాలపై తక్షణం స్పందించటమే కాకుండా అవ గాహనతో కూడిన చర్యలు తలపెట్టిన నాడు చాలా వరకు మనుషుల తప్పిదాలవల్ల సంభవించే ప్రమాదాలు నివారించవచ్చు.**



రావులపాటి సీతారాంరావు

విమానాలు ఆకాశంలో పిట్టల్లా రాలిపోతున్నాయి. విమానయానం సుఖం అని అనుకుంటున్నవారు కూడా విమానాల ప్రమాదాల గురించి పెద్దగా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది.! ఇన్ని విమానాశ్రయాలు పెంచుతున్నాం అంటూ విమానాల సంఖ్య, రవాణా పెంపుదలకు సంబంధించిన సమస్త వివరాలు ఇచ్చే అన్ని దేశాల ప్రభుత్వాలు ఇంత ముఖ్యమైన విషయంలో విమానాల్లో ప్రయాణించే వారితోపాటు సమాజానికి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, ప్రమాదాల కారణాల గురించి, తెలియచెప్పకపోవడం ప్రభుత్వాలు, విమాన సంస్థలూ, తమ బాధ్యతలను విస్మరిస్తున్నారని అనుకోకతప్పదు. వివిధ దేశాల మిలటరీల తగాదాలకు తోడు మిలిటెంట్లు, తీవ్రవాదులు సృష్టించే అనుకోని సంఘటనలూ, వాటితోపాటు కారణాలు అర్థంకాని రీతిలో టేకాఫ్ సమయంలో, ల్యాండింగ్ సమయంలో జరిగే ప్రమాదాలు, విమానాల రక్షణ సంబంధిత విషయాలు ఆలోచించేవారికి వణుకు పుట్టిస్తున్నాయి. గతంలో ఒక విమాన ప్రమాదం అందులో ప్రయాణీకులు ఉన్న విమానానికి ఏదైనా ఆపద సంభవిస్తే ప్రపంచమంతటా అదొక పెద్ద సెన్సేషనల్ న్యూస్ అయ్యేది. తక్షణ నివారణ చర్యలతోపాటు అలాంటి ప్రమాదం ఎలా సంభవించి ఉండవచ్చు అన్న విషయం మీద కూలంకషంగా విచారణలు జరిగేవి. ప్రజలకు స్పష్టంగా కారణాలు తెలిసేవి. విమానయానం మీద విశ్వాసం పెరిగేది. మరొక రవాణా సౌకర్యంకల్పిస్తున్న రహదారులు కూడా యమగుండాలుగా మారిపోతున్నాయి. ఇదివరకు ఎప్పుడో ఒకప్పుడు రోడ్డు ప్రమాదం జరిగేది. బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న నదిలో ఎత్తుమీది నుంచి పడిపోవడంతో పదిమంది ప్రాణాలు వదిలారు అన్న వార్త పత్రికల్లో చదవగానే దాదాపు ఆ చుట్టుపక్కల ఉన్నగ్రామాల ప్రజలు తండోపతండాలుగా ఆ ప్రమాద స్థలం వీక్షించటమే కాకుండా అనేక విశ్లేషణలు అందించడంతోపాటు ప్రమాదంలో చిక్కుకున్న కుటుంబాలవారికి నాలుగు ఓదార్పుమాటలు చెప్పి, అందులో డబ్బులేని వారికి తృణమో పణమోఅందించి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలగురించి ప్రభుత్వ పెద్దలతో చర్చించి తగు రీతిలో నివారణ చర్యలు తీసుకొనేవారు. ప్రభుత్వాలు కదిలివచ్చి ప్రతిదానికీ సహాయపడాలన్న ఆలోచన అప్పటికి రాజకీయ స్వార్థం ఉండకపోవడం వల్ల కలగకపోయి ఉండవచ్చు. ఆకాశంలో ప్రయాణం, రహదారుల మీద ప్రయాణం, నీళ్లలో ప్రయాణం అన్ని ప్రయాణాలూ ప్రమాద భరితంగా మారాయి. చేరాల్సినచోటుకుచేరకుండా, స్వర్గమో నరకమో తెలియని స్థలానికి, అకస్మాత్తుగా ప్రయాణించడం ఆపే బాధ్యత ప్రభుత్వాలూ, సంబంధిత అధికారులూ ప్రజలూ సక్రమరీతిలో ఎందుకు తీసుకోలేకపోతున్నారు? యాక్సిడెంటల్ ప్రమాదాలు ఎక్కడ జరిగినా అనుకోని రీతిలో, మనుషుల ప్రమేయం లేని రీతిలో ప్రమేయంతోనో దెబ్బకు దెబ్బ తీయడానికో గగన సీమలో ఆధిపత్యం సంపాదించుకోవడానికి జరిగే ఈ విమానాల విధ్వంసం వల్ల ఘోర ప్రాణనష్టం కలిగించే ఎంతపెద్ద దేశానినైనా మానవాళి క్షమించకూడదు. సాంకేతిక తప్పుల వల్లనో అలాంటి కారణాల వల్లనో జరిగే నష్టాలకు సంఘటనలకు, మాత్రమే ఈ విశ్లేషణ పరిమితమవటం సమంజసం. ఆకాశంలోని విధ్వంసకాండ ఈ మధ్య పెరుగుతుండటంవల్ల తగుస్థాయిలో ఇలాంటి సంఘటనలు అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతగానో ఏర్పడింది. 1983 సెప్టెంబర్ ఒకటి నాడు కొరియన్ ఎయిర్‌లైన్స్ జెట్ ఫ్లయిట్ 007ను పేల్చివేయడం, గడిచిన సంవత్సరాలలో జరిగిన ప్రముఖ దుర్ఘటనగా లెక్కేసుకుంటే ఆ తర్వాత కాలంలో ఎన్నో జరగటంఅత్యంత దారుణంగా భావించక తప్పదు. ఆధునిక విజ్ఞానం ధ్వంస రచనకు ఉపయోగపడటం ఘోరమైన పాపంగా పరిగణించి ప్రపంచ దేశాలు తగు విధమైన శిక్షలతోబాటు ఇలాంటి దుర్ఘటనను కట్టడి చేసినప్పుడే భవిష్యత్తు బాగుంటుంది.




ఈ దుర్ఘటనలో 246 మంది ప్రయాణికులతోపాటు 23 మంది క్రూ మెంబర్స్ మరణించారు. న్యూయార్క్ నుంచి సియోల్‌కు ప్రయాణిస్తున్న ఈ విమానాన్ని రష్యన్ ఎయిర్ ఫోర్స్ సుఖోయ్‌ఫైటర్‌ప్లేన్, కొరియన్ విమానం నావిగేషన్ ఎర్రర్ వల్ల ఫ్లైట్‌పాత్ తప్పటంతో కూల్చేసింది. మరింత దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ఈ కూల్చివేయబడ్డ విమానంలో హన్స్ఎప్రామ్ సన్-యాబ్ కూతురుఉండటం, హన్స్ విమానప్రమాదాల్లో చనిపోయేవారి కోసం ఒక సంస్థను నిర్మించిన వితరణ శీలి కాప్టన్ ఎ రంగనాథన్ అనే పైలట్ ఇన్‌స్ట్రక్టర్ ఈ విషయాలన్ని ఒక ప్రముఖ దినపత్రికలో రాసిన వ్యాసం వల్ల తెలియని విషయాలు చాలా తెలిసాయి. 1988 జులై 3న ఇరాన్ విమానాన్ని (ఫ్లైట్655)ను యు.యస్ నావీ వార్‌షిప్ కూల్చేసింది. 290 మంది ఈ దుర్ఘటనలో చనిపోయారు. పొరపాటున నేవీ మిసైల్ ఈ విమానాన్ని ఫైటర్ ప్లేన్‌గా భావించి కూల్చేసింది. ఇలాంటి పొరపాట్లు, గ్రహపాటు వల్ల ఎన్నో జరిగినా, ఇక ముందు పొరపాట్లకు 'సారీ' చెప్పటంతో సర్దేయకుండా నిర్దిష్టమైన చర్యలు తలపెట్టినప్పుడే యాక్సిడెంటల్‌గా జరిగే విమాన ప్రమాదాలతోపాటు ఇలాంటి సాంకేతిక తప్పుల వల్ల జరిగే ప్రమాదాలు కూడా అనవసరంగా పెరిగే ప్రమాదం ఉంది. గుర్తింపు లోపాల వల్ల ఇలాంటి ప్రమాదాలు జరగడం ఈ ఆధునిక యుగంలో అందునా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆయుధంగా మారిందని ఉబ్బితబ్బిబ్బు అవుతున్న దేశాలకు ఎంతటి ఘోరమైన అవమానంగా భావించాలి? ట్రాక్ డీవియేషన్, వాతావరణ మార్పుల వల్లనో, నావిగేషన్ సిగ్నల్స్ అందనప్పుడో పొరపాట్లు జరిగినప్పుడు నిర్దిష్టమైన నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు 2017, ఫిబ్రవరి 16 నాడు ఇండియన్ జెట్ ఎర్‌వేస్ ఫ్లైట్ 330 మంది ప్రయాణీకులతో, 15 మంది కూమెంబర్లతో ముంబాయి నుంచి లండన్‌కు వెళ్తున్నది. 36వేల ఫీట్ ఎత్తుపై ఫ్లైట్ ఇన్‌ఫర్‌మేషన్ ప్రాంతాల మీదుగా, రేడియోకాంటాక్ట్ మెయిన్‌టైన్ చేయకుండా ఎగురుతున్నప్పుడు ట్రాక్ నుంచి డీవియేట్ కానప్పటికిని, జర్మన్ ఎయిర్‌స్పేస్ అవటం వల్ల యూర్ ఫైటర్స్‌ను ఇంటర్ సెప్ట్ చేయడానికి డిప్లాయ్ చేయడంతో జెట్ ఎయిర్‌వేస్ ఫ్లైట్ పొరపాటు గ్రహించి వెంటనే ఎమర్జెన్సీ ఫ్రీక్వెన్సీ ద్వారా జర్మన్ కాల్స్‌కు స్పందించింది. దాంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిర్దిష్టమైన ట్రయినింగ్ ప్రోగ్రామ్స్ మనదేశం ఈ ఫీల్డ్‌లో ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనాఉంది. సిగ్నల్స్ జామ్అయితే ఏం చేయాలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ఉన్నాయి. వాటిని శిక్షణ ద్వారా నిరంతరం పైలట్లనూ, క్రూనూ తీర్చిదిద్దటం వల్ల అనవసరపు తప్పిదాలు, నావిగేషన్ పొరపాట్లు జరిగినా బయటపడేందుకు మార్గాలు తెలుసుకున్న వారవుతారు. ఆ విధంగా ప్రమాదాలను నివారించే అవకాశాలుపెరుగుతాయి. సరైన శిక్షణ లేకుండా అవసరాలకు పైలట్ల సంఖ్య పెంచి వినియోగించుకోవడం మొదలుపెడితే సాంకేతిక పొరపాట్లతో పాటు అనుభవరాహిత్యం వల్ల ఎక్కువ తప్పిదాలు జరిగే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశాల మధ్య ముఖ్యంగా సరిహద్దు దేశాలమధ్య విభేదాలు చీటికి మాటికి తలెత్తుతున్న నేపథ్యంలో ప్రమాదాలు నివారించడానికి ముందు జాగ్రత్త చర్యలతోపాటు సరైన శిక్షణ సంబంధిత చోదకులకు చాలా అవసరం. ప్రభుత్వాలు ఇందుకు సంబంధించిన విషయాలపై తక్షణం స్పందించటమే కాకుండా అవగాహనతో కూడిన చర్యలు తలపెట్టిన నాడు చాలా వరకు మనుషుల తప్పిదాలవల్ల సంభవించే ప్రమాదాలు నివారించవచ్చు. ఆకాశంలో అలావుంటే, రోడ్లమీద పరిస్థితులు రోజురోజుకూ ఘోరంగా దిగజారుతున్నాయి. రోడ్డు ప్రయాణం సుఖవంతంగా మార్చాలంటే రహదార్ల తక్షణం పద్ధతి ప్రకారం బాగు చేయక తప్పదు. కనీసం రోడ్ల మీద గతుకులను అయినా పూడ్చివేసి వాహనాలు తిరిగే రీతిలో సిద్ధపర్చకపోతే యమపురికి సిమెంట్ రోడ్డువేసినట్లుగానే భావించక తప్పదు. రోడ్డుకు సంబంధించిన రూల్స్, ట్రాఫిక్ సిగ్నల్స్ స్వయంగా పాటించాల్సిన నిబంధనలను పక్కకు పెట్టిప్రభుత్వాలనూ ట్రాఫిక్ పోలీసులనూ మాటిమాటికీ తప్పుపడితే ప్రయోజనం ఏముంది? నష్టం రోడ్డును ఉపయోగించే ప్రజలకు తప్ప! రోడ్ల మీద జరిగే ప్రమాదాల నివారణ గురించి ఎన్నో సూచనలూ, సలహాలూ, (సంబంధించిన సాహిత్యం పంచిపెట్టడం లాంటివి)ఎన్నోఅనుభవపూర్వకంగా పొందుతున్నాం. కానీ 'రోడ్ సెన్స్'ను ఏర్పరుచుకొని ఆచరణలో పెట్టడానికి మాత్రంసిద్ధపడటం లేదు. ఇతరదేశాలు ఎంతో ముందున్నాయి. ట్రాఫిక్ సెన్స్ పాటించడంతో అని చెప్పుకొని సంతోషపడ్తున్నాం కానీ మనం ఈ విషయంలో వెనుకబడి ఎంతో నష్టపడుతున్నాం అని గ్రహించలేకపోతున్నాం. ప్రగతి ఈ విషయంలోనైనా సాధించే ప్రయత్నంలో ఉందాం. ●

# దశాబ్దపు నుంచి నీతి ఆయోగ్ పాత్ర ఏమిటి?

డాక్టర్. పిఎస్. చారి

నీతి ఆయోగ్ అనేది భారతప్రభుత్వం ప్రధాన విధానం. 65 సంవత్సరాల వారసత్వాన్ని కలిగి ఉన్న ప్రణాళికా సంఘం స్థానంలో నీతిఆయోగ్ భర్తీ చేయబడింది. దేశం ఆర్థికవృద్ధికి ఊతమిస్తుందని భావిస్తున్న ప్రధాన విధాన రూపకల్పన సంస్థ. ఇది భారతదేశం ప్రపంచంలోనే ప్రధాన ఆర్థికవ్యవస్థగా ఎదగడానికి సహాయపడుతుంది. ప్రజలు తమ భాగస్వామ్యం ద్వారా పరిపాలనలో అభివృద్ధితోపాటు, కార్యక్రమాల అమలుకోసం సాంకేతికతను మెరుగుపరచడం, సామర్థ్యాన్ని పెంపొందించడం, సంభావ్యతను బలోపేతం చేయడానికి అవసరమైన వనరుల గుర్తింపుతోసహా కార్యక్రమాల అమలును సమర్థవంతంగా పరీక్షించడం, అంచనా వేయడం, జాతీయ అభివృద్ధి ఎజెండా లక్ష్యాల అమలుకు అవసరమైన ఇతర కార్యకలాపాలను చేపడుతుంది. నీతి ఆయోగ్‌లో భారతప్రధాని చైర్‌పర్సన్. పాలకమండలిలో అన్నిరాష్ట్రాల ముఖ్యమంత్రులు భారతదేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు ఉంటారు. ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలను ప్రభావితం చేసేనిర్దిష్ట సమస్యలు అవకాశాలను పరిష్కరించడానికి ప్రాంతీయ కౌన్సిల్‌లు సృష్టించబడతాయి. ఇవి నిర్ణీతకాలానికి ఏర్పాటు చేయబడతాయి. ఇందులో రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు ఉంటారు. నీతి ఆయోగ్ సమర్థవంతమైన పాలన ఏడుస్తంభాలైన ప్రజల అనుకూల, అనుకూల కార్యాచరణ, ప్రజల భాగస్వామ్యం, సాధికారత, అందరినీ చేర్చడం, సమానత్వం, పారదర్శకత మొదలైనవిపై ఆధారపడి ఉంటుంది. నీతిఆయోగ్ ప్రచురించిన పత్రాలు మొదటిది 15సంవత్సరాల విజన్, ఇదిరాబోయే 15సంవత్సరాలలో దేశంమొత్తం లక్ష్యాలను కలిగి ఉంటుంది. రెండవది 7సంవత్సరాల 'వ్యూహం', ఇది ఆ లక్ష్యాలు లక్ష్యాలను రెండుభాగాలుగా విభజిస్తూ వచ్చే ఏడు సంవత్సరాల అభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను నిర్దేశిస్తుంది. థర్డ్ అండ్ ఫైనల్ అనేది 'మూడుసంవత్సరాల యాక్షన్ ఎజెండా', ఇదిరాబోయే మూడుసంవత్సరాల కాలవ్యవధిలో సాధించాల్సిన పనులు లక్ష్యాలను తెలియజేస్తుంది, వ్యూహాన్ని మరింతగా రెండు భాగాలుగా విభజిస్తుంది. నీతిఆయోగ్ భారతదేశంలో ప్రణాళిక ప్రాథమిక స్వభావాన్ని మార్చింది. పాలసీ మేకింగ్‌లో మార్పు, కొత్తఆవిష్కరణలు, వ్యూహాత్మక కార్యక్రమాలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, డిజిటలైజేషన్, ఆరోగ్యం, విద్య నీటి నిర్వహణలో రాష్ట్రాల పనితీరును కొలిచే సూచీలు, సాంకేతిక నిపుణుల జోక్యం మొదలైనవి నిర్దేశిస్తుంది. ఇది ప్రణాళిక ప్రక్రియలో రాష్ట్రాల ప్రమేయాన్ని పెంచింది. ఉదా: కేంద్రప్రాయోజిత పథకాలు, స్వచ్ఛభారత్ స్కిల్ డెవలప్ మెంట్‌ల పునరుద్ధరణపై ముఖ్యమంత్రుల మూడు ఉప సమూహం హోస్ట్ చేయబడింది. దేశవృద్ధికి దోహద పడే కార్యక్రమాలను సంభావితం చేయడంలో నీతి ఆయోగ్ ముందంజలో ఉంది. ఉదా: డిజిటల్ చెల్లింపు కోసం రోడ్ మ్యాప్, సుస్థిరఅభివృద్ధి లక్ష్యాల అమలు పర్యవేక్షణ మొదలైనవి. ఇదిరాష్ట్రాల మధ్య సహకార భావంతోపాటు పోటీ సమాఖ్య వాదాన్ని పెంపొందిస్తుంది. ఉదా: వివిధ అభివృద్ధి పారామితులపై ర్యాంకింగ్‌ను విడుదల చేయడం. నీతి ఆయోగ్‌కింద స్థాపించబడిన అటల్ ఇన్నోవేషన్మిషన్, భారత దేశంలో ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడంలో ప్రశంసనీయమైన పనిచేసింది. నీతిఆయోగ్ విజయాన్ని ఇలా చెప్పుకోవచ్చు. కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. ప్రైవేట్ లేదా పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్‌ను ప్రభావితం చేయడంలో నీతి ఆయోగ్ పాత్రలేదని చెప్పుకోవచ్చు. భారతీయ సమాజంలో అసమానత పెరుగుతూనే ఉంది. ప్రభుత్వ చర్యలలో సానుకూల మార్పు తీసుకురావడానికి అవసరమైన శక్తి లేకపోవడంతో నీతిఆయోగ్ ఒక మహిమాన్విత మైన సిఫార్సుల సంస్థగా రూపాంతరం చెందింది. కొత్త ప్రణాళికా సంఘానికి తగిన వనరులులేవు. ఇటీవలికాలంలో సంస్థ రాజకీయీకరణ చెందిందనీ, దేశంలో నిర్మాణ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికీ పరిష్కారాలు అందుబాటులో లేవని ఆరోపణలున్నాయి. నీతిఆయోగ్ మరింత ప్రభావ వంతంగా చేయడానికి చర్యలు తీసుకోవాలి. ప్రణాళికా సంఘాన్ని అవసరమైన అధికారాలతో సన్నద్ధం చేయడం, తగిన వనరుల కేటాయింపు అవసరం ఉంది. ●

# ప్రజావాక్కు



## విద్యార్థులపై చదువుల భారం

**రేపటి** భవిష్య భారత దేశానికి మూల స్థంభాలైన విద్యార్థులు విద్యాసంస్థలు పెట్టేఒత్తిళ్లకు బలవుతున్నారు. వారానికి ఏడు రోజుల పాటు రోజుకు పన్నెండు పద్నాలుగు గంటల పాటు చదువులపేర విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలలో బందీలుగా జీవితం గడుపుతూ అతి విలువైన తమ బాల్యాన్ని ర్యాంకులవేటలో పడి పోగొట్టుకుంటున్నారు. ఈఒత్తిడిని తట్టుకోలేక అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైమరీ పాఠశాలల్లో ఉదయం 9గంటలనుండి సాయంత్రం 4గంటల వరకు, యు.పి, ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటలవరకు మాత్రమే తరగతులు నిర్వహించాలి. వీటిలో కూడావారానికి మూడు రోజులు గంటపాటు వ్యాయామం, క్రీడలకు కేటాయించాలి. ప్రభుత్వంఇప్పటికైనా స్పందించి నిబంధనలకు అనుగుణంగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

## పేదలకు మాత్రమే పథకాలు

**అందరికి** ఇల్లుఅనే సూత్రం ఇందిరా గరిబీ హఠావో నినాదంనుండినాలుగోపంచవర్ష ప్రణాళిక కాలంనుండి బాహ్య ప్రపంచంలోకివచ్చి 5వప్రణాళిక కాలంలో పేదరిక నిర్మూలనే పరమావధిగ ప్రాణాళిక రూపొందింది. అయితే ఇప్పటికీ దేశంలో దాదాపు పావు శాతం మందికి సొంత ఇల్లు కలలాగే ఉంది మరోవైపు పేదవాళ్ళు మరింత పేదరికంలోకి వెళ్లగా ధనికులు మరింత ధనికులుగా మారుతున్న విచిత్రపరిస్థితి ఉంటుంది. సామాజిక సంక్షేమంలో భాగంగా గౌరవప్రదమైన జీవితం గడపడం కూడా ఒక హక్కుగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది. నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు అందాలి.

-భారత అవినాష్, జనగామ

## ఆర్‌ఓఆర్ చట్టం అమలు ఎలా సాధ్యం?

**ధరణి-2020**చట్టంఅమల్లో పార్ట్-బికిందఉంది. పోయిన 20 లక్షల ఎకరాలకు పరిష్కారం చూపకనే భూభారతి 2025 చట్టం ఎలా అమలవుతుంది. ఏజెన్సీ చట్టాలరద్దు జరుపకుండా భూ భారతి చట్టం ఎలా అమలు చేస్తారు. స్వతంత్ర భారత్‌లో ఏజెన్సీ చట్టాలు అవసరమా? ఇకనైనా సమగ్ర పరిశీలనతో చట్టాలను సవరించాలి.

- డా॥ రావెళ్ళ వెంకటరామారావు, ఖమ్మం

## సినీరంగం పట్ల సానుకూల దృక్పథం

**దివంగత** సినీ ప్రముఖులతో సన్నిహితంగా ఉన్నది సినీరంగానికి. సహాయ సహకారాలు అందించినది హైదరాబాద్‌లో స్టూడియో నిర్మాణాలకి అనుమతులు జాగాలు ఇచ్చినది తెలుగునట దిగ్గజం ఎన్టీఆర్ విగ్రహాన్ని పార్లమెంటు ప్రాంగణంలో ఏర్పాటు చేసినది మద్రాసునుంచి తెలుగుచిత్ర పరిశ్రమను హైదరాబాద్‌లోకి తరలించినది కాంగ్రెస్ ప్రభుత్వాల్లో పనిచేసిన ముఖ్యమంత్రులే. కానీ సినిమా రంగం వచ్చి ముఖ్యమంత్రి అయిన వారు కాదు. గత కాంగ్రెస్ ముఖ్యమంత్రిల్లానే రేవంత్‌రెడ్డి కూడా సినీ రంగంపట్ల సానుకూల దృక్పథంతోనే ఉన్నారు. ఇటీవల ఆయనపై ప్రత్యర్థులు చేసిన విమర్శల్లో ఏమాత్రం నిజం లేదు.

-మిథునం, హైదరాబాద్

## భారత్‌పై అమెరికా ప్రభావం

**అమెరికా** అధ్యక్షుడిగానాలుగేళ్ల తరువాత మరల రెండవసారి పీఠాన్ని అధిష్టించిన మొదటిరోజే డోనాల్డ్ ట్రంప్ పలు ఫైళ్లపై సంతకాలుచేశారు. ఎన్.ఆర్.ఐ.ల మీదకొరడావిసిరారు. అమెరికాలో జన్మించిన విదేశీయుల పిల్లలకు పౌరసత్యం దక్కకుండా చేసారు. అదీగాక తనదేశంలో మూడో జాతిమనుషులు లేకుండా చేయడం, మొదలైన ఆలోచనలుఆయన మెదడులో గూడు కట్టుకున్నాయి. ఇంకా పూర్వపు అధ్యక్షుడు జో బైడన్ చేసిన నిర్ణయాలన్నిటిని రద్దుచేస్తానన్నారు. ఇక ఆయన వాగ్దానాల్లో ముఖ్యమైనవి ఉక్రెయిన్ - రష్యా మధ్య సంవత్సర కాలంగా జరుగుతున్న యుద్ధాన్ని ఆపుచేయడం, అలాగేఇజ్రయిల్ గాజా మధ్యసయోధ్యకుదర్చడం, మూడో ప్రపంచయుద్ధం జరగకుండా శాంతిని నెలకొల్పుతాననడం, ఇవే కనుక విజయవంతంగా తొం దరగా చేయగలిగితే నోబుల్ బహుమతికి అర్హుడవుతారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## దేశ చరిత్రను మరుస్తున్న నాయకులు

**నేటి** యువతరానికి దశాబ్దాల నాటి భారతదేశ చరిత్ర ఆనాటి నాయకులు దేశానికి అందించిన సేవల గురించి తెలిసి ఉండకపోవచ్చు. దేశానికి మొట్ట మొదటి రాష్ట్రపతి, ప్రధాన మంత్రులుగా పనిచేసిన వారెవరో కొందరికి తెలిసి ఉండకపోవచ్చు. కానీ ఎంతో అనుభవజ్ఞులు విద్యావంతులు, వయసులో పెద్దవారు. ఆర్.ఎస్.ఎస్ చీఫ్‌గా ఎంతో కాలం బట్టి ఉంటున్న మోహన్ భగవత్‌కు దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో తెలియకుండా ఎలా ఉంటుంది. స్వాతంత్ర్య సమర యోధులను అవమానించడానికి ఆయన ఆ వ్యాఖ్యలు చేసినట్టుంది.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బంజార భాషకు ఏదీ రాజ్యాంగ గుర్తింపు?

జటావత్హనుము

బంజార భాష భారతదేశంలో గల ప్రాచీన భాషలలో ఒకటి. కానీ ఈ భాషకు లిపి లేని కారణంగా నిర్లక్ష్యానికి గురి అవుతూ అంతరించిపోయేదశలో ఉన్నదని చెప్ప వచ్చు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మనదేశంలో మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రపంచీకరణ, సరళీకృత, ఆర్థిక విధానాలు ఒకవైపుమరోప్రక్క అమెరికన్ సామ్రాజ్యవాద సంస్కృతి తాకిడికి బలవుతున్న మాతృభాషల ఉనికి, మనుగడ కనుమరుగవక తప్పని పరిస్థితి దాపురించింది. ఆంగ్ల భాషనేడు అంతర్జాతీయంగా రూపాంతరం చెందడం కూడా వారి చలువే అన్నది జగమెరిగిన సత్యం. అందుకే ప్రపంచ వ్యాప్తంగా వేల సంఖ్యలో మాతృభాషలు అంతరించి పోతున్నాయి. అందులో బంజారాలు మాట్లాడే గొర్‌బోలి భాష కూడా ఒకటి అనిచెప్పవచ్చు. అందుకు నిలువెత్తు సాక్ష్యంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలల్లో తెలుగు భాషను ఆంగ్ల భాష అధిగమించినట్లు, తెలుగు కూడా అదే రీతిలో ఇతర గిరిజన భాషలను సైతం అధిగమిస్తున్నాయి. అందులో లంబాడీ (బంజార)భాష కూడా ఒకటి. లంబాడీ గిరిజన భాషకు నేటికీ గుర్తింపు లేదు, లిపి లేదు. వీరు మాట్లాడే భాషలు మౌఖికంగా నోటికే పరిమితం కావడం మూలాన అత్యంత నిరాదరణకు గురవుతున్నాయి. పర్యవసానంగా లంబాడీ (బంజార) తెగల ప్రత్యేక సాంస్కృతిక సాంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. భారత రాజ్యాంగంలోని 5,6 షెడ్యూల్‌లో పేర్కొన్న గిరిజన రాష్ట్రాల్లో 698 తెగలకు చెందిన 10 కోట్ల మంది జనాభా వుంది. మన దేశంలో మొత్తం 1652 భాషలుండగా, గిరిజనులు మాట్లాడే భాషలే సుమారుగా 600 దాకా ఉన్నాయి. భారత రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో ఇప్పటికీ 22 భాషలు అధికారికంగా గుర్తించబడగా, అందులో గిరిజనులు మాట్లాడే మణిపురి, బోడో, కొంకిణి, సంథాలీ భాషలకు మాత్రమే చోటు దక్కింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, లాంటి రాష్ట్రాలలోనే కాకుండా దేశవ్యాప్తంగా దాదాపుగా 20 రాష్ట్రాలలో నివ సిస్తున్న బంజారాలు దాదాపుగా 18 కోట్ల జనాభా కలిగి దేశంలో హిందీ తరువాత అత్యధికంగా తమ సంప్రదాయ భాష గోర్బోలిను మాట్లాడటం జరుగుతున్నది. కానీ అతి



పెద్దసమూహం కలిగిన లంబాడీ భాషకు రాజ్యాంగ బద్ధ గుర్తింపు విషయంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం జరిగింది. కానీ బంజారాలు మాట్లాడే భాష మిగిలిన భాషలు వలె కాకుండా అంతరించే దశలో ఉండటం కోసమెరపు. భాష ద్వారానే సంస్కృతీ సాంప్రదాయాలు ఆచారాలతో బంజారాలు తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నారు. కాని పాలక వర్గాలు బంజారాలతో పాటు కొన్నిరకాలతెగలభాషలకు లిపి లేదన్న సాకుతోనే ఇతర భాషలను వారిపై రుద్దడంతో విద్యాభివృద్ధికి, సమగ్రాభివృద్ధికి దూరమవుతున్నారు. 1956 హైదరాబాద్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనమై భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవతరించిన తరువాత ఆదివాసీ, గిరిజన విద్యార్థుల మీద తెలుగు బలవంతంగా రుద్దబడింది. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం గతపదేళ్ల క్రితం రాజీవ్ విద్యామిషన్ (ఆర్.వి.ఎం) ద్వారా బంజార భాషలో తెలుగు లిపితో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు వాచకాలను ముద్రించి ప్రత్యేక పాఠశాలను నెలకొల్పి ఆయా భాషా సంబంధ బోధకులను కూడా నియమించింది. ఇలాకొంత ప్రయత్నం చేసినా, కాని కొన్ని సాంకేతిక లోపాల వల్ల నేడు పాఠశాలలు పని చేయడం లేదు. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్ బోలిని భాషను చేర్చలన్నా ఈ డిమాండ్ స్వాతంత్రం వచ్చినప్పటి నుండి వివిధరూపాల్లో పోరాడుతున్న, సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవని చెప్పవచ్చు. బంజార తెగ గుర్తింపు పరిరక్షణకు కీలకమైనది గోర్‌బోలి భాష. అది భాష మాత్రమే కాదు. అది బంజార ప్రజల హృదయం ఆత్మవంటిది. ఒకజాతి ఎప్పుడు అయితే తన భాషను పరంపరలో మరచిపోతుందో, తదనంతర కాలంలో భాషతో పాటు జాతి కూడా అంతరించిపోయే ప్రమాదం ఉన్నది. స్వాతంత్రం వచ్చి 75సంవత్సరాలు గడచిపోయిన, బంజారాల భాష గూర్చి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధవహించలేదు కానీ బంజారాలకు, భారతదేశం మొత్తంలో గిరిజనులుగా చేర్చి, భాషకు రాజ్యాంగ హోదా కల్పించాలి. కానీ ఈ దేశంలో వివిధ రాష్ట్రాలలో వివిధ పేర్లతో పిలువబడిన ఒకే భాష ఆచార సాంప్రదాయాలు, ప్రత్యేక లక్షణాలు కలిగినటువంటి తెగగా బంజారాలను గురించి చెప్తారు. ఇకనైనా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 344(1) 351 ప్రకారం రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యుల్లో గోర్‌బోలి భాషను చేర్చాలని, బంజారాల భాషకు తగిన ప్రోత్సాహం అందించి దశాబ్దాలకాలం నాటి డిమాండ్ను నెరవెరచి రాజ్యాంగహోదా కల్పించాలి. బంజార భాషకు న్యాయంచేయాలి. ●

# ఆ 90వేల మంది సరిహద్దులకే!

## ప్రభుత్వ వ్యయం తగ్గించే చర్యల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, జనవరి 26:** రిపబ్లికన్‌నేత డొనాల్డ్ ట్రంప్ పదవిచేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ వ్యయాలు తగ్గించే కార్యాచరణ చురుగ్గా ముందుకు తీసుకువెళుతున్నారు. దేశంలో పన్నులు వసూళ్లు చేసే ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసెస్‌లో కొత్తగా చేరిన 90వేల మంది ఏజెంట్లను సరిహద్దులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. లాస్‌వెగాస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన వెల్లడించారు. వారిలో 88 వేలమందికి ఉద్యోగాలు ఇవ్వడమో లేక నియమించుకునేందుకు ప్రయత్నించడమో చేసాం. ఇపుడు వారిని తొలగించడమో లేదా సరిహద్దులకు పంపించడమో చేసే ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. వారికి తుపాకులు ఇచ్చి బోర్డర్స్‌కు పంపించడమే సరైన పని అని భావిస్తున్నట్లు ట్రంప్ అన్నారు. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన కొన్ని గంటల్లోనే ఫెడరల్ ఉద్యోగుల నియామకాలను 90రోజులపాటు స్తంభింపచేస్తూ ఆదేశాలు జారీ చేసారు. జాతీయభద్రత, ప్రజారక్షణ విభాగాలకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. కానీ ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ విభాగం మాత్రం ట్రంప్ కార్యవర్గం డిపార్టుమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ ఆదేశాలు ఇచ్చేవరకూ ఆపేయాలి. మరోవైపు ట్రంప్ కొత్తతరహా ఎక్స్‌టర్నల్ రెవెన్యూ ఆఫీస్ ప్రారంభిస్తున్నారు. విదేశాల నుంచి పన్నులు ఇతర మార్గాల్లోవచ్చే ఆదాయాలను అదే వసూలు చేస్తుంది. తాజాగా అమెరికాలో కొత్తప్రభుత్వం కెనడా, మెక్సికోలపై భారీగా ట్యారిఫ్ విధించనున్నది. వీటిని కూడా ఆ కార్యాలయమే చూసుకుంటుంది. మరోవైపు అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డైవర్సిటీ, ఇంక్లూజన్ ప్రోగ్రామ్‌లను నీర్వీర్యంచేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకంచేసారు. ఈక్రమంలోనే సిబ్బంది నిర్వహణ కార్యాలయం మెమో విడుదల చేసింది. ఈ మెమోప్రకారం డైవర్సిటీ ఈక్విటీ ఇంక్లూజన్ సిబ్బంది అందరినీ వేతనంతోకూడిన సెలవుపై పంపించాలని సంబందిత ఏజెన్సీలకు ఆదేశాలు వెళ్లాయి. ఈ విభాగాలకు చెందిన అన్ని వెబ్‌పేజీలను కూడా ఈ గడువులోగా తొలగించాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేసారు. అదే సమయంలో డిఈఐ శిక్షనను తక్షణమే ముగించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.

**ఇజ్రాయెల్‌కు ఎంకె-84 బాంబుల సరఫరాకు ఓకే:** గాజాలో విధ్వంస తీవ్రతను తగ్గించేందుకు గత బైడెన్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పక్కనపెట్టారు. ఇజ్రాయెల్‌కు రెండువేల పౌండ్ల బరువున్న బాంబులను అమెరికా సరఫరాచేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ విషయాన్ని శ్వేతసౌధం వర్గాలు వెల్లడించాయి. రానున్న రోజుల్లో దాదాపు 1800 ఎంకె-84 బాంబులను ఇజ్రాయెల్‌కు సరఫరాచేస్తారు. వీటిని బంకర్ బస్టర్లు అని కూడా పిలుస్తారు. ట్రంప్‌నిర్ణయాన్ని ఇప్పటికే పెంటగాన్‌ప్రతినిధులు ఇజ్రాయెల్‌కు వెల్లడించారు. గతంలో ఈ బాంబులను జనావాసాలపై వాడుతున్నారని ఆందోళనలు వ్యక్తం కావడంతో బైడెన్ వీటిని నిలిపేసారు. దీనితో అవి గోదాముల్లోనే ఉండిపోయాయి. ఈ నిర్ణయంతో ఇరుదేశాలమధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇజ్రాయెల్‌స్వయంగా దేశంలో ఈ బాంబులను తయారుచేసుకోవాలని నిర్ణయించింది కొన్ని రక్షణ సంస్థలకు కాంట్రాక్టులు కూడా ఇచ్చింది. వాస్తవానికి గతంలోనే సుమారు 10వేలకుపైగా ఎంకె-84 బాంబులను ఇజ్రాయెల్‌కు సరఫరాచేసింది. అమెరికాలో ఇజ్రాయెల్ రాయబారి మైక్ హెర్జోగ్ స్పందిస్తూ బైడెన్ నిర్ణయాన్ని ట్రంప్ రద్దుచేస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు. తాజాగా ఎంకె-84 సరఫరాను పునరుద్ధరిస్తూ అమెరికానిర్ణయం తీసుకోవడంతో ఇపుడు మళ్లీ ఈ బాంబులు సరఫరా మొదలవుతుంది.



# ఢిల్లీ ఎన్నికలు దేశం మొత్తం జరిగే రాజకీయ పోరు!

## ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, జనవరి 26:** అసెంబ్లీ ఎన్నికలను మొత్తం దేశానికి జరుగుతున్న రాజకీయ పోరుగా భావించాలని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఈ ఎన్నికల్లో రెండు పరస్పర విరుద్ధ సిద్ధాంతాలమధ్య పోటీ నెలకొందని ఒకటేమో ప్రజాసంక్షేమంపై దృష్టిసారించగా మరొకటి కొంతమంది సంపన్నులకు ప్రయోజనం చేకూర్చుతోందని అన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కారు గత ఐదేళ్లలో 400 నుంచి 500 మంది పారిశ్రామికవేత్తలకు చెందిన రూ.10 లక్షలకోట్ల రుణాలను మాఫీచేసిందని ఆరోపించారు. పన్ను చెల్లింపుదారుల డబ్బును ఎలా ఖర్చుచేయాలో ఈ ఎన్నికలకు నిర్ణయిస్తాయని బిజెపి మోడల్‌ప్రకారం రూ.వేల కోట్ల ప్రజాసొమ్మును ఆ పార్టీ తన సన్నిహితులకు రుణాలుగా ఇచ్చి ఆ తర్వాత మాఫీచేస్తుందని, అదే ఆప్ మాత్రం సామాన్యులకు మేలు చేకూర్చేలా ఉచిత విద్యుత్ విద్య వైద్యం రవాణా సౌకర్యాలపై దృష్టిపెడుతుందని ఢిల్లీలోని ప్రతి ఇంటికి నెలకు రూ.25వేల విలువైన ప్రయోజనాలు అందిస్తుందని కేజ్రీవాల్ అన్నారు. ఒకవేళ బిజెపిఅధికారంలోకి వస్తే స్థానికంగా ఆప్‌ప్రవేశపెట్టిన పథకాలన్నీ నిలిపివేస్తుందన్నారు. తాము ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఉచితాలుగా బిజెపి పేర్కొనడాన్ని కేజ్రీవాల్ ఖండించారు. ఒకవైపు బడా వ్యాపారులకు భారీ రాయితీలిస్తూ మధ్యతరగతి ప్రజల్లో మాత్రం అపరాథ భావనను సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉచిత విద్యుత్, మహిలలకు ఫ్రీబస్ వంటిపథకాలు నిలిపేస్తామని బిజెపి ఇప్పటికే చెప్పింది. ఒకవేళ ఆపార్టీ ఎన్నికైతే మీరు ఈ వ్యయాలు భరించగలరా అని ప్రజలను ప్రశ్నించారు. 70స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి వచ్చేనెల ఐదున పోలింగ్ ణిర్వహిస్తుండగా 8న ఓట్లలెక్కింపు చేపట్టనున్నారు.

# భారీ వర్షంతో కార్చిచ్చుప్రాంతానికి ఉపశమనం



**న్యూయార్క్, జనవరి 26:** అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లోని వేలభవనాలు భారీ విస్తీర్ణంలో అడవులు కార్చిచ్చుకు కాలి బూడిదైపోతున్నాయి. ఈ ప్రభావం తగ్గించేందుకు అగ్నిమాపక బృందాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నవేళ వరుణుడు కరుణించాడు. కార్చిచ్చు ప్రభావిత దక్షిణ కాలిఫోర్నియాలో ఈ సీజన్ తొలివర్షం నమోదయింది. కొత్తగా మంటలు చెలరేగకుండా ఈ వర్షం కట్టడిచేస్తుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో కాలిపోయిన కొండప్రాంతాలనుంచి వచ్చే విషపూరిత బూడిద ప్రవాహం కొత్త సమస్యలు తెచ్చిపెట్టే ప్రమాదముందనే ఆందోళన మొదలయింది. అగ్నిప్రభావితప్రాంతాల్లో వృక్షాలను తొలగించడం, ధ్వంసమైన రోడ్లను బాగు చేయడం వంటిపనుల్లో లాసెంజెల్స్ కౌంటీ సిబ్బంది నిమగ్నం అయ్యారు. ఇదే సమయంలో ఈప్రాంతంలో వర్షం కురవనున్నదని వాతావరణశాఖ వెల్లడించింది. కార్చిచ్చు ప్రభావిత ప్రాంతాల్లో శనివారం రాత్రి చిన్నపాటి వర్షం మొదలుకాగా మరో మూడురోజులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కొన్నివారాలుగా ఉక్కిరిబిక్కిరి అవుతున్న అనేకప్రాంతాలకు ఈవర్షం ఊపిరిపోసినట్లయింది. మరోవైపు కొండ ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ సంభవిస్తే థిశిలాలు బూడిద వంటివి దిగువప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. ఇందుకోసం సిద్ధం కావాలని నేషనల్ వెదర్ సర్వీస్ వెల్లడించింది. కార్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాటరీలుభవన నిర్మాణ సామగ్రి ఫర్నీచర్లతోపాటు ఇతర వస్తువుల్లో ఉండే రసాయన పదార్థాలు అస్బెస్టాస్ ప్లాస్టిక్ సీసం వంటివి పర్యావరణంపై తీవ్రప్రభావం చూపనున్నాయనే ఆందోళన మొదలయింది. దీనితో ఈ కాలుష్య కారకాల ప్రభావాన్ని తగ్గించేందుకు స్థానిక ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నది.



# అమెరికా మాకు సైనిక సాయం ఆపలేదు

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**వాషింగ్టన్, జనవరి 26:** విదేశాలకు అగ్రరాజ్యం అందించే అన్ని రకాల సాయాలను 90 రోజులపాటు నిలిపేస్తూ కార్యనిర్వాహక ఆదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం తమ దేశానికి అమెరికా సైనిక సాయం ఆపలేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. కష్టసమయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నందుకు అగ్రరాజ్యానికి కృతజ్ఞతలు తెలిపారు. 'ప్రస్తుతం ప్రపంచ దేశాలకు సాయాలను ఆపేస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో నేను ఆందోళనకు గురయ్యాను. కానీ, భగవంతుడి దయ వల్ల మాకు అందించే ఆయుధాలను అగ్రరాజ్యం ఆపలేదు' అని జెలెన్‌స్కీ అన్నారు. కాగా, రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ తన సైనిక అవసరాల్లో 40 శాతం అమెరికాపైనే ఆధారపడింది. ఇప్పటికే 725 మిలియన్ డాలర్ల ప్యాకేజీ, 988 మిలియన్ డాలర్ల సామగ్రిని అందజేస్తామని మాజీ అధ్యక్షుడు జోబైడెన్ గతంలో ఉక్రెయిన్‌కు హామీ ఇచ్చారు. వాషింగ్టన్ నుంచి కీవ్‌కు 2022 నుంచి ఇప్పటిరకు 62 బిలియన్ డాలర్లు ఆయుధాలు, ఇతర సాయం అందించారు. ఉక్రెయిన్‌కు మరో500మిలి యన్ డాలర్ల ఆయుధ సాయం అందిస్తున్నట్లు కొన్నాళ్ల క్రితంనాటి రక్షణమంత్రి ఆస్టిన్ ప్రకటించారు. దాదాపు మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇటీవల ఆయన మాట్లాడుతూ యుద్ధం అనేది అసలు మొదలే కాకూడదని.. తాను అధ్యక్షుడిగా ఉంటే ఉక్రెయిన్‌లో సంక్షోభం వచ్చేది కాదని అన్నారు. త్వరలోనే దీనికి ముగింపు పలుకుతానని హామీ ఇచ్చారు. కీవ్‌లో శాంతి ఒప్పందంపై చర్చలకు రష్యా రాకపోతే.. ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు.

## మహాకుంభమేళా.. త్రివేణి సంగమంలో

# యుపి మాజీ సిఎం అఖిలేశ్‌యాదవ్ పుణ్యస్నానం



**లక్నో, జనవరి 26:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా వైభవంగా సాగుతోంది. దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. రోజుకు కోటి మందికి తగ్గకుండా కుంభమేళాలో పాల్గొంటున్నారు. ఆదివారం నాటికి కుంభమేళా ప్రారంభమై 14 రోజులు కాగా 14 కోట్ల మందికిపైగా ఈ మహా కుంభమేళాలో పాల్గొన్నారు. ఎంతోమంది ప్రముఖులు ఈ మహా కుంభమేళాకు తరలివస్తున్నారు. ఆదివారం భారత్‌కు చెందిన ప్రముఖ బాక్సర్ మేరీకోమ్ కుంభమేళాకు హాజరయ్యారు. కుంభమేళాలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందని ఆమె చెప్పారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్ కూడా ఆదివారం కుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. ఆ తర్వాత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అఖిలేశ్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ మహా కుంభమేళాలో పాల్గొనడం తనకు ఆనం దంగా ఉందని చెప్పారు. అయితే ఈ కుంభ మేళాను రాజకీయం చేయడం కరెక్టు కాదని అన్నారు. పాలకులు గొప్పలకు పోకుండా కుంభ మేళాను కుంభమేళా లాగానే చూడాలని అన్నారు. కుంభమేళాకు వచ్చిన భక్తులకు ఆటల పోటీల్లో పాల్గొన్నట్లు ఉండకూడదని, అన్ని సవ్యంగా జరగాలని పేర్కొన్నారు. వృద్ధులకు సరైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

# దేశానికి బిజెపినేతలుచేసిందేమీలేదు..ప్రగల్భాలే..!

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, జనవరి 26:** భారత దేశం స్వాతంత్ర్యం సాధించడానికి తనకంటూ ఒక పరిపాలనా వ్యవస్థను ఏర్పరుచుకోడానికి కాంగ్రెస్ ఎంతో కృషిచేసిందని ఆపార్టీ అధినేత మల్లిఖార్జునఖర్గే పేర్కొన్నారు. ఇప్పటికి కూడా కాంగ్రెస్ రాజ్యాంగ రక్షణ దేశప్రజల్లో ఐక్యతకోసం నిరంతరం పోరాడుతోందని అన్నారు. కానీ దేశం కోసం ఏమీచేయని బిజెపినేతలు రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారని ఆందోళన వ్యక్తంచేసారు. బిజెపి ఆధ్వర్యంలోనికేంద్ర ప్రభుత్వం దేశంలో రాజ్యాంగ విలువలనుతుడిచిపెడుతోందని అన్నారు. ముఖ్యంగా మహిళల హక్కులను అణగదొక్కడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భారత్‌నుప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దుతాయని ప్రధాని పదేళ్లుగా చెపుతున్నారు. మనదేశం ఐదోస్థానానికి మించి ముందుకువెళ్లడంలేదని ఆగ్రహం వ్యక్తంచేసారు. కాంగ్రెస్ నేతృత్వంలోనియుపిఎ అధికారంలో ఉన్నపుడు భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంటే బిజెపి దానిని ఐదో స్థానానికి తగ్గించిందన్నారు. బిజెపినేతలు ప్రగల్భాలేకానీ దేశానికిచేసిందేమీ లేదన్నారు. కేంద్రం పేదప్రజలను చిన్నచూపు చూస్తూ ధనవంతులకు గరిష్టప్రయోజనాలు, సౌకర్యాలు కల్పిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ ఇండోర్‌లో గాంధీభారత్ అనే కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. దేశ స్వతంత్రతను దెబ్బతీస్తూ స్వాతంత్ర్య సమర యోధులను విమర్శిస్తూ బిజెపిచేస్తున్న కుట్రలను ప్రజలకు వెల్లడిస్తామన్నారు. ప్రధానిమోడీ పాలనలో స్వయంప్రతిపత్తికల ఎన్నికల సంఘం ఈడీ, సిబిఐ తదితర వాటిలో రాజకీయ జోక్యం ఆనవాయితీగా మారిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అక్రమాలకు అడ్డులేకుండాపోతోందని ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేసారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారరని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశధోరణి కారణంగా పార్లమెంట్ సమావేశాలు కూడా సరైన పద్ధతిలో జరగట్లేదని అన్నారు. ఎస్టీ, ఎస్సీ, ఒబిసి మైనార్టీలను రెండోతరగతి పౌరులుగా చూస్తున్నారని అన్నారు.

# గ్రీన్‌లాండ్ కోసం డెన్మార్క్ ప్రధానికి బెదరింపులు

## ఆ దేశాన్ని సుంకాలతో శిక్షిస్తానన్న ట్రంప్



**వాషింగ్టన్, జనవరి 26:** అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన కొన్ని రోజులకే డొనాల్డ్ ట్రంప్ ఇతర దేశాలపై బల ప్రదర్శనకు దిగుతున్నారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్‌పై ట్రంప్ బెదరింపులకు పాల్పడ్డారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. డెన్మార్క్‌ను సుంకాలతో శిక్షిస్తానని ట్రంప్ ఫోన్ కాల్‌లో హెచ్చరించినట్లు ఆ కథనం పేర్కొన్నది. ఇటీవల వీరిద్దరి మధ్య 45 నిమిషాలపాటు సాగిన ఫోన్ కాల్ సంభాషణలో అధ్యక్షుడు ట్రంప్ తప అభిప్రాయాలను ఘాటైన స్వరంతో వినిపించారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ మాటన్ని డెన్మార్క్ ప్రధాని తోసిపుచ్చటంతో, ట్రంప్ మాటల ధోరణి వేరే విధంగా మారిందని, ఒక దశలో బెదరింపులకు పాల్పడ్డారని ఆ అధికారులు పేర్కొన్నారు. ఇద్దరి మధ్య వాగ్వాదం కూడా చోటుచేసుకుందని, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే విషయంలో తాము సీరియస్‌గా ఉన్నామని ట్రంప్ చెప్పినట్లు సమాచారం. అయితే దానిని అమ్మడంపై తమకు ఎలాంటి ఆసక్తి లేదని డెన్మార్క్ ప్రధాని సమాధానమిచ్చారట. ఫోన్‌కాల్‌లో ట్రంప్ సంభాషించిన తీరుకు తాము దిగ్భ్రాంతికి గురయ్యాయమని అధికారులు వెల్లడించారు. డెన్మార్క్ తిరస్కరణతో అమెరికా నుంచి ప్రతీకార చర్యలు ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

# అవినీతికేసులో రాజపక్ష కుమారుడి అరెస్టు



**కొలంబో, జనవరి 26:** అవినీతికేసులో శ్రీలంక మాజీ దేశాధ్యక్షుడు వమీంద రాజపక్స కుమారుడు యోషితా రాజపక్సను అరెస్టుచేసారు. ఒక స్థిరాస్థికొనుగోలు కేసులో యోషితా రాజపక్స పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. బెలియట్టాప్రాంతంలో తన స్వంత ఇంట్లో మాజీ నేవీ అధికారి అయిన యోషితాను అదుపులోకి తీసుకున్నారు. 2015 కంటే ముందు తండ్రి మహీంద రాజపక్స అధికారంలో ఉన్న సమయంలో యోషితా ఒక స్థిరాస్థికొనుగోలు విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు అభియోగాలున్నాయి. కాగా మహీందకు ముగ్గురు కుమారులున్నారు. వారిలోయోషితా రెండో వ్యక్తి. ఇదే ఆస్థికొనుగోలు అంవంలోమరో మాజీ అధ్యక్షుడు గోటబయ రాజపక్సను కూడా విచారించారు. తనకు సెక్యూరిటీ కల్పించాలని కోరుతూ ప్రాథమిక హక్కుల కింద మహీంద రాజపక్ష సుప్రీంకోర్టులో పిటిషన్ వేసారు. ఈనేపథ్యంలో ఆయన కుమారుడిని అరెస్టు చేయడం శ్రీలంకలో సంచలనంగా మారింది. గత ఏడాది నవంబరులో అనురకుమార దిశనాయకే శ్రీలంక అధనయక్షుడుగా ప్రభుత్వం ఏర్పాటుచేసారు. మహీంద పెద్దకుమారుడు నమల్ రాజపక్షను కూడా వేరొక స్థిరాస్థికేసులో పోలీసులు విచారణచేసారు. మహీంద రాజపక్ష పదవీకాలం 2005నుంచి 2015 మధ్య ఎవరు అవినీతికి పాల్పడినట్లు రుజువయినా వారిని అదుపులోకి తీసుకుంటామని విచారణ అధికారులు చెపుతున్నారు.

# గణతంత్ర వేడుకలకు తొలిసారిగా మణ్ణన్ తెగ గిరిజన రాజు



**న్యూఢిల్లీ, జనవరి 26:** గణతంత్ర దినోత్సవ వేడుకలకు మొట్టమొదటిసారిగా ఒక కేరళ గిరిజన రాజు హాజరయ్యారు. ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించిన ఈ వేడుకల్లో కేరళనుంచి ఒకగిరిజన రాజు సతీసమేతంగా హాజరయ్యారు. దేశ చరిత్రలో ఈ గిరిజన రాజు హాజరుకావడం ఇదే మొదటిసారి. ఆయనపేరు రామన్ రాజ మణ్ణన్. కేరళలో మణ్ణన్ తెగకు ఆయన రాజు. ఆదివారం భారత 76వ గణతంత్ర వేడుకలకు ఆయన అతిథిగా వచ్చారు. కేంద్రం తరపున షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు వెనుకబడిన తరగతుల సంక్షేమమంత్రి ఒఆర్‌కేలు ఆయనను వేడుకలకు ఆహ్వానించారు. ఒక గిరిజన రాజును భారత రిపబ్లిక్ వేడుకలకు ఆహ్వానించడం ఇదే తొలిసారి. రాజమణ్ణన్ కేరళలో ఉన్న ఏకైక గిరిజనరాజు. కేంద్రం ఆహ్వానంతో ఆయన తన సతీమణితో కలిసి ఢిల్లీకి చేరారు. ఢిల్లీలోని పలు ప్రాంతాలు కూడా సందర్శించారు. రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొన్న మణ్ణన్ తిరిగి ఫిబ్రవరి 2న కేరళకు వెళతారు. గిరిజన సంక్షేమశాఖ ఆయన ప్రయాణ ఖర్చులు భరిస్తున్నదని మంత్రి ఒఆర్‌కేలు చెప్పారు. కాగా వేడుకల్లో ఒఆర్‌కేసలు మణ్ణన్ సామాజికవర్గానికి చెందిన సాంప్రదాయ దుస్తుల్లో వచ్చారు. ఈ తెగకు చెందిన 300 కుటుంబాలకు రాజుగా రాజమణ్ణన్ కొనసాగుతున్నాడు. ఇడుక్కిజిల్లాలో ఆతడు నివసిస్తాడు. మణ్ణన్ తెగకు చెందిన వివిధ కార్యక్రమాలు పండుగల్లో రాజుకు ప్రత్యేక స్థానం ఉంటుంది. రామన్ రాజమణ్ణన్ 2012లో ఆర్యన్ రాజమణ్ణన్ మరణించిన తర్వాత తన తెగకు ఆయనేరాజుగా పాలిస్తున్నాడు. రాజ యినా కూడా ఆడంబరాలకు పోని రాజమణ్ణన్ సాదాసీదా రైతుగానే కొనసాగుతున్నాడు. ఆతనికి రాజభవనంకానీ, రథం కానీలేవు. తన కుటుంబంతో కలిసి ఒక చిన్న ఇంట్లో ఉంటున్నాడు. స్థానికంగా తెగలో ఆయనకు ప్రత్యేక హక్కులు విధులు అంటూ ఏమీ ఉండవు. తెగ బయటి వారితో తెగకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే ఆయన పర్యవేక్షిస్తారు. అందుకు నలుగురు ఉపరాజులు, ఒక రాకుమారుడు, 50 మందిసభ్యుల మంత్రిమండలి తోడ్పాటునిస్తుంది.

# 100వ రాకెట్ సమయంలో డైరెక్టర్‌గా ఉండటం పూర్వజన్మ సుకృతం

## షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్





శ్రీహరికోటలో మీడియాతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, సిఐఎస్ఎఫ్ గౌరవ వందనం స్వీకరిస్తున్న డైరెక్టర్

**శ్రీహరికోట (తడ), జనవరి 26 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి 100వ రాకెట్ ప్రయోగం జరుగుతున్న సమయంలో తాను ఇక్కడ డైరెక్టర్‌గా పనిచేయడం పూర్వజన్మ సుకృతమని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో ఎంతో ఉద్విగ్నతతో మాట్లాడారు. రాజరాజన్ ఆధ్వర్యంలో షార్ నుంచి ప్రపంచ అగ్ర దేశాలతో పోటీపడే రాకెట్ ప్రయోగాలు జరిగాయి. ఈ నెల 29న జిఎస్ఎల్‌వి-ఎఫ్15 పేరుతో 100వ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీహరికోట ఇంత అభివృద్ధి చెందడానికి కారకులైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ స్థలాన్ని ఎంపిక చేసిన అంతరిక్ష పరిశోధకులు, గతంలో పనిచేసిన ఛైర్మన్లు, డైరెక్టర్లు, ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎంతోమందికి రుణపడి ఉన్నట్లు చెప్పారు. షార్‌లో పనిచేయడం ఒక అదృష్టమని, అందులోనూ అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ రాకెట్ ప్రయోగ సమయంలో తాను డైరెక్టర్‌గా ఉండటం మరచిపోలేని జ్ఞాపకమన్నారు. 100వ రాకెట్ ప్రయోగం సందర్భంగా శ్రీహరికోటలో తుది ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఇక్కడ తాను డైరెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలోనే ఇస్రో కోసం కేంద్రప్రభుత్వం వేల కోట్లు నిధులు మంజూరు చేసిందని, అందులో మూడవ ప్రయోగ వేదిక ఒకటన్నారు. శ్రీహరికోట నుంచి కొత్త ఛైర్మన్ నారాయణన్ ఆధ్వర్యాన ప్రస్తుతం ఈ ప్రయోగం జరుపుతున్నామని ఆయన చెబుతూ గత ఏడాది స్పేడెక్స్ ఉపగ్రహాల అనుసంధానానికి శ్రీహరికోట నుంచి ప్రయోగించిన రాకెట్ విజయవంతం కావడం మరచిపోలేనిదన్నారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము రిపబ్లిక్‌డే సందర్భంగా ఈ గఘనవిజయాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు.


షార్‌లో జరిగే ప్రతి గగన్‌యాన్ పరిశోధనకు ప్రధాని నరేంద్రమోడీ వంటి వారు పూర్తి సహకారం అందిస్తు న్నారని చెప్పారు. రాజరాజన్ వెంట డిడి పి.గోపీకృష్ణ, పిఆర్ఓ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తబడ్జెట్‌లోనే నూతన లేబర్‌కోడ్‌ల ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ, జనవరి 26:** ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో కొత్త కార్మిక స్మృతిని ప్రవేశపెడుతోంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రాబోయే బడ్జెట్‌లో ఈ లేబర్‌కోడ్‌లను దశలవారీగా అమలుచేసే ప్రణాళికను ప్రకటించవచ్చని అంచనా. కొత్త లేబర్‌కోడ్‌లు మూడుదశల్లో వస్తాయి. ఉద్యోగులకు రోజువారి పనిగంటలు పెరుగుతాయి. అలాగే వారానికి నాలుగురోజులే పని చేసే అవకాశం ఉంటుంది. పిఎఫ్‌కోసం కట్‌చేసే సొమ్ము పెరిగితే ప్రతినెలా వచ్చే జీతం తగ్గుతుంది. ఈ కోడ్‌లు అమలుకు మేనేజ్‌మెంట్లకు కొంత గడువు ఇస్తారు. మూడుదశల్లో అమలు చేస్తారు. 2025-26 బడ్జెట్‌లోనే ప్రభుత్వం ఈకోడ్‌లనుప్రకటిస్తే వచ్చే ఆర్థికసంవత్సరంలో అమలుకు వస్తుంది. ఈ లేబర్‌కోడ్‌లు అటు యాజమాన్యాలకు అనువుగా ఉండటమేకాకుండా ఇటు ఉద్యోగులకు మెరుగైన సామాజికభద్రత కల్పించగలవని చెపుతున్నారు.


మొదటిదశలో 500కంటే ఎక్కువమంది ఉద్యోగులున్న పెద్ద కంపెనీలు ఈకోడ్‌లను అనుసరించాలి. రెండో దశలో 100 నుంచి 500 మంది ఉద్యోగులున్న మధ్యతరహా కంపెనీలను ఈ పరిధిలోకి తెస్తారు. మూడోదశలో 100 మందిలోపు ఉద్యోగులున్న చిన్న కంపెనీలపై ఈ కోడ్‌లు అమలుచేస్తారు. ఈ లేబర్‌కోడ్ కొత్తనియమాలు పథకం ప్రకారం ఈ నిబంధనలు అమలుచేయడానికి చిన్న సంస్థలకు సుమారు రెండేళ్లు పడుతుంది. దేశ వ్యాపార నిర్మాణంలో 85శాతం ఎక్కువ వాటా ఎంఎస్ఎంఇలదే. ఈ కోడ్‌లు అమలుకు రాష్ట్రాలతో కేంద్రం చర్చలు జరుపుతోంది. పశ్చిమబెంగాల్, ఢిల్లీ వంటి రాష్ట్రాలతో ముసాయిదా నిబంధనలు ఖరారు చేసేపనిలో కార్మికశాఖ బిజీగా ఉంది. మొదటిదశలో వేతనాలు, సామాజిక భద్రత కోడ్‌ను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే మార్చినాటికి అన్ని రాష్ట్రాలతో ముసాయిదా నిబంధనలు ఖరారు చేయాలని కేంద్రం యోచిస్తోంది.


# పంజాబ్, హర్యానాల్లో రైతు ట్రాక్టర్ల ర్యాలీ



**చండీగఢ్, జనవరి 26:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా పంజాబ్‌రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. తమ పంటలకు కనీస మద్దతుధరపై కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని డిమాండ్‌చేసారు. గణతంత్ర దినోత్సవం రోజున కేంద్రానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ట్రాక్టర్లతో రైతులు నిరసనలు తెలపాలని సంయుక్త కిసాన్‌మోర్చా జనవరి 8న పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఆదివారం పంజాబ్ హర్యానాలతోపాటు పలురాష్ట్రాల్లో రైతులు ట్రాక్టర్లతోర్యాలీ నిర్వహించారు. 2024 ఫిబ్రవరి 13నుంచి పంజాబ్ హర్యానా సరిహద్దులోని ఖనౌరిలో రైతులు నిరసన కొనసాగిస్తున్నారు. పంటలకు కనీస మద్దతు ధరతోపాటు రుణమాఫీ, రైతులు కార్మికులకు పింఛన్లు 2021లో లఖింపూర్‌ఖేరీ హింసా బాధితులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కేంద్రం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే 2020 నుంచి 2021వరకూ ఢిల్లీ సరిహద్దుల్లో చేపట్టిన నిరసనలకంటే పెద్దఎత్తున దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సంయుక్త కిసాన్‌మోర్చా మళ్లీ హెచ్చరించింది.

# జపాన్ టెక్నిక్‌తో కుంభమేళాలో స్వచ్ఛవాయువులు





**ప్రయాగరాజ్, జనవరి 26:** యూపిలోని ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలోజరుగుతున్న ప్రపంచ అతిపెద్ద ఆధ్యాత్మిక మేళాకు యుపి ప్రభుత్వం స్వచ్ఛమైన గాలి వచ్చేందుకు కూడా ఏర్పాట్లు చేసింది. మహాకుంభమేళాకు కోట్లాదిభక్తజనం పోటెత్తుతున్నా స్వచ్ఛమైన గాలికి కొదవలేదు. కారణం జపనీస్ టెక్నిక్ అమలుచేస్తున్నారు. కుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా ఈ మహాఘట్టంకోసం యోగి సర్కారు రెండేళ్లక్రితమే కసరత్తుప్రారంభించింది. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ మియావాకి అనే జపనీస్ సాంకేతికతతో ప్రయాగరాజ్‌పరిధిలో చిట్టడివిని తయారు చేసింది. నగరంలో పదిచోట్ల 18.50ఎకరాల ఖాళీ భూమిలో ఐదు లక్షలకుపైగా 63 రకాల మొక్కలు నాటారు. ఆమొక్కలు ఇపుడు చెట్లుగా ఎదిగి ప్రతిరోజూ స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను వాతావరణంలోకి వదులుతున్నాయి. మియావాకి టెక్నిక్‌తో ప్రయా గరాజ్ మున్సిపాలిటీ సుమారు రూ.6కోట్లను ఖర్చుచేసింది. తక్కువప్రదేశంలో ఎక్కువ సం ఖ్యలో మొక్కలను నాటి పెంచడమే మియావాకి టెక్నిక్ ప్రత్యేకత. ఈ ప్రాజెక్టులో మర్రి, రావి, వేప, చింత, ఉసిరి, రేగి, వెదురు వంటి 63 రకాల చెట్లు ఉన్నాయి. వీటినిర్వహణ కాంట్రాక్టును మూడేళ్ల వ్యవధితో ఒక కంపెనీకి అప్పగించారు.

## పద్మ పురస్కార గ్రహీతలకు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ జనవరి 26 ప్రభాతవార్త ప్రతినిధి:** పద్మ పురస్కారాలకు ఎంపికైన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, కళాకారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. వైద్యరంగంలో అందించిన సేవలకు గాను పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్న గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఏఐజీ హాస్పటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి కి అలాగే, పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన నటులు, ఎమ్మెల్యే బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ ద్వారా సామాజిక సేవారంగంలో ఉన్న నందమూరి బాలకృష్ణ కి, పద్మశ్రీ కి ఎంపికైన సహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మకి , దళిత నాయకులు, ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ కి ఇంకా విద్య, సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేసి పద్మ శ్రీ పురస్కారానికి ఎంపికైన కెవిఎల్ కృష్ణకి, వాదిరాజు రాఘవేంద్రాచార్య పంచముఖి కి శుభాకాంక్షలు తెలిపారు. తమ నటన,అభినయంతో కోట్లాది ప్రేక్షకుల మనసులు గెలిచిన కళామతల్లి ముద్దుబిడ్డలు పద్మభూషణ్ కు ఎంపికైన ఎస్ అజిత్ కుమార్, శోభన చంద్రకుమార్ కి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు చెప్పారు. బుర్రకథ కళాకారులు, జానపద కళాకారులను ఎందరినో తెలుగునేలకు అందించిన స్వర్గీయ మిరియాల అప్పారావు కి మరణానంతరం పద్మ పురస్కారం లభించడాన్ని వారి సేవలకు దక్కిన గౌరవంగా ముఖ్యమంత్రి కొనియాడారు.



కనక దుర్గమ్మపై శంకర నారాయణ రచించిన పాట ఆడియోను విడుదల చేస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

## కనక దుర్గమ్మపై శంకర నారాయణ రచించిన పాట ఆడియో విడుదల

**విజయవాడ,జనవరి 26,ప్రభాతవార్తప్రతినిధి:** సకల జన శ్రేయస్సే,అమ్మలకు అమ్మ శ్రీకనకదుర్గమ్మ కీర్తించడమంటే అనంత ఆలోకికానందం పొందడమని ఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ అన్నారు.అమ్మవారిని స్తుతిస్తే రాసే భక్తిగీతాలకు దేవాదాయశాఖ ప్రోత్సహిస్తోందన్నారు. ప్రముఖ పాథికేయుడు హాస్య బ్రహ్మ డాక్టర్ శంకర నారాయణ కనక దుర్గమ్మ పై రచించిన పాట ఆడియోను ఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ శాఖ కమీషనర్ రామ చంద్రమోహన్ ఆదివారం కనకదుర్గమ్మ ఆలయం లోని తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఎంతో తన్మయంతో ఈ పాటను రచించిన హాస్యబ్రహ్మ శంకర నారాయణ అభినందనీయులన్నారు. దుర్గమ్మ పై మరిన్ని రచనలు చేస్తే తాము ప్రోత్సహిస్తామని ఆయన అన్నారు. కొన్నేళ్ల క్రితం శంకర నారాయణ రచించిన కనక దుర్గ శతకం చూసి సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.


ఈ రోజు ఆవిష్కరించిన శంకరనారాయణ పాటను స్వరపరిచి, గానం చేసిన పాటల రచయిత రాయారావు విశ్వేశ్వర్ రావును, పాటకు సంగీతం అందించిన దోర్బల లిఖితను, రాయారావు శివానిని అభినందించారు.



సలామ్ సైనికా 'సినిమా ట్రైలర్ ను విడుదల చేసి ప్రసంగిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

## సలామ్ సైనికా సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**విజయవాడ,జనవరి 26,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రక్షణ కోసం అహర్నిశం శ్రమిస్తున్న మన దేశ సైనికులు వారి కుటుంబాల సంక్షేమం ఇతివృత్తంగా చిరుసుపాటి క్రియేషన్స్ బ్యానర్ పై చిరుసుపాటి సుబ్రమణ్యం దర్శకత్వంలో నిర్మించిన దేశభక్తి పూరిత 'సలామ్ సైనికా' చిత్రం ట్రైలర్ ను ఆదివారం రాష్ట్ర అసెంబ్లీ భవనంలో రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు విడుదల చేశారు.అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ సలామ్ సైనికా చిత్రం దేశం లోపల వెలుపల శత్రువులతో పోరాడి మరణించే మన సైనికుల విషయంలో ప్రతి భారతీయుడు ఎటువంటి బాధ్యతతో ఉండాలనే ఇతివృత్తంతో కూడినదని చెప్పారు.శత్రువులతో పోరాడే సమయంలో దురదృష్ట వశాత్తు ఎవరైనా సైనికులు చనిపోతే దేశం కోసం వారు చేసిన త్యాగాన్ని దేశ ప్రజలు పూర్తిగా గుర్తించి ఆలాంటి కుటుంబాలు నిర్లక్ష్యానికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత దేశ పౌరులమైన మనందరిపైనా ఉందనే విషయాన్ని గుర్తు చేసే రీతిలో ఈచిత్ర నిర్మాణం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈసినిమా మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే చిత్రీకరించారని దీనిలో 200 మంది వరకూ కొత్త నటీనటులు నటించారని అన్నారు. ఈచిత్రంలో కధానాయ కులుగా దేవ్,సాయి మరియు సురేశ్ నటించగా కథానాయకులుగా శ్రీవిద్య,సోనీ రెడ్డి నటించారని తెలిపారు.నేడు మనరక్షణ వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉండి వారు దేశ సరిహద్దుకు వెలుపల, లోపల అహర్నిశం శ్రమించి కాపాడంటోనే మనం ఇంత ప్రశాంతంగా జీవనం సాగించ గలుతు తున్నామని అందుకు ప్రతి ఒక్కరూ మన సైనిక వ్యవస్థకు ఎల్లప్పుడూ రుణపడి ఉండాలని సూచించారు.మన దేశ సైనికులపై రూపొందించిన ఈసలామ్ సైనికా చిత్రాన్ని సమాజం లోని ప్రతి ఒక్కరూ ఆదరిస్తారని కోరుకుంటున్నట్టు తెలిపారు. సలామ్ సైనికా చిత్ర దర్శకుడు చిరుసుపాటి సుబ్రమణ్యం మాట్లాడుతూ భారత సైనికులు అహర్నిశలు దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి మనలను కాపాడుతున్నారని వారికి మన వంతుగా కలసి సహాయపడాలనే ఉద్దేశ్యంతో ఈచిత్రాన్ని రూపొందించినట్టు తెలిపారు. సైనికులు చనిపోయినప్పుడు వారి భార్య పిల్లలు అనాధలు అవుతున్నారని వారికి అండగా ఉండే బాధ్యత ప్రతి భారతీయుడు తీసుకోవాలని సలామ్ సైనికా సినిమాలో ఆవిష్కరించినట్టు తెలియ చేశానని అన్నారు. ఈకార్యక్రమంలో ఉప సభాపతి కె.రఘురామ కృష్ణ రాజు,20 సూత్రాల కమిటీ ఛైర్ పర్సన్ లంకా దినకర్,రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి,అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఎస్.ప్రసన్న కుమార్,అసెంబ్లీ అధికారులు,సలామ్ సైనికా చిత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయజెండాకు వందనం సమర్పిస్తున్న డిప్యూటీ ఇఒ

## దుర్గమ్మ ఆలయంలో గణతంత్ర దినోత్సవం

**ఇంద్రకీలాద్రి, జనవరి 26, ప్రభాతవార్త :** దుర్గమ్మ వారి ఆలయం ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ పాయింట్ వద్ద భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. డిప్యూటీ ఇ.ఒ ఎం రత్నరాజు జాతీ య జెండాను ఆవిష్కరించి వందనం సమర్పిం చారు. దేవస్థా న సెక్యూరిటీ గౌరవ వందనం సమర్పించారు. అనంతరం చిన్నారులకు, భక్తులకు శ్రీ అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు.

**దుర్గమ్మ సేవలో గవర్నర్ కార్యదర్శి:** దుర్గమ్మను ఆదివారం రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి డా ఎం హరిజవహర్‌లాల్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రంలను ఇఓ కె రామచంద్ర మోహన్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



గవర్నర్ కార్యదర్శి ఎం. హరి జవహర్‌లాల్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# ధార్మిక దివ్యక్షేత్రంలో 76వ గణతంత్రదినోత్సవాలు

**శ్రీకాళహస్తి,జనవరి 26 ప్రభాతవార్త:** ధార్మిక దివ్యక్షేత్రం,పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి గురువారం 76వ గణ తంత్రదినోత్సవ వేడుకలతో కళ కళ లాడింది.వాడ వాడల్లో మువ్వనెల జెండా రెప రెపలాడింది.దేవాలయం, మసీదులు,చర్చిల్లో గణ తంత్ర దినోత్సవ వేడుకల్ని నిర్వహించారు. శ్రీకాళహస్తిలోని ద స్కూల్ ఆవరణలో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదిడిక కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి వందనసమర్పణ గావించారు. వివిధ శాఖల సారధ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లోనూ, బిజ్జాల గాలిగోపురం సమీపంలోని గాంధీజీ విగ్రహం వద్ద,తెలుగుదేశం పార్టీకార్యాలయంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగుర వేసి వందన స్వీకారం చేసారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ నాడు మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లౌకిక రాజ్యాంగాన్ని మనకు అందించారన్నారు. ఆయన అందించిన రాజ్యాంగం మేరకు మనం పరిపాలించుకుంటూ ముందుకు వెళుతున్నామని వివరించారు. ప్రభుత్వ ఫలాలు ప్రతి ఒక్కరికి అందించుటకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.



శ్రీకాళహస్తీశ్వరాలయం, జామియా మస్జిద్ వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తీశ్వరాలయం నియోజకవ ర్గానికి రెండు కళ్ళు అన్నారు. రెండు శాఖలు సమన్వయంతో పని చేస్తే తనకు,ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు.

**మసీదులు,మందిరాల్లో గణతంత్ర దినోత్సవం వేడుకలు:** శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలనా భవనం వద్ద వేదపండితులు, అర్చకులు వేద మంత్రాలను పఠిస్తుండగా ఇఒ టి.బాపిరెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి భరత మాత చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను వివరించారు. కాగా పట్టణంలోని జామియా మసీజిద్ వద్ద ముస్లింలు ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఇక్కడ పలు మసీదులకు చెందిన మత గురువులు కలసి జాతీయ జెండాను ఎగురవేసి డాక్టర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగానికి సంబంధించి వివరించారు. శ్రీకాళహస్తికి చెందిన ముఫ్తీ నయీం సాహెబ్,జిల్లా జమియత్ ఉలమ అధ్యక్షుడు మౌలానా అహ్మద్ హుసేన్,ఖాజీ మున్నా, మసీదు ఉపాధ్యక్షులుతీల్ సాహెబ్, మౌలానా రేహాన్,మహబూబ్‌బాషా, మీర్జా, ఉమర్, అబ్దుల్ కలాం,నాసిర్, ఇస్మాయిల్, తెలుగుదేశం నాయకులు తదితరుల సారధ్యంలో గణతంత్ర దినోత్సవాను కన్నుల పండువగా నిర్వహించారు.మసీదు ఎదురుగా మువ్వనెల జెండాల వందన వేసారు. కాగా పట్టణంలోని బేరివారి మండపం వద్ద బీజేపి నాయకుడు రాష్ట్ర బీజేపి మీడియా ప్రతినిధి కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో జాతీయ జెండాను ఎగుర వేసారు. భారతమాత పటానికి పుష్పాంజలి సమర్పించారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయజెండాను కమిషనర్ బిఏస్ గిరికుమార్ జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం చేసారు. సిబ్బంది ప్రజలకు జవాబుదారి తనంతో పని చేయాలన్నారు.ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తించి పని చేస్తే అందరికి మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బొబ్బిలిపేట వైఎస్సార్సీ నాయకుడు దారుణ హత్య

### మాటు వేసి హత్య చేసినట్లు అనుమానాలు, దుండగుల కోసం గాలింపు

**ఆముదాలవలస (శ్రీకాకుళం జిల్లా), జనవరి 26 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం బొబ్బిలిపేట గ్రామ పాలిమేరల్లో వైసిపీ నాయకుడు గురుగుబెల్లి చంద్రరావు అలియాస్ చంద్రయ్య (47) శనివారం సాయంత్రం దారుణ హత్యకు గురయ్యారు. దుండగులు మాటు వేసి హతమార్చినట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా హత్య ఉదంతం తెలిసి బొబ్బిలిపేట గ్రామం ఉలిక్కి పడింది. గతంలో జరిగిన సంఘటనలు ఒక్క సారిగా తెరపైకి వచ్చాయి. పాతకక్షలా, రాజకీయ కక్షలా, మరింకేదైనా కోణం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పటిలాగే శ్రీకాకుళం చైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న కుమార్తె తన్మయిని ఇంటికి తెచ్చే క్రమంలో సూర్తీ పట్టుకుని వాటర్ క్యాన్‌తో సీపీఎస్ రోడ్డుకు వస్తున్న మార్గమధ్యలో శనివారం సాయంత్రం సుమారు 6.30 ప్రాంతంలో భాగమ్మ చెరువు శివారులో దుండగులు మాటు



గురుగుబెల్లి చంద్రరావు (ఫైల్)

వేసి హతమార్చినట్లు స్థానికులు గుర్తించారు. 9 గంటలవుతున్నా ఇంటికి తిరిగి రాకపోవడంపై భార్య ఈశ్వరమ్మ ఫోను చేయగా సెల్ స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానం వచ్చి తమ బంధువులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఈశ్వరమ్మ సుమారు రాత్రి 10 గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చి భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామ పొలిమేరలోని భాగమ్మ చెరువు దరి రోడ్డు ప్రక్కన చంద్రయ్య చెప్పు కనిపించింది. మరి కొంచెం ముందుకు వెళ్లి చూడగా చెరువు లోపల మరో చెప్పుతో పాటు వాటర్ క్యాన్ కనిపించింది. ముందు భాగంగా విగత జీవిగా పడి ఉన్న చంద్రయ్య మృతదేహం గుర్తించారు. హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన సీఐ సత్యనారాయణ, ఎస్సై బాలరాజు హత్యకు గల కారణాలను అన్ని కోణాల నుంచి విశ్లేషిస్తున్నారు. క్లూస్ టీం రప్పించారు. అదే ప్రాంతంలోని సీసీ టీవీ పుటేజీలను పరిశీలించారు. **హంతకులను గుర్తించాలి:** చంద్రయ్యను దారుణంగా హత్య చేసిన హంతకులను పోలీసులు గుర్తించి తగు చర్యలు చేపట్టాలని ఆముదాలవలస వైఎస్సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ కోరారు.

## గణతంత్ర వేడుకల్లో ఆకట్టుకున్న పోలీసు జాగిలాల విన్యాసాలు

### తిలకించిన జిల్లా కలెక్టర్, ఎస్పీలు, ఇతర ప్రముఖులు

**అనంతపురం, జనవరి 26 ప్రభాతవార్త బ్యూరో:** స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పోలీసు జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోలీసు జాగిలాలైన లియో, వాగా, ప్లైని, విక్కీలు ముందుగా ఈ వేడుకలకు ముఖ్య అతిథి ఇంచార్జి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్‌లకు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం చేశారు. విన్యాసాలలో భాగంగా, మత్తుపదార్థాలు ఉంచిన బాక్సులను వెలికి తీశాయి. పెద్ద పెద్ద ప్రమాదాలు తప్పించడానికి ఈ నైపుణ్యం ఉపయోగపడుతుంది. ఆ తర్వాత తన కర్తవ్య నిర్వహణలో భాగంగా ఎన్ని అడ్డంకులు ఎదురైనా దాటుకుంటూ లక్ష్యాన్ని ఛేదించేందుకు ఉపయోగపడే హార్డిల్స్ జంపు విన్యాసాలను సులువుగా చేశాయి. అనంతరం ఆగివరించే వ్యక్తులు ఇచ్చే ఆహారాలను



పోలీసు జాగిలాలు స్వీకరించకుండా తిరస్కరించే విన్యాసం వీక్షకులను ఆకట్టుకుంది. ఈ నాలుగు జాగిలాలు పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలను పసిగట్టడం, హత్యలు, దొంగతనాలు జరిగిన సందర్భాలలో నిందితులను గుర్తించడం కోసం మంగళగిరి ప్రత్యేకంగా 8 నెలల శిక్షణ కూడా పొందాయి. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఎ.ఆర్.అదనపు ఎస్పీ, డీఎస్పీల పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ జాఫర్ ఆధ్వర్యంలో డాగ్ హ్యాండ్లర్స్ సూర్యనారాయణ, మనోహర్, బీమ్లా నాయక్, చాంద్ టపాలు జాగిలాల విన్యాసాలకు మంచి తర్ఫీదునిచ్చారు.

## మానసిక, సామాజిక సంఘర్షణల పరిష్కారానికి తత్వశాస్త్రం, శాస్త్రయోగాలే అవశ్యం

**17 వ అంతర్జాతీయ కాంగ్రెస్ అఫ్ సోషల్ ఫిలాసఫీ ( ICSP ) మరియు 11 అంతర్జాతీయ కాంగ్రెస్ అఫ్‌యోగ అండ్ స్పిరిచువల్ సదస్సులో వక్తలు**

**విశాఖపట్నం, జనవరి 26 ప్రభాతవార్త:** మానసిక, సామాజిక సంఘర్షణల పరిష్కారానికి తత్వశాస్త్రం, శాస్త్రయోగాలే అత్యంత అవశ్యకమన్నారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 17 వ అంతర్జాతీయ కాంగ్రెస్ అఫ్ సోషల్ ఫిలాసఫీ ( ICSP ) మరియు 11 అంతర్జాతీయ కాంగ్రెస్ అఫ్ యోగ అండ్ స్పిరిచువల్ సైన్స్ సంయుక్త నిర్వహణలో సామాజిక తత్వశాస్త్రం వారి సౌజన్యంతో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశం నిర్వహించబడింది. తత్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ మొదటి బిసి కమీషన్ ఛైర్మన్ బి యస్ రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మానవులకి కూడు, గుడ్డ ,నీడ,విద్య వైద్యం వంటి కనీస అవసరాలు అందరికీ సమానంగా అందవలసిన అవసరం ఉందని అవి అందని వారికొరకు పరిశీలన చేయటమే నిజమైన సోషల్ ఫిలాసఫీ అన్నారు. స్త్రీ,పురుషుల మధ్య అంతరం లేకుండా సమానమైన వేతనం అందించాల్సిన అవసరం ఉందని అసమానతలు లేని సమసమాజ సాధనే ఫిలాసఫర్ల లక్ష్యంగా మారాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆర్ట్స్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సు నిర్వహణ చటం ఎంతో శ్రమతో కూడుకున్నదని



కాని శాఖ ధిపతి వి వెంకటావు అధ్యాపకుల, పరిశోధకుల, స్నాతకోత్తర విద్యార్థుల సహకారంతో విజయవంతం చేయటం ఆనందంగా ఉందని వారిని అభినం దించారు.ముఖ్యంగా విద్యార్థులు ఇటువంటి సదస్సులలో పాల్గొని వ త్రం సమర్పణ చేయటం వలన వారిలో సృజనశీలతో పాటు పరిశోధనా దృక్పథం వృద్ధి చెందుతుందన్నారు.

ఆత్మీయ అతిధిగా హాజరైన పద్మశ్రీ అవార్డు గ్రహీత డా కూటికుప్పల సూర్యారావు మాట్లాడుతూ అనేక శారీరక రుగ్మతలకు మనస్సు మూల కారణమని దానిని అధిగమించాలంటే శాస్త్ర యోగ మరియు ఆధ్యాత్మికతలు కలగలిపిన శాస్త్ర యోగ శాస్త్ర యోగ ల అధ్యయనం అవశ్యకమని నొక్కి చెప్పారు. మరొక ఆత్మీయ అతిధిగా హాజరైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య పి జార్జి విక్టర్ మాట్లాడుతూ ఆధునిక విద్యా రంగం లోసామాజిక తత్వ శాస్త్రం మరియు యోగ పాత్ర ఎంతో ఉందన్నారు. ఆచార్య బసవరాజు సిద్ధాంతి మాట్లాడుతూ ధార్మిక సంస్థలు విద్యా ఉద్యోగ రంగాల్లో అదేవిధంగా వైద్య రంగంలో ప్రజలకు సేవ చేయడంలో ముందుండాలని కోరారు. సదస్సు సంచాలకులు ఆచార్య వానపల్లి వెంకటావు మాట్లాడుతూ వివిధ దేశాల మరియు విశ్వవిద్యాలయాలనుండి, కళాశాలల నుండి ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనటం ఆనందం కల్గిస్తుందని, దాదాపు 100 మందికి పైగా తమ పరిశోధనా పత్రాలు సమర్పించారని వాటినన్నింటిని పుస్తకరూపంలో తీసుకురావటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ అఫ్ ఛైర్మన్ డా బాసి వెంకటస్వామి,గౌరవ ఆచార్యులు ఎం వీ కృష్ణయ్య, డా పుట్టరాజ్,డా రాఘవేంద్ర ,ఆచార్యులు డా మునుగు ప్రసాద్ ,డా వీరభద్రరావు,డా కళ్యాణి,డా పద్మజ,డా దేవదానం,డా రజని,డా ద్రాక్షాయణి,డా క్రీను,గొలగాని నిర్మల, గాలి చైతన్య కుమార్ , ఏ రాజారామ్ కుమార్ ,కె మహాలక్ష్మి ,శైలజ ,విజయరాణి ,రమేష్ ,సతీష్ ,విజయ్ ,నాజర్ ,కోటి మరియు పరిశోధక విద్యార్థులు,స్నాతకోత్తర విద్యార్థులు ,అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన బాలకృష్ణకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అభినందనలు

**హైదరాబాద్ (పంజగుట్ట), జనవరి 26, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం జూబ్లీ హిల్స్ లోని సినీనటుడు నంద మూరి బాలకృష్ణ నివాసానికి వచ్చారు. పద్మ భూషణ్ అవార్డుకు ఎంపికైన ఆయనను వారి నివాసంలో కలిసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు పలు విషయాలపై చర్చించుకున్నారు. అర్హులైన వారికి కేంద్ర ప్రభుత్వం అవార్డులతో సత్కరించడం అభినందనీయమని బాలయ్య కిషన్‌రెడ్డితో వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.



## నేడు జస్టిస్ ఘోష్ విచారణకు కె.రఘు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు లోపాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకీఘోష్ సోమవారం విద్యుత్ నిపుణులు కె.రఘును బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగే బహిరంగ విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీచేసింది.విద్యుత్ నిపుణులు కంచర్ల రఘు గతంలో హైజరై పిసీ ఘోష్‌కు ఏదవ బ్లాక్ లోని 12 పియర్లు తొలగించి కట్టాల్సిందే అని దీనికి డైమండ్ కటింగ్ ద్వారా నెమ్మదిగా తొలగించాలని సూచించారు. కాళేశ్వరం రీ ఇంజనీరింగ్ భారీ తప్పిదంగానే కంచర్ల రఘు అభిప్రాయాలు జస్టిస్ ముందు నేడు వెల్లడించే అవకాశం ఉంది.



దేవి ప్రసాద్, పొట్నూరు కృష్ణచైతన్య(ఫైల్)

## సముద్ర స్నానానికి వెళ్లి ఇద్దరు మృతి

**శ్రీకాకుళం, జనవరి 26 ప్రభాతవార్త:** సముద్ర స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు ఆదివారం మృతి చెందారు. వివరాల్లోకి వెళితే శ్రీకాకుళం జిల్లా గార మండలం కళింగపట్నం పంచాయతీ కళ్లిపేట గ్రామానికి చెందిన పొట్నూరు కృష్ణ (29), అదే గ్రామానికి చెందిన ముంత దేవీ ప్రసాద్ (20)లు ఆదివారం ఉదయం 9.30 గంటలకు సముద్ర స్నానానికి వెళ్లారు. వీరితో పాటు మరో ఐదుగురు కూడా సముద్ర స్నానానికి వెళ్లారు. వీరిద్దరు ప్రతి ఆదివారం సముద్ర స్నానానికి వెళ్లడం వీరికి అలవాటు. ఆదివారం అమావాస్య కావడంతో సముద్రం పోటు ఎక్కువగా ఉండడంతో లోతు తెలుసు కోలేక లోపలకు వెళ్లి మునిగిపోయారు. మిగతా ఐదుగురు వెనక్కి వచ్చేసారు. వీరిద్దరిలో పొట్నూరు కృష్ణచైతన్య సాఫ్టవేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఈయన ఇంటి వద్ద వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. ఈయనకు భార్య, 8 నెలలపాప, తల్లిదండ్రులు ఉన్నారు. అలాగే ముంత దేవీప్రసాద్ నాలుగు నెలల క్రితం సిమెన్‌గా పనిచేసి ఇంటికి వచ్చాడు. ఈయనకు తండ్రి ఉన్నారు. ఈ రెండు మృతదేహాలకు కళింగపట్నం పోర్టు హాస్పిటల్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. కృష్ణచైతన్య తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గార ఎస్సై జనార్దన్ తెలిపారు.

## నేడు యాజమాన్యానికి తెలంగాణ ఆర్‌టిసి జెఎసి సమ్మె నోటీసు

### ఆర్టీసి పరిరక్షణ, ప్రభుత్వంలో విలీనం ప్రధాన డిమాండ్లు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** ఆర్టీసీ పరిరక్షణతోపాటు ప్రభుత్వ హామీల అమలు కోసం నేడు(సోమవారం) సమ్మె నోటీస్ ఇవ్వాలని టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. కొద్ది రోజుల క్రితం జరిగిన రాష్ట్ర జేఏసీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం సమ్మె నోటీ ఇవ్వాలని తీర్మానం చేసినట్టు జేఏసీ ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్న .. ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రధాన హామీలైన ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, 2021 నుంచి వేతన సవరణతో అమలు చేయలేదు. దాంతోపాటు అతి ముఖ్యమైన .. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి అంగట్లో సరుకులాగ రోజుకొక డిపో ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో కార్పొరేట్ సంస్థలైన జేబీఎం, ఒలెక్ట్రాలకు ధారాదత్తం చేస్తుందని జేఏసీ విమర్శించింది. ఎలక్ట్రిక్ బస్సులతో ఈ ప్రభుత్వం ఒక్క పైసా పెట్టుబడి పెట్టలేదు, ఆర్టీసీ నష్ట కొనలేదు ఆలాంటప్పుడు ఈ బస్సులను హంగులు ఆర్భాటలతో ప్రారంభించే హక్కుప్రభుత్వానికి, ప్రభుత్వ మంత్రులకి ఎక్కడిదని జేఏసీ నాయకులు ప్రశ్నించారు. ఈ ప్రవేటు బస్సులను ప్రభుత్వ బస్సులుగా ప్రజలను, తెలంగాణ సమాజాన్ని నమ్మించడానికి చేస్తున్న ప్రయత్నం జేసీసి భావిస్తోంది. ఎలక్ట్రిక్ బస్సుల వలన ఆర్టీసీ సంస్థలో వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ఒక బస్సుకు 5 మంది చొప్పున బదులు, బలవంత పర్యాలకు చట్టప్రకారం ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయి పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి నెట్టి వేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. గత యూపిఏ ప్రభుత్వం జెన్నారం (జెఎన్ఎన్‌యూఆర్ఎం) బస్సులను ఆర్టీసీకి కొనిచ్చిన మాదిరిగా ఈ ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకి కొనిచ్చి ప్రజా రవాణాను కాపాడాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో దశలవారిగా ఉద్యమ కార్యాచరణను చేపట్టి ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి మెమోరాండంలను సమర్పించినప్పటికి ఇప్పటి వరకుఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మె బాట పట్టాలని జేఏసీ నిర్ణయించింది.

# శ్రీమ్ అపర్ణ సేవా ట్రస్ట్ వారి ఉచిత హోమియో వైద్య శిబిరం



**కిర్లంపూడి , జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

కిర్లంపూడి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయము నందు శ్రీమ్ అపర్ణ సేవా ట్రస్ట్ తాటిపర్తి వారి ఆధ్వర్యంలో పిఠాపురం వీరభద్ర హోమియో క్లినిక్ సౌజన్యంతో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అందరికీ ఆరోగ్యం అనే సంకల్పంతో గత పది సంవత్సరాల క్రితం తాటిపర్తి గ్రామానికి చెందిన శ్రీమ్ అపర్ణ సేవా ట్రస్ట్ ను చైర్మన్ బ్రహ్మశ్రీ దైవజ్ఞ రత్న డాక్టర్ ఆకొండి వెంకటేశ్వర శర్మ స్థాపించారు. అప్పటినుండి జిల్లా నలుమూలల పలు గ్రామాలలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ ట్రస్ట్ ద్వారా వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. అదే విధంగా ఈ ట్రస్ట్ ద్వారా పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు ఉన్నత చదువులు అందించాలనే లక్ష్యంతో తమ గ్రామంలో ప్రావీణ్యత కలిగిన ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి పోటీ పరీక్షలలో ఉత్తమఫలితాలు సాధించేందుకు చేస్తున్న ట్రస్టు సేవలను పలువురు పలువురు ప్రశంసిస్తూ కొనియాడుతున్నారు. కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం, రాజుపాలెం, వీరవరం, వేలంక తదితర గ్రామాల నుండి వైద్య సేవల కోసం తరలివచ్చిన వారికి వీరభద్ర హోమియో క్లినిక్ ప్రముఖ వైద్యులు బత్తుల సూర్య పవన్ రామ్, దొండపాటి నాగ మనోజ్ఞ తమ వైద్య బృందంతో వైద్య పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ వారు వైద్య శిబిరం నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిరాట్ల కృష్ణమూర్తి , పిరాట్లరామకృష్ణ, పేర్ల వాసు, త్రిమూర్తులు తదితరులు శిబిర నిర్వహణలో సేవలందించారు.

# 'ఏకాదశరుద్రుల ప్రభల తీర్థం' శకటం చిత్రపటం వద్ద జండా ఆవిష్కరణ



**అంబాజీపేట , జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

జగ్గన్నతోట ఏకాదశరుద్రుల ప్రభల తీర్థం శకటం చిత్రపటం వద్ద త్రివర్ణ పతాకమును ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. 74వ జాతీయ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పేరేడ్లో ఆంధ్రప్రదేశ్ శకటంగా 'జగ్గన్న తోట ఏకాదశరుద్రుల ప్రభల తీర్థం' శకటంను ప్రదర్శించి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా గంగలకుర్రు అగ్రహారంలో శివకేశవ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. అలాగే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి కవాతులో జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల శకటమును ప్రదర్శించారు. ఈ సందర్భంగా గంగలకుర్రు అగ్రహారం శ్రీ వీరేశ్వరస్వామి వారి రుద్రప్రభను అలంకరించే స్థలంలో జాతీయ పతాకమును ఆవిష్కరించి, మిఠాయిలు పంచి పెట్టి, బాణాసంచాను కాల్చి, సంబరాలు చేసుకున్నారు. విశ్వ వ్యాప్తంగా ఖ్యాతిగాంచిన ఏకాదశరుద్రుల ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఢిల్లీలో జరిగే పేరేడ్లో ఆంధ్రప్రదేశ్ శకటం వద్ద ప్రదర్శన ఇచ్చే అవకాశం పొందిన (వరుసగా మూడవసారి) అంబాజీపేట మండలం ముక్కామల గ్రామానికి చెందిన పసుపులేటి నాగబాబు నృత్య బృందానికి అభినందనలు తెలిపారు.

# ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు



**● ప్రజాస్వామ్య విలువలను కాపాడి దేశ సమైక్యతను పరిరక్షించుకోవాలి : జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు . వేడుకలకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జిల్లా ప్రజల ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ దేశ సమైఖ్యత, సమగ్రతల పరిరక్షణ, పురోగతి కొరకు అందరం సమిష్టిగా కృషి చేయాలని సందేశం ఇచ్చి ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విశిష్ట అతిధులుగా జడ్పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎం.ఎల్.సి. కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కాకినాడ అర్బన్ డవలెప్మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహూల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన, అడిషనల్ ఎస్పి యంజెవి భాస్కరరావు, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్.ఎస్ భావవ, ట్రైనీ ఐపిఎస్ సుస్మిత పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుత ఆయన సాయుధ పోలీస్ దళాలు, ఎన్.సి.సి. కాడెట్లు నిర్వహించిన సాంప్రదాయ గార్డ్ ఆఫ్ ఆనర్, మార్చ్ పాస్ట్ కవాతులను తిలకించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసారు. భారత రత్న బాబా సాహేబ్ అంబేత్కర్ జాతికి అందించిన పవిత్ర రాజ్యాంగం పునాదిగా మహోన్న ప్రజాస్వామ్య సౌధాన్ని నిర్మించుకున్నామని, రాజ్యాంగం మనకందించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూ, పౌరులుగా దేశ సమైఖ్యత, సమగ్రతల పరిరక్షణ, పురోగతి కొరకు ప్రజలందరం సమిష్టిగా కృషిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అలాగే జిల్లాలో విజయవంతంగా అమలౌతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి,రైతులు, మత్స్యకారులకు, విద్యా,వైద్యం, త్రాగునీరు,సాగు నీరు,పలు సంక్షేమ కార్యక్రమాలను, వివిధ రంగాలలో జిల్లా ప్రగతిని ఆయన వివరించారు. పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు,వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలను, స్టాళ్లను జిల్లా కలెక్టర్ షణ్మోహన్, అతిధులుతో కలిసి తిలకించి, చివరిగా ఉత్తమ సేవలు అందించిన అదికారులు, సిబ్బందికి, శకటాలు, సాంస్కృతిక ప్రదరనలో బహుమతి పొందిన శాఖలు, విద్యార్థులకు ప్రసంశాపురస్కారాలను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదికారి జె.వెంకట్రావు, ఆర్డిఓ ఎస్.మల్లిబాబు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులే దేశానికి వెన్నుముక : చైర్మన్ సురేష్



**శంకవరం , జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

బావి భారతదేశానికి విద్యార్థులే వెన్నెముకని ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుండే దేశభక్తి కలిగి ఉండాలని జిల్లా పరిషత్ హై స్కూల్ చైర్మన్ సురేష్ అన్నారు మండలంలోని కత్తిపూడి గల జిల్లా పరిషత్ హై స్కూల్లో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జండా వందనాన్ని స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నాయకుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకుని వారి మార్గాలను అనుసరించాలన్నారు నేటి యువత దేశభక్తి కలిగి ఉండటం ద్వారా క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు అన్నారు మహాత్మా గాంధీ కలలు గ్రామ స్వరాజ్యం రావాలని వాటికి ప్రజలందరూ సహకరించాలన్నారు దేశం మనకు ఏమిచ్చిందని చెప్పుకునే కన్నా దేశానికి మనమేం చేసాం అని ప్రశ్నించుకోవాలన్నారు . ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గాబు కృష్ణ కంచి బోయిన శ్రీను నక్క శ్రీను జనసేన నాయకులు పోసిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ గణతంత్ర దినోత్సవం పరిష్కరించుకుని కత్తిపూడి వాసవి క్లబ్ సభ్యులు ఎంపీపీ స్కూల్ హైస్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా తమ వంతుగా ఈ కార్యక్రమం చేపట్టమని వాసవి క్లబ్ జోన్ చైర్మన్ నాగచల పతిరావు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉప్పల బాబి కొత్త సిద్దు కట్ట బసవయ్య వాసవి క్లబ్ సభ్యులు ఆర్య వైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు ప్రశంస



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

కాకినాడ జిల్లా లో ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిసున్న అపోలో హాస్పిటల్ హెడ్ ఐ.వి రమణ కు ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్లో ఆదివారం అపోలో ఆస్పత్రి ఉత్తమ సేవలకు గాను కలెక్టర్ షణ్మోహన్ సగిలి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

# అంబాజీపేటలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**అంబాజీపేట, జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

భారత 76వ గణతంత్రదినోత్సవ వేడుకలను అంబాజీపేట మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జి.వి. సరోవర్, రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దారు జె.వెంకటేశ్వరి,పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై కె. చిరంజీవి, అంబాజీపేట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాద్యాయులు కె.సాయిరామ్, వ్యవసాయ మార్కెట్ కమిటీలో కార్యదర్శి ఐ.రమేష్, డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వద్ద అధికారులు, పంచాయతీ కార్యాలయాల వద్ద కార్యదర్శులు, అంబాజీపేట,ముక్కామల పీహెచ్సీల వద్ద వైద్యులు, అలాగే మండలంలోని ఆ వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు,సొసైటీలలో సీఈవోలు,ఉన్నత,ప్రాధమిక పాఠశాలల వద్ద ఆయా ప్రధానోపాద్యాయులు జాతీయ పతాకంను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి,జనసేన పార్టీ ఉమ్మడి తూర్పు జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొంతు పెదబాబు, నాయకులు గణపతి వీరరాఘవులు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, దొమ్మేటి సాయికృష్ణ, రవణం రాము,ముత్తాబత్తుల ప్రశాంత్, నాగాబత్తుల వెంకట సుబ్బారావు,కామిశెట్టి మధుబాబు,దొమ్మేటి శ్యామ్, కొప్పినీడి ఈశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్ పర్సన్ బండారు అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

**'తాజా' భవనంపై రెపరెపలాడిన త్రివర్ణ పతాకం..**

ది.అంబాజీపేట జర్నలిస్ట్ అసోసియేషన్ (తాజా) నూతన భవనం పై త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'తాజా' ప్రెస్ క్లబ్ కార్యదర్శి జె.రాంప్రసాద్ ఆధ్వర్యంలో తాజా అధ్యక్షులు పళ్ళ సూర్యప్రకాశరావు (బాబ్జి) జాతీయ పతాకంను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎన్ మూర్తి, మద్దింశెట్టి శ్రీనివాసు,మట్టపర్తి శ్రీనివాస్, ఐ.ప్రపుల్ కుమార్, మాలే వెంకట దుర్గాప్రసాద్, దంగేటి సోమేష్, గుత్తుల ఏడుకొండలు,జె.విక్టర్ కుమార్, గోసంగి శ్రీనివాస్, మైపాల నాగరాజులు పాల్గొన్నారు.

# గోపాలపురంలో ఘనంగా గణతంత్ర వేడుకలు



**గోపాలపురం , జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

గోపాలపురం మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద ఈ వేడుకలు నిర్వహించి త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అజయ్ కుమార్, ఎస్సై సతీష్ కుమార్ లు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలోను వేడుకను నిర్వహించారు. ఐసిడీఎస్ కార్యాలయం వద్ద ఏసీడీపీఓ యూ.వి పద్మావతి ఆధ్వర్యంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించి జండా వందనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య, సార్వభౌమాధికారం, ఆదర్శాలను పొందు పరిచిన రోజును దేశ ప్రజలు రిపబ్లిక్ డేగా జరుపుకుంటారన్నారు. స్వాతంత్ర్యం కోసం ధైర్యంగా పోరాడిన మన యోధుల త్యాగాలు, పోరాటాలను గుర్తు చేసుకునే రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. ప్రతిఒక్కరు భారతదేశ రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలని చెప్పారు.

# మిరియాల అప్పారావుకు పద్మశ్రీ అవార్డు ప్రదానం మా రావులపాలెంకు గర్వకారణం

**- అవార్డులు పొందిన తెలుగువారందరికీ అభినందనలు : ఎమ్మెల్యే సత్యానందరావు**

**రావులపాలెం , జనవరి 26, (ప్రభాతవార్త )**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డు మా ప్రాంతానికి చెందిన మిరియాల అప్పారావు వరించడం మా రావులపాలెంకు గర్వ కారణం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని అప్పారావు ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే సత్యానందరావు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కళాకారులను గుర్తించడంలో కేంద్ర ప్రభుత్వం మన కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంకు చెందిన మిరియాల అప్పారావును ఎంపిక చేయడం అభినందనీయమన్నారు.కానీ ఇటీవలే ఆయన మరణించడం పైగా నిన్ననే ఆయన పెద్ద కర్మ జరగడం బాధాకరమన్నారు. ఆయన పెద్ద ఖర్మ రోజే పద్మశ్రీ పురస్కార ప్రకటన వెలువడటం జరిగిందని తెలిపారు. సింగపూర్, కువైట్ వంటి దేశాల్లో అప్పారావు తన ప్రదర్శనలు ఇచ్చారని అయిదు వేలకు పైగా ప్రదర్శనలు చేయడమే కాకుండా నేడు బుర్రకథ చెప్పే అనేకమంది ఆయన శిష్యులేనని సత్యానందరావు గుర్తుచేశారు.

**అవార్డులు అందుకున్న తెలుగువారందరికీ అభినందనలు**

వివిధ రంగాలలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులలో పద్మ భూషణ్ అవార్డు గ్రహీత నందమూరి బాలకృష్ణ,పద్మశ్రీ వరించిన మందకృష్ణ మాదిగ,పద్మ విభూషణ్ దువ్వూరి నాగేశ్వరరెడ్డి,పద్మశ్రీ కె ఎల్ కృష్ణయ్య,మాడుగుల నాగఫణి శర్మ,పంచముఖి రాఘవాచార్య లకు ఎమ్మెల్యే సత్యానందరావు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేను విశాఖపట్నంలో రిజినల్ ఇన్వెస్ట్ మీట్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

ఈ నెల 27 వ తేది రిజినల్ ఇన్వెస్ట్ మీట్ విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. దీనిపై రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మంత్రి కందుల దుర్గేష్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఉమ్మడి ఉత్తరాంధ్ర ఐదు జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్ట్ అభివృద్ధి చేపట్టేవారి కోసం రిజినల్ ఇన్వెస్ట్ మీట్ లో ఆహ్వానిస్తున్నామని తెలిపారు. దీనికి సుమారు 150 మంది ఇన్వెస్ట్లు రానున్నారని సుమారు 15 మందితో ఎం ఓ యు ఒప్పందం చేసేందుకు అవకాశం ఉందన్నారు. అఖండ గోదావరి, గండికోట రూ.170 కోట్లతో అభివృద్ధి చేస్తామని అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయానికి అభివృద్ధికి టెండర్ల ప్రక్రియను జరుగుతుందని చెప్పారు. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా అహోబిలం, నాగార్జున సాగర్ లను ఒక్కొక్క ప్రాజెక్ట్ కు రూ. 25 కోట్ల, రూ. 100 కోట్లతో సూర్య లంకను తో అభివృద్ధి చేస్తామని చెప్పారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. రాబోయే రోజుల్లో మారేడుమిల్లి, పాపికొండలు విహారయాత్ర పై ప్రత్యేక భద్రత తో ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# వాడవాడలా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**మామిడికుదురు , జనవరి 26, ( ప్రభాతవార్త )**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలో వాడవాడలా 76వ. గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు,సబ్ రిజిస్టర్ కార్యాలయం ,పోస్టాఫీసు తదితర కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈదరాడ గ్రామంలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కీ.శే.యన్నాబత్తుల నరసింహ మూర్తి,వెంకాయమ్మ జ్ఞాపకార్థం కుమారులు ఏడుకొండలు, సత్య నారాయణలు పాఠశాలకు గోద్రెజ్ బీరువాను బహూకరించారు .ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుసుమ ప్రసాద్,గ్రామ సర్పంచ్ చుట్టుగుళ్ళ లక్ష్మి రమేష్, పెద్దలు గోసంగి చినబాపూజీ, కుసుమ పెరుమాళ్ కుమార్, శాంతి, మంగా దేవి, నాగరాజు ఉపాధ్యాయులు ఎస్. రామకృష్ణ, షబ్బీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మోటార్ యూనియన్ బలోపేతానికి కృషి : యూనియన్ నూతన అధ్యక్షులు కన్నారావు



**శంకవరం , జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

కత్తిపూడి ది లారీ మోటార్ యూనియన్ అసోసియేషన్ బలోపేతానికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని యూనియన్ నూతన అధ్యక్షులు గౌతు కన్నారావు పేర్కొన్నారు మండలంలోని కత్తిపూడి లో గల యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యూనియన్ అధ్యక్షులు దుగ్గిన నాగరాజు,వాకపల్లి స్వామి నాయుడు, సెక్రటరీ కర్నీడి నానాజీ కమిటీ సభ్యులు రాష్ట్ర టీ ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు వెన్న శివ సమక్షంలో నూతనంగా ఎన్నిక అయిన కత్తిపూడి లారీ యూనియన్ కమిటీ బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీలోసాధనాల వీరబ్బాయి గారు (గౌరవ అధ్యక్షులు)గౌతు అర్జిబాబు గారు ( సెక్రటరీ)గాబు ఈశ్వరరావు ( వైస్ ప్రెసిడెంట్)యాగ వీరబాబు ( జాయింట్ సెక్రటరీ)శెట్టి అశోక్ మూర్తి (క్యాషియర్)గాబు శ్రీను ( జాయింట్ క్యాషియర్) గా నియమించడం జరిగిందని అధ్యక్షులు తెలిపారు. మోటారు రంగంపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని స్థానిక శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ సహకారంతో యూనియన్ ఆర్థిక బలోపేతానికి కృషి చేయడం జరిగిందని తెలిపారు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను స్థానిక నేతలు గాబు ఈశ్వరరావు సాధనాల లక్ష్మీ బాబు మచ్చ గంగరాజు ఆకుల పాపారావు శెట్టి రాజబాబు మాజీ యూనియన్ అధ్యక్షులు గౌతునాగు తదితరులు అభినందించారు

# ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుక



**రౌతులపూడి , జనవరి 26, ( ప్రభాతవార్త ) :**

రౌతులపూడి మండలంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయం నందు మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మండల పరిషత్ కార్యాలయం నందు ఎండిఓ జి.శివరామకృష్ణయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు జాతీయ గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటి మళ్ల రాజ్యలక్ష్మి, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కర్ బాబు, ఎంఈఓ 2 గాడి కొండబాబు, ఈఓపిఆర్డి శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తాసిల్దార్ కార్యాలయం నందు తాసిల్దార్ ఎస్వీ నరేష్, పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐ వెంకటేశ్వరరావు,పంచాయతీ కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

# తలుపులమ్మలోవలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుక



తుని ( రౌతులపూడి ), జనవరి 26, ( ప్రభాతవార్త ) తుని మండలం, లోవలో వేంచేసి ఉన్న శ్రీ తలుపులమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం నందు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, ఉప కమిషనర్ కె.విశ్వ నాథరాజు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. గణ తంత్ర దినోత్సవం పై ఆయన ప్రసంగించారు. ముం దుగా గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ గొర్లె అచ్చియ్య నాయుడు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ సీఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం

ప్రత్తిపాడు , జనవరి 26, ( ప్రభాతవార్త ) : 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా వందన కార్యక్రమాన్ని మండలంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం స్టీరింగ్ అండ్ మానిటరింగ్ మహిళ ప్రెసిడెంట్ కొట్టిలి శేషు కుమారి శ్రీనివాస్ ప్రెసిడెంట్ మరియు జిల్లా చైర్మన్ బి.నారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్య క్రమంలో శేషు కుమారి మాట్లాడుతూ విద్యార్థుల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎందరో త్యాగమూర్తుల పుణ్యఫలమే మనం జరుపు కుంటున్న గణతంత్ర దినోత్సవం అని తెలిపారు. జాతీయ నాయకుల త్యాగాన్ని స్ఫూర్తి గా తీసుకుని, వారి మార్గాలను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సిబ్బంది పాల్గొన్నారు.. అనంతరం చిన్నారులకు పండ్లు స్వీట్స్ పంపిణీ చేశారు.



# సత్యదేవుని ఆలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



అన్నవరం / శంఖవరం,జనవరి 26, ( ప్రభాతవార్త ) ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో గల కళా వేదిక ఎదురుగా జాతీయ జెండాను ఏర్పాటు చేసి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వీర్ల సుబ్బా రావు సత్యదేవుని చిత్రపటానికి పూజలు చేసి అనంతరం జెండా వందనం గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందపరచిన హక్కులు విధులను సద్వినియోగం చేసుకుంటూ అంకితభావంతో సేవలందించాలన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉ ండాలని ఎందరో సమరయోధుల పోరాట ఫలితంగానే స్వతంత్రం పొందామని అనంతరం రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. అనంతరం పలువురు దేశ నాయకుల చరిత్రను స్మరించుకున్నారు. ముందుగా దేశ నాయకుల చిత్రపటానికి పూలమాల లేసి పూజ అనంతరం జండా వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఓ కృష్ణారావు, కొండలరావు రామారావు అనకాపల్లి ప్రసాద్ వాసు లక్ష్మీనారాయణ , వివిధ భాగాల సూపర్డెంట్లు వేద పండితులు వ్రత పురోహితులు దేవస్థానం సిబ్బంది, ఎస్ పి ఎఫ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది , పాల్గొన్నారు. ఆకట్టుకున్న సత్య దేవుని రథం 76 గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన వేడుకల్లో వివిధ శాఖల శకటాలు ప్రదర్శించగా సత్యదేవుని సత్యరథం వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలం కరించి, వాహనం ముందు వేళాకాలు వేద పాఠశాల విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. స్వామివారి అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం వేద పండితులు జిల్లా కలెక్టర్ ఎస్పీలకు దేవస్థానం తరపున వేద ఆశీర్వాదం అందించారు.



# వచ్చే నెల 26 నుంచి
# అరిగెల రంగయ్య మెమోరియల్ వాలీ బాల్ టోర్నమెంట్



అమలాపురం రూరల్ , జనవరి 26, ( ప్రభాతవార్త ) : ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి గ్రామంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పునః ప్రారంభిస్తున్నట్లు అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. గతంలో మాజీ హోం మంత్రి రాజప్ప తన తండ్రి పేరిట ఈ టోర్నమెంట్ నిర్వహించేవారన్నారు. అయితే ఐదేళ్ల నుంచి దీనిని నిర్వహించకపోవడంతో మాజీ జడ్పీటిసి దేశంశెట్టి లక్ష్మీనారాయణ ముందుకు రావడంతో మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ట్లు ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే నెల 26వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నా మన్నారు. ఇప్పటికే బీచ్ వాలీబాల్ సంక్రాంతి ఉత్సవాల ను అద్భుతంగాచేశామన్నారు. ఈసారి లక్ష్మీనారాయణ తన తాత అరిగెల రంగయ్య మెమోరియల్ పేరిట నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ లోగోను నేతల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోని అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మెట్ల రమణబాబు, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి,యాళ్ల దొరబాబు,కల్వకొలను తాతాజీ,ఏడిద శ్రీను, లింగోలు పండు, ఇసుకపట్ల రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న ఉద్యోగులు, సమాజ సేవకులు

అంబాజీపేట , జనవరి 26, ( ప్రభాతవార్త ) : విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు, సమాజ సేవ చేస్తున్న సేవకులను ఉత్తమ సేవా అవార్డులు వరించాయి. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలాపురంలో జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ చేతులు మీదుగా అంబాజీపేటకు చెందిన ఉద్యోగులు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ కాకర మోహన్, పీహెచ్సీ ఎంపీహెచ్ఎ జేవీఎస్ఆర్.ప్రసాద్, పోలీస్ కానిస్టేబుల్ నరేష్, వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, రెడ్ క్రాస్ సంస్థ ద్వారా సోషల్ సర్వీస్ విభాగంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ జీవితకాల సభ్యులు, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉ



ద్యోగి బెహరా వీర హనుమంతురావు లు అవార్డులు అందుకున్నారు. ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న వీరిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు, అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పలు శాఖల జిల్లా, రెవిన్యూ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

# బుర్రకథ టైగర్ అప్పారావుకి పద్మశ్రీ





- ఇటీవల కన్నుమూసిన అప్పారావు
- పెద్ద కర్మ రోజునే అవార్డు ప్రకటించిన కేంద్రం

రావులపాలెం , జనవరి 26, ( ప్రభాతవార్త ) : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గ్రామానికి బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావుకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంతో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. 1949 సెప్టెంబర్ 9వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నడకుదురులో మిరియాల వెంకట్రామయ్య, తిరువతమ్మలకు జన్మించిన అప్పారావు బుర్రకథ కళాకారుడిగా రావులపాలెంలో స్థిరపడ్డారు. గత ఏభై సంవత్సరాలుగా బుర్రకథ కళాకారుడిగా వేలాది ప్రదర్శనలు ఇచ్చిన అప్పారావు ఆకాశవాణి, దూరదర్శన్ లో సైతం ప్రదర్శనలు ఇచ్చి గుర్తింపు పొందారు. 76 ఏళ్ళ అప్పారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా దశదినకర్మ జరుగుతున్న రోజే కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు ప్రకటించడంతో కుటుంబ సభ్యులు ఒక వైపు దుఃఖం, మరో వైపు సంతోషంతో అప్పారావును స్మరించుకున్నారు. భార్య మిరియాల నాగమణితో కలిసి ఎన్నో బుర్రకథ ప్రదర్శనలు ఇచ్చిన అప్పారావు వందలాది మందికి శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దారు. భార్య నాగమణి 2018లో మరణించగా ఈనెల 15వ తేదీన అప్పారావు కన్నుమూశారు. రామచంద్రపురం ప్రాంతానికి చెందిన టీవీ రేడియో కళాకారుడు రావిశెట్టి వీరేశం శిష్యుడైన అప్పారావు బుర్రకథే జీవం పోసి ప్రత్యేక గుర్తింపు పొందారు. 1974లో రేడియో, 1993లో దూరదర్శన్ లో ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. అలాగే వివిధ ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పిస్తూ ఆయన చేసిన బుర్రకథ గానం ప్రజలను ఆకట్టుకునేది. 1975లో పెద్దాపురంలో జరిగిన బుర్రకథ పోటీల్లో 50 తులాల వెండి కప్పు గెలుచుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం ఆయన కుమారులు, కుమార్తెలతో పాటు మనవలు సైతం బుర్రకథ కళా రంగంలోనే కొనసాగుతూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని అంటున్నారు. అప్పారావుకు పద్మశ్రీ అవార్డు రావడం జిల్లాకు, కొత్తపేట నియోజకవర్గానికి గర్వ కారణం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం అప్పారావు స్వగృహం వద్ద జరిగిన సంస్మరణ సభలో ఎమ్మెల్యే సత్యానందరావు పాల్గొన్నారు. అప్పారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. అప్పారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అప్పారావుకు పద్మశ్రీ అవార్డు రావడం సంతోషంగా ఉందని, అయితే ఆయన మరణించిన తరువాత అవార్డు రావడం బాధగా ఉందని కుమారులు, కుమార్తెలు ఆవేదన వ్యక్తం చేశారు. బుర్రకథ కళాకారుల్లో 98 శాతం మంది తమ తండ్రి అప్పారావు శిష్యులే అని వారు తెలిపారు. ఈ పద్మశ్రీ అవార్డు అప్పారావుకు రావడం కాదని, ఆయన ప్రతినిధించిన బుర్రకథ కళకు లభించిన పురస్కారంగా భావిస్తున్నామని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని చెప్పారు.

# డబ్బులిస్తేనే..సర్టిఫికెట్లు మంజూరు చేస్తా : సూరంపాలెం వీఆర్ఓ హుకుం

- ప్రతి సర్టిఫికెట్ కు ఒక్కో రేటు
- ఎంపీ తంగెళ్ల సహకారంతో కలెక్టర్ కు ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగులోనికి వచ్చిన వైనం



గండేపల్లి , జనవరి 26, ( ప్రభాతవార్త ) : దేవుడు వరమిచ్చిన పూజారి వరమివ్వడు.. అన్న చందంగా గండేపల్లి మండలం సూరంపాలెం వీఆర్ఓ ప్రతీ సర్టిఫికెట్ కు ఒక రేటు నిర్ణయించి కాసుల కురిపించుకుంటూ పనిచేయడం లేదని.. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం ఆ ఉద్యోగికి వత్తాసు పలుకుతున్నారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూరంపాలెం కు చెందిన అడ్డాల అనంతలక్ష్మికి ఐదుగురు సంతానం కాగా వీరిలో ముగ్గురికి జనన నమోదు సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా, పట్టించుకోకపోవడంతో ఆమె కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాసరావును ఆశ్రయించారు. ఆయన సహకారంతో కలెక్టర్ కు బాధితులు ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన కలెక్టర్ పెద్దాపురం ఆర్డీవో, గండేపల్లి తహసిల్దార్ కు ఆదేశాలు జారీ చేయడంతో అసలు విషయం ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది వివరాలు ఉన్న ఎలా ఉ న్నాయి. గ్రామానికి చెందిన అడ్డాల అనంతలక్ష్మి గత రెండు నెలల క్రితం తన పిల్లలు ముగ్గురికి జనన ధృవీకరణ పత్రాల కోసం ఆమె చేసుకున్న వీఆర్ఓ ను ఆశ్రయించగా ఆ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఒక్కొక్క పత్రానికి ఐదు వేల రూపాయలు చొప్పున 15 వేలు డిమాండ్ చేసాడు. తాను అంత ఇవ్వలేనని ఎనిమిది వేలు ఇస్తాను అని చెప్పినా వినకపోవడంతో ముందుగా 11 వేలు ఇస్తానని పండుగ అనంతరం మిగిలిన నాలుగు వేలు ఇస్తానని ప్రాధేయపడ్డానని అనంతలక్ష్మి ఆవేదనతో తెలిపింది. అప్పటికి వినకపోవడంతో ఎంపి ఉదయ శ్రీనివాసరావు ఆశ్రయించగా ఆయన సహకారంతో కలెక్టర్ కు ఫిర్యాదు చేశానని తెలిపింది.వెంటనే మండల తహశీల్దార్ ఇంటికే వచ్చి జనన సర్టిఫికేట్ లు అందజేశారని అనంతలక్ష్మి తెలిపింది. వీఆర్ఓ పై ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటూ ఆ కుటుంబం పై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం ఒత్తిడి చేస్తున్నారని ఆమె ఆవేదనతో తెలిపింది. గ్రామంలో సుమారు 40 నుండి 50 మంది విద్యార్థులు జనన సర్టిఫికెట్ లు కోసం పంచాయతీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని వెంట జిల్లా అధికారులు స్పందించి విచారణ జరిపి బాధ్యులు పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై వీఆర్ఓ మాట్లాడుతూ వాళ్ళను లంచం అడగలేదని,సర్టిఫికెట్ ఎంక్వయిరీ చేసేందుకు ఆలస్యం అవ్వడం తో వారు కంప్లైంట్ ఇచ్చారని అన్నారు. తహశీల్దార్ శ్రీనివాస్ ను వివరణ కోరగా డబ్బులు డిమాండ్ చేశారని ఎటువంటి ఆధారాలు లేవని ఉన్నతాధికారుల ఆదేశాలతో వారికి సర్టిఫికెట్ లు అందించడం జరిగిందని తెలిపారు.

# దేశం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనుల స్ఫూర్తితో సేవలందించాలి : ఎమ్మెల్యే సత్యానందరావు



రావులపాలెం , జనవరి 26, ( ప్రభాతవార్త ) : దేశం కోసం ప్రాణత్యాగ చేసి స్వాతంత్ర్యం సాధించిన త్యాగధనుల స్ఫూర్తితో సేవలు అందించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.రావులపాలెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం సత్యానందరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చి స్వపరిపాలనకు అద్భుతమైన మహనీయులను గుర్తుచేసుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని ఉద్బోధించారు.ఆ మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఎమ్మెల్యే సత్యానందరావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాబూరావుకు ఉత్తమ సేవా పురస్కారం



కె గంగవరం , జనవరి 26, ( ప్రభాతవార్త ) : 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అమలాపురంలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉత్తమ సేవా పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఆదివారం రామచంద్రపురం ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవా శాఖలో టీమ్ లీడర్గా విధులు నిర్వహిస్తున్న జి. బాబూరావు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్,జిల్లా సూపర్నెంట్ ఆఫ్ పోలీస్ కృష్ణారావు సమక్షంలో ఆయన ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవా శాఖలో బాధ్యతలు చేపట్టి నుండి వారి చేసిన ఎన్నో విశిష్ట సేవలను మెచ్చి జీఎంసి బాలయోగి స్టేడియంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని బాబూరావు అందించారు. పురస్కారం అందుకున్న బాబూరావును పలువురు ఆరోగ్య మిత్రలు ఈ సందర్భంగా అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తమ ఆరోగ్య మిత్రగా ఆకుల రాజు ఉత్తమ సేవా పురస్కారం కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు.

# తొండంగి మండలంలో ఘనంగా గణతంత్ర వేడుకలు



తొండంగి , జనవరి 26, ( ప్రభాతవార్త ) : 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు తొండంగి మండలం లో ఆదివారం ఘనంగా జరిగాయి.. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల యందు జాతీయ జెండా రెపరెపలాడింది. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఓ బి రాజేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించి కార్యాలయ సిబ్బందికి స్వీట్లు పంచారు. మండల పరిధిలో గల పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపిడిఓ బి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని, మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఈసందర్భంగా వారి త్యాగాలను విద్యార్థులకు వివరించి అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థులందరికీ స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మండలంలో ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



ప్రత్తిపాడు , జనవరి 26, ( ప్రభాతవార్త ) : మండల వ్యాప్తంగా ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద హెచ్ఎం వెంకటరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గౌరవ వందనం చేసి గణతంత్ర దినోత్సవ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. స్థానిక కోర్టు ఆవరణలో ఇంచార్జ్ జడ్జ్ ప్రసన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం లో తాసిల్దార్ ఎం సూర్యప్రభ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు జండా ఆవిష్కరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సిఐ సూర్య అప్పారావు, ఎస్ఐ సూర్యకాంతం జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్ద సిఐ పి శివప్రసాద్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సూపరిండెంటెంట్ డాక్టర్ సౌమ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలలగుల స్వామి, భొల్లు వెంకటేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలో ప్రభుత్వ స్కూల్ లో, గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు

# ఈఓ కామేశ్వరరావు కు అవార్డు



కోనసీమ బ్యూరో (మండపేట) ( ప్రభాతవార్త ) : మండపేట శ్రీ జనార్ధన అగస్తేశ్వర స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పివివిఎస్ కామేశ్వరరావు ఉత్తమ పురస్కారం అందుకున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ జిల్లా ఎస్పీ, అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గం ఎంపి జి హరీష్ మధుర్ సమక్షంలో ఉత్తమ సేవా పురస్కార అవార్డును అందుకున్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps



వేదికపై యాగ్నిక అయ్యంగార్ భరతనాట్యం ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. గర్భంలో కృష్ణుడిని మోసే దేవకిలా 'మాతృత్వం' వర్తించి అందరినీ మెప్పించారామె. బెంగళూరుకు చెందిన యాగ్నిక విజంగానే అప్పుడు నిండువెలల గర్భిణి.

నాట్యం అనుకున్నంత తేలిక కాదు మెదడుతో అవయవాలన్నీ అనుసంధానమవ్వాలి. భంగిమలతో భావాన్ని పలికించాలి. శారీరకంగా, మానసికంగా ఫిట్ ఉండాలి. నర్తించేటప్పుడు శరీరం సౌకర్యంగా ఉండాలి. నృత్యంలో దశాబ్దానికి పైగా అనుభవం ఉన్న యాగ్నికాకు వేదికపై ప్రదర్శన ఇవ్వడం కొత్తకాదు. అయితే ఈసారి ఆమె ఎనిమిదినెలల

## నిండు గర్భిణి నృత్యం..

గర్భిణి కడుపులో ఉన్న తన బిడ్డతో కలిసి నర్తించాలనిపించిందామెకు. అంతా రిస్క్ అంటే ఈమె మాత్రం దీన్ని ఛాలెంజ్‌గా తీసుకున్నారు. నిండు గర్భంతో వేదికపై భరతనాట్యాన్ని ప్రదర్శించడానికి 30 ఏళ్ల యాగ్నిక సిద్ధమయ్యారు. నా గర్భంలోని బిడ్డతో పూర్తిగా అనుసంధానమై సాధన చేశా. నా అనుభూతిని నా బిడ్డ కూడా పొందాడు. ఎందుకంటే సాధన చేసేటప్పుడు నాకు రాగం, భంగిమవంటివి నచ్చలేదనిపించినప్పుడు వికారంగా, అసౌకర్యంగా ఉండేది. మనసుకు నచ్చినట్లు చేసిన క్షణం తను కడుపులో కదిలేది. అదీ తన ప్రతిస్పందన అని అర్థమయ్యేది. ఈ నృత్యంలో తను నాకు సహకంపోజర్ అనిపించింది. తన ప్రతి కిము అనుభవిస్తూ, ప్రాక్టీస్ చేశా. డ్యాన్సు చాలా శారీరక శ్రమ చేయాల్సి ఉంటుందని తెలిసి సిద్ధపడ్డా. సృష్టి సెంటర్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్ థెరపీ డైరెక్టర్ ఎ.వి. సత్యనారాయణ అందించిన ప్రోత్సాహంతో యోగా థెరపీలో నైపుణ్యాలు పెంచుకున్నా, వైద్యుల సలహాలు తీసుకుంటూ ఆరునెలలపాటు సాధన చేశా. అంతేకాదు. కొన్నిసార్లు శారీరకంగా సవాళ్లెదుర్కొన్నా. నా కదలిక నాబిడ్డకు ప్రమాదకరం అవుతుందేమో అనికూడా భయపడ్డారంతా. వాటన్నింటినీ దాటుకుని ప్రయత్నిస్తున్నప్పుడు ప్రదర్శనకు సరిగ్గా వారం ముందు అనుకోకుండా మావయ్య చనిపోయారు. ఇది నా మనసును తీవ్ర వేదనకు గురిచేసింది. ప్రదర్శన దాదాపు రద్దు చేసుకున్నా. అయితే మా అత్తయ్య, మన్ను ముందడుగు వేయమంటూ ప్రోత్సహించారు. అది తిరిగి నాలో శక్తినింపి నృత్యప్రదర్శన ఇవ్వగలిగేలా చేసింది అని చెబుతున్న యాగ్నిక గంటపాటు వేదికపై ఏకబిగిన ప్రదర్శన ఇచ్చారు. నిండుగర్భంతో చేసిన ఆమె నృత్యం అందరి ప్రశంసలూ అందుకుంది. మరవలేని అనుభూతిని మిగిల్చింది.

# లక్షల మంది జీవితాల్లో వెలుగులు..

**జైలుకి వెళ్లినవాళ్లని దూరంగా ఉంచే సంఘటనలు కొన్ని భయపడే సందర్భాలు శిక్ష అనుభవించినా నేరస్థగానే చూస్తారు. వాళ్లతో కలవడానికీ ఉద్యోగం ఇవ్వడానికి సంకోచిస్తారు. అలాంటప్పుడు వాళ్లకెలా ఉంటుంది? ఇదే అలోచించారు. కిరణ్‌బేడీ ఆమె చూపిన పరిష్కారం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోంది.**

'బయటికి వెళితే మమ్మల్ని ఎవరైనా ఆదరిస్తారా? అసలు మనుషులుగానైనా చూస్తారా?' జైల్లో ఓ ఖైదీ అడిగిన ఈ ప్రశ్న భారత తొలి మహిళా ఐపీఎస్ డా.కిరణ్ బేడీని ఆలోచనలో పడేసింది. దాని ఫలితమే 'ఇండియా విజన్ ఫౌండేషన్', 1994లో తను అందుకున్న రామన్ మెగసేసే 'అవార్డు' మొత్తంతో దీన్ని ప్రారంభించారామె. ప్రపంచానికి అయినవాళ్లకీ దూరంగా... నాలుగ్గోడల మధ్య బతికే జైలు జీవితం గురించి తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. క్షణికావేశంలో తప్పు చేశా... అనుకోకుండా కేసులో ఇరుక్కునే బందీఖానాలోకి వెళ్లేవారందరో. చాలాసార్లు కేసు పూర్తయ్యేసరికి ఆలస్యమవుతుంది. నిర్దోషి అయినా జైల్లోనే ఏళ్లపాటు ఉండిపోయే వారికీ కొదవ లేదు. తీరా బయటికొచ్చే సరికి వాళ్ల జీవితమంతా వృథా అవుతుంది. జైలుకి వెళ్లారన్న ముద్రతో కొలువు దొరక్కపోవచ్చు. ఈ వారిలో గూడు కట్టుకున్న నిరాశ సంగతేంటి? వీటన్నింటికీ పరిష్కారంగా ఇండియా విజన్ ఫౌండేషన్ పేరుతో ఎన్వోఓ తీసుకొచ్చారు కిరణ్‌బేడీ.




**ఏం చేస్తుందీ సంస్థ?** జైలుకి వెళ్లినంత మాత్రాన అంతా అయిపోయినట్టు కాదు. గతాన్ని వెనక్కినెట్టి జీవితాన్ని కొత్తగా ప్రారంభించండి మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకోండి అని కౌన్సెలింగ్ ఇస్తాం. నిజానికి ఇది చెప్పినంత సులువు కాదు. ఒంటరి అయ్యామన్న బాధ, తప్పు చేశాం, అనవసరంగా తొందరపడ్డామంటూ తమలో తామే కుంగిపోతుంటారు. ఇక నిర్దోషుల పరిస్థితి మరీ దారుణం. అందుకే ఖైదీల మనసు మారుస్తూనే... కంప్యూటర్, టైలరింగ్, క్రాఫ్ట్, చదువు కోవడం ఇలా. నైపుణ్యశిక్షణతో పాటు కస్టడీలో ఉన్నవారి పిల్లల కోసం క్రెష్లు, ఆర్థికంగా వెనకబడిన వారి పిల్లలకు చదువులనూ అందిస్తాం. జైలు నుంచి బయటికి వెళ్లేసరికి వారికి ఎవరిమీద ఆధారపడాల్సిన అవసరం ఉండకూడదు, గతం తాలూకూ నీడలు వారిని వెంటాడొద్ద నేదే మా ప్రయత్నం' అంటారు సంస్థ డైరెక్టర్ మోనికా ధవన్. జైల్లో ఉత్సాహంగా ఉన్నవారిని వలంటీర్లుగా తీర్చిదిద్దు తున్నారు. తీహార్ జైల్లో మొదలైన ఈ సేవలు దేశవ్యాప్తంగా వంద కారాగా రాలకు విస్తరించాయి. పది లక్షల మందికి పైగా ఈ నైపుణ్యాలను అందించారు. మొబైల్ మీరెప్పుడై దీనివల్ల మీ ప్రయోజన మొబైలు పాటించారా. వాళ్లలో మార్పు వస్తే సరిపోతుందా? చుట్టూ ఉండే వాతావరణం కూడా సానుకూలంగా ఉండాలి!



ఇదీ ఆలోచించారు. కిరణ్ అందుకే అధికారుల కోసమూ కొన్ని కార్యక్రమాలు రూ. పొందారు. వీటిద్వారా ఖైదీల పట్ల సహానుభూతి చూపుతూ, వారిని ప్రోత్సహిస్తారు. స్థూలంగా నేరస్థులు... వాళ్లలో మార్పు రాదు అన్న జైల్లో పనిచేసే అధికారుల్లో తొలగేలా చూస్తారు.. కేవలం గత ఏడాదే 816 మంది అధికారులు ఈ శిక్షణలో ఉన్నారు.లక్షల మంది వరకూ మా ప్రయాణం సాగడం అంత సులువు కాదు. ఒక కుర్రాడిని ఈ 'ప్రిజన్ ప్రోగ్రామ్'లో చేరి తనని తాను తీర్చిదిద్దుకోమని ఎన్నిసార్లు నచ్చజెప్పినా అతనిలో మార్పు లేదు. సెషన్ల తరవాత ఎన్నో రేడియో జాకీగా శిక్షణ తీసుకున్నాడు. ఒకప్పుడు మాట బయటికి రానిచ్చే వాడు కాదు. ఇప్పుడుగాన్ జైల్లో రేడియో ప్రోగ్రామ్ గుడ్డు. ఇదంతా కష్టమైన పనే.... కానీ మా వల్ల వాళ్ల కళ్లలో ఆశలు చిగురించడం చూస్తే మరింత ఉత్సాహంగా పనిచేయాలని పిస్తుంది అంటారు. ఇండియా విజన్ ఫౌండేషన్ సభ్యులు. వాళ్ల పనిని అభినందించాల్సిందే కదూ!

## పాప్‌కార్న్ సులువుగా ..



సినిమాకి వెళ్లాలంటే ఇంటర్వెల్లో పాప్‌కార్న్ ఉండాల్సిందే లేదంటే.. ఏదో వెలితిగా, చక్కగా ఉంటుంది. ఈ పేలాలు థియేటరుకే పరిమితం కాదు. ఇంట్లోనూ ఇష్టంగా తినేస్తాం. అంత ఇష్టమైన పాప్‌కార్న్ బయట కొనుక్కుంటే. ప్యాకెట్ తెరిచాక వెంటనే తినేయాలి. లేదంటే క్రిస్పీనెస్ ఉండదు. సాగినట్లవుతాయి. అంతకంటే ముఖ్యంగా.. అవి నిలవుండేందుకు రసాయనాలు ఉపయోగిస్తారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ఇంట్లోనే చేసుకుంటే బాగుంటుంది కదూ!

ఎలాగంటారా.. ఎండు మొక్కజొన్న గింజలు కొన్నిటిని ఒక పాత్రలోకి తీసుకుని.. అందులో ఆలివ్ నూనె లేదా వెన్న, కొంచెం ఉప్పు వేసి కలియ తిప్పాలి. వీటిని అవెన్‌కు అనుకూలమైన పేపర్ బ్యాగ్‌లో వేసి, చివర్లో మూసేయాలి.

ఇప్పుడు అవెన్‌లో పెట్టి, నిమిషం పాటు ఉంచితే సరి. ఘుమఘుమలాడే వేడి వేడి పాప్‌కార్న్ సిద్ధం. ఇక తిని ఆనందించడమే తరువాయి.

## మనకు తెలియకుండానే ఖర్చు !

సొంతంగా సంపాదించ డం మొద లు పెట్టాక తెలియ కుండానే అలా ఖర్చు చేస్తుంటారు. కొందరికి ఆర్థిక పరిస్థితులు బాగున్నా అల మరాలు నింపేస్తా రుగా అంటే.. దానికీ కారనముంది అంటున్నాయి కొన్ని పరిశోధనలు. ఆత్మ విశ్వా సంగా కనిపించడానికి అమ్మాయిలు ఎంచుకునే మార్గాల్లో దుస్తులూ ఒకటి. వాళ్ల వ్యక్తిత్వం, స్టైల్‌ని వాటి ద్వారా వ్యక్తపరుస్తారట. అందుకే ఎన్ని ఉన్నా తాజా ధోరణు లను తెలుసుకుని మరీ వేసుకున్నా వేసుకోకపోయినా దుస్తులు, చెప్పులు వగైరా కొంటూనే ఉంటారు. ఇంకొందరైతే అలా కొనడం ద్వారా ఒత్తిడి దూరమైన ట్లుగా భావిస్తారు. అందుకే 'ఎందుకింత ఖర్చు' అన్నా తీరు మాత్రం మార్చుకోలేరు. బ్యూటీ ఉత్పత్తుల మాటేంటి? ముఖ్యమైన సందర్భం.. అందంగానో, నలుగురిలో ఉత్తమంగానో కనిపించా లనుకుంటారు. తీరా ఏ

ఆన్‌లైన్‌లో తగ్గింపు అని కని పించినా, సరదాగా బయటికి వెళ్లినా ఒకటో రెండో డ్రెస్సులు వెంటబెట్టు కొచ్చేస్తారు. అప్పటికే బోలెడు క్రీములు ఇంట్లో ఉన్నా.. ఎవరో సిఫారసు చేశారనో, తక్కువకే వస్తున్నా యనో మరిన్ని తెచ్చేస్తుంటారు. అప్పుడు అమ్మల నుంచి ఎదురయ్యే ప్రశ్న ఇప్పటికే ఉన్నాయిగా? మళ్లీ ఇవన్నీ ఎందుకు? దండగ ఖర్చు కాకపోతే' అనే కదూ! నిజంగానే ఎందుకిలా కొనేస్తాం?. కొన్ని వస్తువులు, దుస్తులు ఎంత నచ్చినా ఆర్థిక పరిస్థితి అను కూలించక కొనలేరు కొందరు. అదలా మనసులో నాటుకు పోతుందే మో..



కాటుకో, మరేదో కనిపించదు.. చూసే వాళ్లకు చిన్నగానే కనిపిస్తుంది. మనసులో ఆ లోటు వాళ్లకి తెలుస్తూనే ఉంటుంది. సందర్భమేదైనా 'పర్‌ఫెక్ట్'గా ఉండాలనుకునే అమ్మాయిలే ఎక్కువ. అలాంటివాళ్లు వీటినెలా తట్టుకుంటారు చెప్పండి. అందుకని ముందుగానే సిద్ధంగా ఉండా లన్న తాపత్రయంలో తెలియ కుండానే ఇలా ఖర్చు చేస్తుంటారు. ఈ తీరు ఇబ్బంది కదా! అంటే.. అవుననే అంటున్నాయి అధ్యయనాలు. ఖర్చు పెట్టే స్థోమత ఉందన్న ధైర్యం, అందుబాటులో ఉన్న క్రెడిట్ కార్డు అనవసర ఖర్చేమో అన్న ఆలోచనే రానీయడం లేదట. కాబట్టి, నెలకి దుస్తులు, సౌందర్య ఉత్పత్తులకు ఇంత అని బడ్జెట్ పెట్టుకోవాలి. దాన్ని తు.చ. తప్పకుండా పాటించడమే దీనికి సరైన పరి ష్కారం అంటున్నారు నిపుణులు. ఒకవేళ దానిలో మిగిలితే మరుసటి నెలకు బదిలీ చేసుకోవచ్చు. పరిధి దాటితే మాత్రం అడ్డుకట్ట వేసు కోవడంఒక్కటే మార్గం. ప్రయత్నిస్తారా మరి?

## తెలుసుకుందాం..

దమయంతి గుప్తా... ఫోర్డ్ కంపెనీ నియమించు కున్న మొట్టమొదటి భారత మహిళా ఇంజినీర్ అప్పట్లో మహిళలను నియమించుకోవద్దని



ఫోర్డ్ కంపెనీలో కఠిన నిబంధన ఉంది. అయితే, అసలు మీకు మహిళలకు అవకాశం ఇవ్వకపోతే మీ కంపెనీలో మహిళా ఇంజినీర్లు ఎలా ఉంటారు? అని ఇంటర్వ్యూలో హెచ్‌ఎరు ప్రశ్నించారు దమయంతి. ఆ వైద్యమే నిబంధనను తొలగించేలా వేసింది. అలా 1967లో యునైటెడ్ స్టేట్స్‌లోని ఫోర్ట్ మోటార్స్‌లో తన కెరియర్ మొదలు పెట్టారు దమయంతి,

# పదార్థాలతో పిల్లలు








చిన్నారులు ఆడినా పాడినా అందమే.న ఆఖరికి అల్లరి చేసినా ఆహ్లాదమే. ఎందుకంటే అది కపటం తెలియని పసితనం. చిలిపి చేష్టల సిసింద్రీల్లో మోసాలూ ద్వేషాలూ ఉండవు. ముద్దు ముద్దు ఆటలతో మరిపెం కలిగిస్తారు. పదార్థాలతో పిల్లల్ని రూపొందించాం. చూసి ఆనందించండి.












## మహాభారతము

వృషపర్వుడు రాక్షసరాజు. ఆయన వద్ద పురోహితుడు శుక్రాచార్యుడు. రాకుమార్తె శర్మిష్ఠ, శుక్రాచార్యుని కుమార్తె దేవయాని. ఒక రోజు కొందరు చెలికత్తెలతో కలిసి శర్మిష్ఠ, దేవయాని వనవిహారానికి వెళ్లి ఒక కొలనులో స్నానం చేస్తుండగా పెద్ద సుడిగాలి వచ్చి వారి వస్త్రాలన్నీ చిందర వందరగా ఎగిసి పడ్డాయి. వారంతా నీళ్ళలో నుండి త్వరత్వరగా బయటికి వచ్చి ఎవరికి ఏ వస్త్రం దొరికితే దాన్ని ధరించారు. రాజకుమారి శర్మిష్ఠ దేవయాని దుస్తుల్ని ధరించింది. రాకుమారి శర్మిష్ఠ వస్త్రాలే. వాటిని ధరించటానికి ఇష్టపడని దేవయాని శర్మిష్టతో 'నేను బ్రాహ్మణ కన్యను, నీకు పూజ్యురాలను. నీవు కట్టిన మలిన వస్త్రాన్ని నేను కట్టుకోను అనింది. శర్మిష్ఠ కోపంతో, నా తండ్రి రాజు, నీ తండ్రి నా తండ్రిని ఆశ్రయించి బ్రతుకుతున్నాడు, అని అంటూ దేవయానిని ప్రక్కన ఉన్న పాడుబడిన బావిలోకి తీసి వెళ్లింది. వేటకై వచ్చిన యయాతి దేవయానిని బావిలో నుంచి తీసి రక్షించి వెళ్లి పోయాడు. దేవయాని పట్టణంలోకి పోవటానికి ఇష్టపడక అక్కడే కూర్చొన్నది. విషయాన్నంతా తెలుసుకొని శుక్రాచార్యుడు వచ్చి, గొప్ప యజ్ఞాలు చేసిన వారికన్నా కోపం లేనివాడే ఉత్తముడు శర్మిష్ఠపై కోప్పడక ఇంటికి వెళదాం రా' అన్నాడు. వృషపర్వుడు వచ్చి దేవయానితో, ' నీ కోరికేమో చెప్పు, నెర వేరుస్తాను, అన్నాడు దేవయానితో శర్మిష్ఠతో కలిసి వేయి మంది దాసీలు కావాలని దేవయాని కోరింది. శర్మిష్ఠ ఆమెకు దాసి అయింది. (పుటలు 40-43-ఆదిపర్వము) శ్రీ మదాంధ్ర మహాభారతం రామకృష్ణ మఠం.



వ్యాస భగవానుడు ఏ గొప్ప సత్యాన్ని, నీతిని నేర్పుతున్నాడో గమనించారా? కులాన్ని గూర్చి అహంకరించరాదు, హోదాను బట్టి విర్ర వీగరాదు, యజ్ఞ యాగాదులను చేయుటకన్నా కోపాల్ని వదలటం శ్రేష్టం. ఏ కులస్తులైనా, ఎంత అధికారమున్న వారైన కర్మఫలితాన్ని అనుభవించక తప్పదు. పిల్లలు తప్పువారిని సమర్థించక వృషపర్వుని వలె, శుక్రాచార్యుని వలె వారికి తగిన విధంగా బుద్ధి చెప్పి సరిదిద్దాలి. ఇలాంటి వందల కథలను మనకు అందిస్తుంది మహాభారతం.

- రాచమడుగు శ్రీనివాసులు

ఆధ్యాత్మికం

## శీతగాలుల నుంచి చర్మానికి రక్షణ

**ముఖానికి క్రీములెన్ని రాసినా... చలిగాలుల ప్రభావం నుంచి తప్పించుకోవడం కష్టమే. దీంతో ముఖం పొడిబారుతుంది. శీతగాలుల నుంచి చర్మాన్ని రక్షించాలంటే...**

క్లెన్సింగ్తో రోజును మొదలుపెట్టాలి. అయితే చర్మంలోని సహజనూనెలు దూరమవ్వకుండా క్రీమ్. లేదా నూనె ఆధారిత క్లెన్సర్ను ఎంచుకోవాలి. చర్మంలోని మృతకణాలను ఎప్పటికప్పుడు తొలగిస్తేనే చర్మం కాంతివంతం ఉంటుంది. కానీ ఈ కాలం చర్మం సున్నితంగా మారుతుంది. కాబబట్టి, మైల్డ్ ఎక్స్‌ఫోలియేటర్లో వారానికి రెండుసార్లు శుభ్రపరచాలి.



**టోనర్‌గా..**, అల్కహాల్ ఫ్రీ టోనర్ను ఎంచుకోవాలి. ఈ సీజన్లో గ్లిజరిన్, గులాబీనీరు, కలబంద ఉన్న టోనర్ ఏదైనా మంచిదే. ఇది చర్మాన్ని తాజాగా, తేమగా, మృదువుగా మారుస్తుంది. చర్మరంధ్రాలను శుభ్రపరిచి దద్దుర్లు, పొడారడం వంటి సమస్యలకు చెక్ పెడుతుంది.

**మాయిశ్చరైజర్....** సెరమైడ్స్, షియాబటర్ లేదా కొవ్వు ఆమ్లాలు ఉన్న మాయిశ్చరైజర్ ఎంచుకోవాలి. క్రీమ్ ఆధారితమైనదైతే మరీ మంచిది. ఆపై సన్‌స్క్రీన్ తప్పనిసరి. ఇది ఎండ నుంచి హాని కలగకుండా నిరోధిస్తూనే ముందస్తు వృద్ధా ప్యఛాయల ను దరిచేర నీయదు. ఎస్పీఎఫ్30 లేదా అంతకంటే ఎక్కువ ఉన్న బ్రాడ్‌స్పెక్ట్రమ్ సన్ స్క్రీన్ను ఎంచుకోవాలి.

**ఆరోగ్యంగా...** చర్మ ఆరోగ్యానికి పైపై పూతలే చాలవు. లోపలినుంచీ పోషణ కావాలి. అందుకే తగినంత నీరు తప్పనిసరి. హెర్బల్‌టీలతో చర్మంపై ముడతలు, గీతలు రాకుండా ఉంటాయి. రాత్రుళ్లు ముఖాన్ని మృదువైన క్లెన్సర్తో శుభ్రపరుచు కోవాలి. ఆపై కలబందలో విటమిన్ ఈ బాదంనూనె కలిపిన మిశ్రమాన్ని రాయడం తప్పనిసరి. ఇది పొడిబారే ప్రభావాన్ని తగ్గించి ఉదయానికి ముఖాన్ని తాజాగా మారుస్తుంది.

## పాత్రల్ని మెరిపిద్దామిలా..

**ఉదయాన్నే ఓ పక్క వంట, ఇంకోపక్క పిల్లలను రెడీ చేస్తుంటాం.** రెండూ ఏకకాలంలో చేయడంతో ఒక్కోసారి పాలు, అన్నం, కూరలు అడ ుగంటడం, మాడిపోవడం వంటివి తరచూ జరుగుతాయి. వీటిని మామూలుగా వదిలించాలంటే కష్టమే.కానీ ఈ చిట్కాలను ఉపయోగిస్తే సులభంగా కొత్తవాటిలా మెరిపించవచ్చు. పాత్రలో మాడు ఉన్నంత వరకు నీటిని నింపి, పావు కప్పు వెనిగర్ కలపాలి. తర్వాత స్టౌ మీద పెట్టి మీడియం మంటపై మరిగించాలి. ఇలా మరుగుతున్నప్పుడు పాత్రకు పట్టి ఉన్న ఆహారపదార్థాలు, మొడిమరకలు నెమ్మదిగా పాత్ర నుంచి వేరవుతాయి. తర్వాత స్క్రబ్బర్ లేదా పీచుతో శుభ్రం చేస్తే సులభంగా తొలగిపోతాయి. నిమ్మకాయలను ముక్కలుగా కోసి పాత్రని సగం నీటితో నింపి, మరిగించి పీచుతో శుభ్రం చేయాలి. నిమ్మలో ఉండే యాసిడ్ గుణాలు పాత్రకు అంటుకున్న మొండి మరకలు, వాసనను తొలగిస్తాయి. పాత్రలో నీటిని నింపి తగినంత బేకింగ్ సోడా వేసి పదినిమిషాలు మరిగించాలి. లేదా బేకింగ్ సోడాలో వెనిగర్‌ను కలిపి పేస్టులా తయారు చేసి, ఈ మిశ్రమంతో పాత్రలను శుభ్రపరిచినా మంచిదే. . మాడు మరకలను వదిలించడానికి మరకలున్న పాత్రలో ఉల్లితొక్కలను నీటిలో వేసి పావుగంట వేడిచేయాలి. తర్వాత రోజూ ఉపయోగించే సబ్బుతో శుభ్రపరిస్తే సరి. కొత్తవాటిలా మెరుస్తాయి.

తెర

# 'మాస్ జాతర' చిత్రం నుంచి గ్లింప్స్ విడుదల



**మాస్ మహారాజా** రవితేజ కథనాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పుడు ఈ చిత్రం నుంచి గ్లింప్స్ విడుదలైంది. జనవరి 26వ తేదీన రవితేజ పుట్టినరోజు సందర్భంగా, 'మాస్ జాతర' గ్లింప్స్‌ను చిత్ర బృందం ఆవిష్కరించింది. ఈ గ్లింప్స్, అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న మునుపటి అసలు సిసలైన మాస్ మహారాజా రవితేజను గుర్తు చేసేలా ఉంది. తనదైన కామెడీ టైమింగ్, విలక్షణ డైలాగ్ డెలివరీ ఎనర్జీకి పెట్టింది పేరు రవితేజ. అందుకే ఆయన పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతుంటాయి. రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విందు భోజనం లాంటి మాస్ ఎంటర్టైనర్ గా మాస్ జాతర రూపొందుతోందని గ్లింప్స్ ను చూస్తే అర్థమవుతోంది. రవితేజ సినీ ప్రస్థానంలో "మనదే ఇదంతా" అనే డైలాగ్ ఎంతటి ప్రాముఖ్యత పొందినదో తెలిసిందే. గ్లింప్స్‌కు ఈ డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది అభిమానులను మళ్లీ ఆ రోజులకు తీసుకొని వెళ్తుంది. అలాగే నేటి ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. దర్శకుడు భాను బోగవరపు మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా ఆకర్షణీయంగా 'మాస్ జాతర' గ్లింప్స్ ను మలిచారు. మాస్ మహారాజాగా రవితేజ మాస్ ప్రేక్షకులకు ఎందుకు అంతలా చేరువయ్యారో ఈ గ్లింప్స్ మరోసారి రుజువు చేస్తోంది. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం, రవితేజ ఎనర్జీకి ఏమాత్రం తగ్గకుండా ఉండటమే కాకుండా, గ్లింప్స్‌కు ప్రధాన బలంగా ఉంది. 'మాస్ జాతర' చిత్రాన్ని మాసివ్ ఎంటర్టైనర్‌గా మలచడానికి ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ప్రముఖ ఛాయగ్రాహకుడు విధు అయ్యన్న కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. నందు సవిరిగాన సంభాషణలు సమకూర్చారు. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ శ్రీలీల జోడి గతంలో 'ధమాకా'తో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. వీరి కలయికలో 'మాస్ జాతర' రూపంలో మరో బ్లాక్ బస్టర్ అందుకోవడం ఖాయమని చిత్ర బృందం నమ్మకంగా ఉంది. తాజాగా విడుదలైన గ్లింప్స్ 'మాస్ జాతర' చిత్రంపై అంచనాలను రెట్టింపు చేసింది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి.

# 'తండేల్' ట్రైలర్ 28న రిలీజ్



**యువ సామ్రాట్** నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వం వహించిన 'తండేల్' 2025లో రిలీజ్ కానున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీస్ లో ఒకటి, ఇప్పటివరకు విడుదలైన అన్ని పాటలకు బ్లాక్ బస్టర్ స్పందన లభించింది. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ స్వరపరిచిన బుజ్జి తల్లి, శివ శక్తి, హిలెస్సో హిలెస్సో పాటలు మ్యూజిక్ చార్టులలో అగ్రస్థానంలో, యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఈరోజు, మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను జనవరి 28న విడుదల చేస్తామని అనౌన్స్ చేశారు.

ట్రైలర్ పోస్టర్‌లో, అల్యూమినియం బకెట్‌ని వెపన్‌గా పట్టుకొని నాగ చైతన్య, విలన్స్‌ను చంపడానికి సిద్ధంగా ఉన్న ఫెరోషియస్ అవతారంలో కనిపించారు. బకెట్‌పై రక్తపు గుర్తులను కూడా మనం గమనించవచ్చు, ఇది సినిమాలో ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్ నుంచి ప్రజెంట్ చేస్తోంది. లవ్ ఎలిమెంట్స్‌తో పాటు, సినిమాలో మంచి యాక్షన్ కూడా ఉంటుందని కూడా ఇది సూచిస్తుంది.

అల్లు అరవింద్ సమర్పకుడిగా, గీతా ఆర్ట్స్ బ్యానర్ పై బన్నీ వాసు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. టాప్ టెక్నిషియన్స్ ఈ సినిమాకి పని చేస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నర్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు, శ్యామ్‌దత్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు, నేషనల్ అవార్డ్ విన్నర్ నవీన్ నూలి ఎడిటర్‌గా, శ్రీనాగేంద్ర తంగల ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు. తండేల్ ఫిబ్రవరి 7న విడుదల కానుంది. తారాగణం: నాగ చైతన్య, సాయి పల్లవి

సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: చందూ మొండేటి, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాత: బన్నీ వాసు, బ్యానర్: గీతా ఆర్ట్స్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, డిఓపీ: శ్యామ్‌దత్, ఎడిటర్: నవీన్ నూలి, ఆర్ట్: శ్రీనాగేంద్ర తంగల, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్‌షో.

# సుధీర్ బాబు హీరోగా 'జటాధర'



**రుస్తుం తరువాత** మళ్లీ ప్రేరణ అరోరాతో కలిసి జీ స్టూడియోస్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రాబోతోన్న ఈ మూవీకి వెంకట్ కళ్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'జటాధర' చిత్రంలోకి జీ స్టూడియోస్ ఎంట్రీ ఇవ్వడంతో టీంలో కొత్త ఉత్తేజం వచ్చింది. ఈ మేరకు జీ స్టూడియోస్ సిఇఒ ఉమేష్ కేఆర్ బన్సాల్ మాట్లాడుతూ..జీ స్టూడియోస్‌లో మేం ఇంకా ఎన్నో కథలను అందించాలని, అవి తరతరాలుగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండాలని కోరుకుంటున్నాం. జటాధర థ్రిల్లింగ్ సూపర్ నేచురల్‌గా ఉండబోతోంది. ఈ ప్రాజెక్ట్ కోసం మరోసారి ప్రేరణ అరోరాతో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది అని అన్నారు. జటాధర సినిమా కథ అనంత పద్మనాభ స్వామి ఆలయం చుట్టూ తిరుగుతుంది. అక్కడి సంపద, దాని చుట్టూ అల్లుకున్న వివాదాలు, నేపథ్యం, చరిత్ర ఇలా అనేక అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. అక్కడి నిధిని మాత్రమే కాకుండా ఆలయ చరిత్ర, పురాణా కథల్ని కూడా చూపించబోతోన్నారు. ఈ సినిమాలో సుధీర్ బాబు కారెక్టర్ చాలా భిన్నంగా ఉండబోతోంది. అందుకే ప్రస్తుతం సుధీర్ బాబు తన బాడీని పెంచే పనిలో పడ్డారు. ఇందుకోసం కఠినమైన శిక్షణ కూడా తీసుకుంటున్నారు. ఉమేష్ కెఆర్ బన్సాల్, ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్, రాజీవ్ అగర్వాల్, అరవింద్ అగర్వాల్, నిఖిల్ నందా, మోనేష్ మంఘ్నానితో పాటు జీ స్టూడియోస్ బ్రాండ్ వ్యాల్యూ పెంచేలా ఈ జటాధర ఉండబోతోంది. ఫిబ్రవరిలో జటాధర చిత్రీకరణ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరగనుంది.

# 'మదగజరాజా' ట్రైలర్ విడుదల



**విశాల్ సెన్సేషనల్ హిట్** మదగజరాజా సినిమా సంక్రాంతి సందర్భంగా తమిళంలో విడుదలై భారీ విజయాన్ని సాధించింది. సుందర్ సి దర్శకత్వంలో జెమిని ఫిల్మ్ సర్క్యూట్ నిర్మించిన ఈ సినిమా 50 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి, పండుగ సీజన్‌లో తమిళంలో నంబర్ వన్ చిత్రంగా రికార్డు సృష్టించింది. ఈ యాక్షన్‌కామెడీ సినిమా జనవరి 31న తెలుగులో విడుదల కానుంది. ఈరోజు విక్టరీ వెంకటేష్ ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ కామెడీ, యాక్షన్ పర్ఫెక్ట్ బ్లెండ్‌తో ఎంటర్ టైనింగ్ రైడ్‌ను అందించింది. విశాల్, సంతానం మధ్య హిలేరియస్ కెమిస్ట్రీ అదిరిపోయింది. విలన్ సోను సూద్ విశాల్‌తో ఢీకొట్టడం ఒక గ్రిప్పింగ్ షోడౌన్‌గా ఉంటుందని హామీ ఇస్తుంది. విశాల్ తన సిగ్నేచర్ ఎనర్జీతో అదరగొట్టారు. సంతానంతో అతని కెమిస్ట్రీ ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ ఇద్దరూ గ్లామర్‌ను జోడించడం మరింత ఆకర్షణగా నిలిచింది.

కామెడీ ఎంటర్‌టైనర్‌లను రూపొందించడంలో పేరుపొందిన దర్శకుడు సుందర్ సి, మరోసారి తన మార్క్ ఎంటర్ టైనర్ అందించారు. తెలుగు రాష్ట్రాలలో కూడా మద గజ రాజా హిట్ అవుతుందని ట్రైలర్ హామీ ఇస్తోంది. రిచర్డ్ ఎం. నాథన్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. విజయ్ ఆంటోనీ పవర్ ఫుల్ మ్యూజిక్ ఎనర్జీని మరింత ఎలివేట్ చేసింది. ఈ ట్రైలర్ సినిమా పై అంచనాలను పెంచింది.

తారాగణం: విశాల్, సంతానం, వరలక్ష్మి, అంజలి, శరత్ సక్సేనా, సోనూ సూద్, మణివణ్ణన్ (లేట్), నితిన్ సత్య, సదగొప్పన్ రమేష్, ఆర్. సుందర్ రాజన్, మొట్టా రాజేంద్రన్, మనోబాలా (లేట్), స్వామినాథన్, జాన్ కొక్కెన్, టార్జాన్, విచ్చు విశ్వ నాథ్




**తమిళ స్టార్ హీరో** దళపతి విజయ్ చేస్తున్న చివరి సినిమా మీద అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయి. దళపతి 69 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ మూవీని ప్రారంభించారు. ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ ఎత్తున నిర్మిస్తోంది. హెచ్ వినోద్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజైంది. జన నాయగన్ అనే టైటిల్‌తో దళపతి విజయ్ చివరి చిత్రం రాబోతోంది. ఈ టైటిల్ పోస్టర్‌లో దళపతి విజయ్ ఎంతో స్మార్ట్‌గా కనిపిస్తున్నారు. సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఈ పోస్టర్‌లోని సెల్ఫీకి, ఆ టైటిల్‌కి న్యాయం చేసినట్టుగా కనిపిస్తోంది. ఈ చిత్రంతోనే దళపతి



## విజయ్ సెన్సేషనల్ మూవీ టైటిల్
# 'జన నాయగన్'

విజయ్ సినీ జర్నీ ముగుస్తుంది. దీంతో ఓ శకం ముగిసినట్టు అవుతుంది. ఈ మూవీని విజయ్‌కి ఫేర్ వేల్‌గా ఉండబోతోంది. అభిమానులు ఈ సినిమాను గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేసుకునేలా ఉంటుంది. ఇక ఈ మూవీ టైటిల్ అర్థం అందరికీ తెలిసిందే. జన నాయకుడు పీపుల్స్ లీడర్ ప్రజా నాయకుడు అని అర్థం వస్తుంది. ఇన్నేళ్లలో విజయ్ చేసిన సేవా కార్యక్రమాలు, సినీ పరిశ్రమలో సాధించిన విజయాలకు చిహ్నంగా ఈ టైటిల్ ఉంది. ఈ చిత్రంతో అనిరుధ్ మరోసారి తన సంగీతంతో విజయ్ అభి మానుల్ని ఉర్రూతలూగించేందుకు సిద్ధంగా ఉన్నారు.

# అగాధియా థర్డ్ సింగిల్ 'నేలమ్మ తల్లే' విడుదల

**మోస్ట్ ఎవైటెడ్** ఫాంటసీహారర్ థ్రిల్లర్ అగాథియా థర్డ్ సింగిల్ 'నేలమ్మ తల్లే" విడుదలైంది, ఇది అభిమానులను, విమర్శకులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. లెజెండరీ యువన్ శంకర్ రాజా స్వరపరిచిన ఈ పాట, మన నేల యొక్క సాంస్కృతిక గొప్పతనాన్ని చెప్పే మాస్టర్ పీస్. అద్భుతమైన విజువల్స్‌తో, ఈ ట్రాక్ 2025లో అత్యంత ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటైన అగాథియా వేదికగా నిలుస్తుంది, ఈ చిత్రం ఫిబ్రవరి 28, 2025న తమిళం, తెలుగు, హిందీ భాషలలో పాన్‌ఇండియా స్థాయిలో విడుదల అవుతుంది.

"నేలమ్మ తల్లే" మన భూమి వారసత్వంలోకి ఒక ఆత్మీయ ప్రయాణం. ఈ పాటలో మూలికలు, సహజ వనరులను ఉపయోగించి లెక్కలేనన్ని వ్యాధులను నయం చేసిన ఋషులు, ప్రకృతి వైద్యుల అద్భుతమైన సహకారాన్ని అందంగా చిత్రీకరించారు. దీపక్‌కుమార్ పాధి అద్భుతమైన సినిమాటోగ్రఫీ విజువల్ వండర్‌గా వుంది. పా. విజయ్ రాసిన సాహిత్యం ద్వారా పాట యొక్క సారాంశం మరింత సుసంపన్నం చేయబడింది.

పాటపై దర్శకుడు పా. విజయ్ తన ఆలోచనలను పంచుకుంటూ ఈ పాట కేవలం సంగీతం మాత్రమే కాదు ఇది మన భూమి యొక్క లోతుగా పాతుకుపోయిన సాంస్కృతిక వారసత్వం గుండా ఒక ప్రయాణం. లెక్కలేనన్ని వ్యాధులను నయం చేసిన అద్భుతమైన ఔషధ మూలికలను మనకు ఇచ్చిన మన నేల సారాన్ని ప్రదర్శించాలనుకున్నాను. నేను ఈ విజన్‌ని యువన్‌తో పంచుకున్నాను. అతను దానిని వాణిజ్యపరంగా ఆకర్షణీయంగా మార్చారు. ఈ పాట మన నేల శక్తి ద్వారా మానవాళికి దోహదపడిన ఋషులు, వైద్యులకు నివాళి. యువన్ శంకర్ రాజా మాట్లాడుతూ,పా. విజయ్‌తో కలిసి పనిచేయడం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమైన అనుభవం. మన నేల యొక్క అద్భుతమైన ఔషధ, సాంస్కృతిక విలువ గురించి ఆయన కథలను పంచుకున్నప్పుడు, నాకు లోతైన బాధ్యత అనిపించింది. 'నేలమ్మ తల్లే నా బెస్ట్ కంపోజిషన్స్ లో ఒకటి' అన్నారు. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, వామిండియా (వైడ్ యాంగిల్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్) నిర్మించిన అగాథియా థర్గ్‌గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందిస్తుంది. పా. విజయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫాంటసీ, హర్రర్, నోస్టాల్జియాను మిక్స్ చేసిన మెస్మరైజింగ్ జర్నీ. భారతదేశంలోని ప్రముఖ కంటెంట్ పంపిణీ, లైసెన్సింగ్ కంపెనీ అయిన అనీష్ అర్జున్ దేవ్ వామిండియా సహకారంతో ప్రముఖ సౌత్ ఇండియన్ ఫిల్మ్ ప్రొడక్షన్ హౌస్ అయిన వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై డా. ఇషారి కె. గణేష్ రూపొందించిన గ్రాండ్ ప్రాజెక్ట్ అఘతియా. ఈ పాన్ ఇండియా మూవీ ఫిబ్రవరి 28, 2025న తమిళం, తెలుగు, హిందీలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



# 'కానిస్టేబుల్'గా వరుణ్ సందేశ్



**వరుణ్ సందేశ్** హీరోగా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ నిర్మిస్తున్న చిత్రం 'కానిస్టేబుల్'. వరుణ్ సందేశ్‌కి జోడీగా మధులిక వారణాసి పరిచయం కానున్నారు.

'కానిస్టేబులన్నా కానిస్టేబులన్నా సమాజమే నీ సేవకు సలాం అంటుందన్న...కానిస్టేబులన్నా కానిస్టేబులన్నా ఎగిరే జెండా నిన్నే చూసి మురిసిపోతుందన్నా" అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్ చేతుల మీదగా విడుదల చేయడం జరిగింది.. దీనికి శ్రీనివాస్ తేజ సాహిత్యాన్ని అందించగా సుభాష్ ఆనంద్ సంగీతాన్ని సమకూర్చారు. నల్గొండ గద్దర్ నర్సన్న ఆలపించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, నేను ఆవిష్కరించిన ఈ టైటిల్ సాంగ్ చాలా బావుంది. మా కానిస్టేబుల్స్ అంటే నాకు చాలా ఇష్టం. వాళ్ల మీద ఈ సాంగ్ రావడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ప్రతీ పోలీస్ ఈ సాంగ్ వింటారు" అని అన్నారు...హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, "సివి ఆనంద్ ఈ పాట విడుదల చేయడం మా సినిమాకు గర్వకారణం. వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది నాకు మంచి కం బ్యాక్ సినిమా అవుతుంది. నటనకు మంచి అవకాశం ఉన్న పాత్రను ఇందులో పోషించాను" అని అన్నారు.

నిర్మాత బలగం జగదీష్ మాట్లాడుతూ, "కానిస్టేబుల్ కావడం నా చిన్ననాటి కల అది నెరవేరకపోవడంతో ఆ టైటిల్‌తో ఈ సినిమాను నిర్మించడం జరిగింది. కానిస్టేబుల్‌ల మీద నాకున్న గౌరవంతో ఒక అద్భుతమైన పాటను నేను దగ్గరుండి రాయించి, నల్గొండ గద్దర్ నరసన్నతో పాటించడం జరిగింది. ఈ పాటను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ విడుదల చేయడం నాకు చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.

దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె. మాట్లాడుతూ, మంచి కథ, కథనాలు, పాత్రలో వరుణ్ ఒదిగిపోయిన విధానం, నిర్మాత అభిరుచి ఈ చిత్రం అద్భుతంగా రావడానికి దోహదం చేసిందని అన్నారు. సినిమాలో సందర్భానుసారంగా వచ్చే టైటిల్ సాంగ్ ఎంతగానో స్పందింప జేస్తుందని అన్నారు.

ఈ చిత్రంలోని ఇతర ముఖ్య పాత్రలలో దువ్వాసి మోహన్, సూర్య, రవివర్మ, మురళీధర్ గౌడ్, బలగం జగదీష్, ప్రభావతి, కల్పలత, నిత్య శ్రీ, శ్రీ భవ్య తదితరులు తారాగణం.

ఈ చిత్రానికి కెమెరా; హజరత్ షేక్ (వలి), సంగీతం : సుభాష్ ఆనంద్, ఎడిటర్: శ్రీ వర ప్రసాద్, బి. జి. ఎమ్: గ్యాని, ఆర్ట్ డైరెక్టర్ : వి. నాని పండు, మాటలు :శ్రీనివాస్ తేజ, పాటలు: రామారావు, శ్రీనివాస్ తేజ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎం జగ్గయ్య,

# రాజ్యాంగరహిత మనువాద పాలనకు బిజెపి యత్నం

### గణతంత్ర దినోత్సవం పతాకావిష్కరణలో పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్


ఆదివారం గాంధీభవన్‌లో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మనువాదంతో భారతదేశాన్ని పాలించాలని బిజెపి వేస్తున్న ఎత్తుగడలను ప్రజలు తిప్పి కొట్టాలని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపి వి. హనుమంతరావు, చైర్మన్ లు శివసేనారెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి ప్రసంగిస్తూ ఇందిరమ్మ పేరు ప్రభుత్వ పథకాలకు పెట్టుకోవడం రాష్ట్రానికి సమాఖ్యస్ఫూర్తితో వచ్చిన హక్కు అని, కానీ కేంద్రమంత్రి బండి సంజయ్ సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా ప్రవర్తించారని అన్నారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు మహేష్ తెలిపారు. బీజేపీ దేశంలో కాషాయ ఎజెండాను అమలు చేయాలని చూస్తుందని ఆయన ఆపాదించారు. అంబేత్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని చూస్తున్నదన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇందిరమ్మ పేరుపెడితే పథకాలకు కేంద్రం నిధులు విడుదలచేయమని అంటున్నాడని అన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ భరోసా కింద 12 వేల రూపాయలు, రైతు భరోసా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. సేవాదల్ చైర్మన్ జితేందర్ ఆధ్వర్యంలో ర్యాలీగాంధీ భవన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ర్యాలీలో వందలాది సేవాదల్ కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**డిజిపి కార్యాలయంలో..**

డిజిపి కార్యాలయంలో ఆర్గనైజేషన్స్ విభాగం అదనపు డిజి స్వాతిలక్రా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఐజి రమణ కుమార్‌తో పాటు, డిజిపి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు సహా పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. కాగా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో గల సిటీ పోలీసు కమిషరేట్‌లో జరిగిన మరో కార్యక్రమంలో పరిపాలనా విభాగం జాయింట్ పోలీసు కమిషనర్ పరిమళ హన్నా నూతన్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఈ వేడుకలకు హాజరైన బడి పిల్లలకు జాయింట్ సిపి మిఠాయిలు పంచిపెట్టి వారితో కొద్దిసేపు సరదాగా గడిపారు.


డిజిపి కార్యాలయంలో జరిగిన జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తరువాత శాల్యూట్ చేస్తున్న అదనపుడిజి స్వాతిలక్రా. చిత్రంలో ఐజి రమణకుమార్ తదితరులు

**జాతీయ పోలీసు అకాడమిలో ఘనంగా గణతంత్ర వేడుకలు**

ఇదిలా వుండగా నగర శివార్లలోని శివరాంపల్లిలో గల సర్దార్ వల్లభభాయి పటేల్ జాతీయ పోలీసు అకాడమిలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. అకాడమి డైరక్టర్ అమిత్ గార్గ్ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం అకాడమిలో యువ ఐపిఎస్ ట్రైనీల నేతృత్వంలో పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమంలో అకాడమికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

**పేదరికం, అకలి, అసమానతలులేని దేశాన్ని తీర్చిదిద్దాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య**

పేదరికం, నిరుద్యోగం, నిరక్ష రాస్యత లేని దేశంగా, అకలి, అజ్ఞానం, అసమానతలు, దోపిడీ, పీడన, వివక్ష, అణిచివేతలు లేని దేశంగా భారతదేశాన్ని అగ్రదేశంగా తీర్చిదిద్దాలని అందుకు విద్యార్థులు, యువత కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం బిసి భవన్, బాలుర హాస్టల్స్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడకల్లో ఆయన జాతీయ జెండాను ఎగవేసి ప్రసంగించారు. ఇతర దేశాలలో ఉన్న అభివృద్ధిని చూసి మన పాలకులు విధానాలు మార్చాలని, రాజకీయ సంస్కరణలు, ఎన్నికల సంస్కరణలు, పాలనాసంస్కరణలు తీసుకురావాలిసిన అవసరం ఉందని చెప్పారు.

## ఆకలిలో 100వ స్థానం, అసమానతల్లో 50వ స్థానం

### బిజెపి, ప్రధాని మోడీ సమాధానం చెప్పాలి

### గణతంత్ర దినోత్సవాల్లో సిపిఐ కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** దేశంలో రాజ్యాంగ నిర్మాతల ఆశలు, అకాంక్షలకు భిన్నంగా పాలన కొనసాగుతోందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలకుల విధానాల కారణంగా దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతికంగా అన్ని రంగాల్లో దిగజారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం ఎంతో అభివృద్ధి చెందిందని గొప్పలు చెబుతున్న పాలకులు ఆకలిలో 100వ స్థానం, మత సామర్యం, అసమానతల్లో 50 స్థానంలో ఉందని.. అన్నిరంగాల్లో ఎందుకు వెనబడి ఉన్నామో కేంద్ర పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో కూనంనేని సాంబశివరావు జాతీయ జెండాను ఎగుర వేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎస్.బాల్ రాజు పాల్గొన్నారు. దేశం ఆర్థిక అభివృద్ధిలో ప్రపంచంలోనే 5వ స్థానంలో ఉందని పాలకులు గొప్పలు చెప్పుతున్నారని, ఇది ఈ దేశంలోని 90 శాతం ప్రజల కష్ట ఫలితమన్నారు. ప్రజలు కష్టపడి తమ చెమట చుక్కలను సంపదగా సృష్టించి పన్నుల రూపంలో చెల్లిస్తే, చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు, బిజెపి పాలకులు సంపదను బడా కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రోడ్లపైకి వచ్చి ప్రశ్నించిన వారిని జైళ్లలో నిర్బంధిస్తుండగా, అడవుల్లో ఉండి ఉద్యమిస్తున్న మావోయిస్టులను అత్యంత కిరాతకంగా వేటాడి, వెంటాడి కాల్చి చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలో..**

దేశవ్యాప్తంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలో కూడా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తెలంగాణలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. త్వరలో ప్రారంభం కానున్న నూతన కార్యాలయ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జనసేన తెలంగాణ ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ జాతీయ జెండా ఎగురవేసి, వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారం రాజలింగం, పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి, రాము, వీర మహిళ చైర్మన్ మండపాక కావ్య, వైస్ చైర్మన్ నిహారిక నాయుడు, గ్రేటర్ నియోజకవర్గ ఇన్చార్జ్‌లు నాయకులు పాల్గొన్నారు.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విద్యుదుత్పత్తి

### రెండో యూనిట్ నుండి 811.9 మెగావాట్లు


**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. జిల్లాలోని దామరచర్ల మండలంలో ఏర్పాటు చేసిన ఈ యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ లక్ష్యాన్ని చేరుకున్నది. గత డిసెంబర్ 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండో యూనిట్‌ను ప్రారంభించారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మొదటగా రెండో యూనిట్ పని ప్రారంభించింది. దీని నిర్మాణానికి 30 వేల కోట్ల రూపాయలు ఖర్చయింది. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తిచేసుకొన్న రెండో యూనిట్ కొన్ని పరిస్థితుల కారణంగా వాయిదా పడింది. తాజాగా శనివారం రాత్రి రెండో యూనిట్ నుంచి 811.9 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.



## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా రాజీనామా చేయాలి

### పిసిసి సేవాదళ్ మిద్దెల జితేందర్ డిమాండ్

**హైదరాబాద్,జనవరి 26,ప్రభాతవార్త:** బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీభవన్ నుండి అసెంబ్లీ వరకు సమ్మిదాన్ బచావో పాదయాత్ర తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించింది. జితేందర్ అసెంబ్లీ వద్ద మాట్లాడుతూ 140 కోట్ల ప్రజలు దేవుడిగా కొలిచే అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అంబెద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను ప్రధాని నరేంద్ర మోడీ వెనకేసుకోనిరావడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చినటువంటి సేవాదళ్ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌ను గజమాలతో సన్మానిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

## గజ్వేల్ రూపురేఖలు మార్చిన కెసిఆర్

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**గజ్వేల్, జనవరి 26, ప్రభాతవార్త:** గజ్వేల్‌ను స్వర్ణయుగంలా నా భూతో నా భవిష్యత్ అన్నట్లుగా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చేశారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాలకవర్గ వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పదేళ్లకాలంలో మాజీ ముఖ్య మంత్రి చంద్రశేఖర్‌రావు గజ్వేల్ దశదిశ మార్చారన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పాలకవర్గ సభ్యులు అభివృద్ధిలో పాలు పంచుకోవడం వారి అదృష్టమన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిందని ఎవరూ నిరుత్సాహపడవద్దని, రానున్న రోజుల్లో బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ జకియొద్దీన్‌తోపాటు పాలకవర్గ సభ్యులను గజమాలతో సన్మానించి అభినందించారు.

## తెలంగాణ నుంచి జిఎస్‌టిగా రూ. 37వేల కోట్లు కేంద్రానికి ఇచ్చాం

### పథకాలకు ఎందుకు దీనదయాళ్ పేర్లు పెట్టారు?

### కెటిఆర్‌కు కాంగ్రెస్ సంక్షేమం జీర్ణం కావడం లేదు:

### గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



**హైదరాబాద్,జనవరి 26,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలు జిఎస్‌టి రూపంలో కేంద్రానికి 37వేల కోట్ల రూపాయలు వారి చమటచుక్కల నుంచి పన్నుల రూపంలో కట్టారని ఇందిరమ్మ పేరు పెడితే డబ్బులు ఇవ్వమనిని కేంద్రమంత్రి బండిసంజయ్ అంటున్నారు ఆయన ఇంట్లోనించి డబ్బులు ఇవ్వడంలేదని బిసి సంక్షేమం రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ఇందిరమ్మను అవహేళన చేస్తూ మాట్లాడితే ఊరుకునేదిలేదని తెలంగా ణకు ఎలా నిధులు కోసం ప్రాణత్యాగం చేశారా అని ఆయన ఎదురుప్రశ్న వేశారు. తెలంగాణ నుంచి ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఒక్క రూపాయి అదనంగా రాష్ట్రానికి తెచ్చారా అని పొన్నం ధ్వజంమెత్తారు.

కేంద్ర నిధులతో అమలయ్యే పథకాకలు ప్రధానమంత్రి ఫోటో వాడుకొంటే నేరుగా తామే లబ్దిదారులకు నిధులు ఇచ్చే ఆలోచన చేస్తామని బండి సంజయ్ ప్రకటించడం సమాఖ్యస్ఫూర్తికి భంగం కలిగించే చర్య అని ఆయన అన్నారు. కేటీఆర్ కు కాంగ్రెస్ సంక్షేమం జీర్ణం కావడం లేదు, అందుకే ఈనో ప్యాకెట్లు పంపిస్తా కెటిఆర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. దరఖాస్తులు తీసుకుంటుంటె ప్రజలను మభ్యపెట్టడమని అంటున్నారు. దరఖాస్తు స్వీకరణపై వ్యాఖ్యలు చేయడం కెటిఆర్ అసహనానికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. బిఆర్‌ఎస్ ఆర్థిక విధ్వసంసం తర్వాత కూడా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నాం అదీ గ్రేట్ అని ఆయన స్వోత్కర్షలు చెప్పుకున్నారు.

ఇవ్వరో అది కూడా చూస్తామని హెచ్చరించారు. పదినెలల కాలంలో రూ.37వేల కోట్లు వసూలు చేస్తే కేంద్రం తెలంగాణకు ఇచ్చింది ఎంత అని పొన్నం ప్రశ్నించారు. దీనదయాళ్ పేర్లు అనేక పథకాలకు నామకరణం చేశారని దీనదయాళ్ అంత్యోదయ, దీనదయాళ్ గృహజ్యోతి ఇలా పేర్లు పెట్టారని వీళ్ళు ఏమైనా దేశం

**సంజయ్ ఇందిరమ్మకు క్షమాపణ చెప్పాలి: పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

ఇందిరమ్మ పేరు పెడితే నిదులు ఇవ్వమని కేంద్రమంత్రి బండి సంజయ్ బెదిరించడం తగదని ఇందిరమ్మ చరిత్ర తెలుసుకోవాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పుజయప్రకాష్‌రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి హితవు చెప్పారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ రాజకీయాలు పక్కనపెడితే నువ్వునేనూ ఆమెకు మునిమనమలం అవుతామని ఇందిరకు ముందు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్‌చేశారు. తెలంగాణలో ఏదో పొరపాటుగా బిజెపికి ఎనిమిది సీట్లు వచ్చాయని తెలంగాణలో బిజెపికి బలం లేదని తెలుసుకొని ఉనికి కోసం బండి సంజయ్ రాజకీయ ప్రకటనలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## ఎస్‌బిఐలో గణతంత్ర వేడుకలు

**హైదరాబాద్,జనవరి 26,ప్రభాతవార్త:** ఎస్‌బిఐ హైదరాబాద్ స్థానిక ప్రధాన కార్యాలయంలో రిపబ్లిక్ డే నిర్వహించారు. హైదరాబాద్ సిజిఎం రాజేష్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. దీన్ని పురస్కరించుకుని మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగం ఆర్థిక వృద్ధికి ఇంజిన్ మాత్రమే కాదు, సామాజిక పురోగతికి మూలస్తంభం అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా, బ్యాం కింగ్ జీవితాలను ప్రభావితం చేయడంలో అద్భుతమైన మార్పులను చూశామని చెప్పారు. గ్రామ స్థాయిలో సాధారణ ప్రజలు, రైతులకు మద్దతు ఇవ్వడం నుండి చిన్న వ్యాపారాల కలలను సాకారం చేయడం, ఆర్థిక



అక్షరాస్యత కార్యక్రమాల ద్వారా మహిళలను సాధికారపరచడం వరకూ పురోగతి సాధించామని తెలిపారు. ఖాతాదారుల అవసరాలే. ప్రపంచంలోని సవాళ్లకు అనుగుణంగా మారడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. డిజిటల్ విప్లవం బ్యాంకింగ్‌ను మార్చివేసిందన్నారు. డిజిటల్ ఆవిష్కరణల ద్వారా, ప్రతి పౌరుడికి సజావుగా, సురక్షి తమైన బ్యాంకింగ్ అనుభవాలను అంది స్తూనే ఉన్నామని చెప్పారు. సేవ, పారదర్శకత, నీతి, మర్యాద, స్థిరత్వం ద్వారా పారదర్శకత, నమ్మకం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన వెల్లడిం చారు. స్వర్ణ భారత్ లక్ష్యానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. గ్రీన్ ఫైనాన్స్‌ను ప్రోత్సహించడం, ఆర్థిక అక్షరాస్యతను ముందుకు తీసుకెళ్లడం ద్వారా దేశం యొక్క సమగ్ర మరియు స్థిరమైన వృద్ధి దృష్టితో సమలేఖనం చేయాలనే లక్ష్యంగా కలిగి ఉన్నామని వివరించారు. సైబర్ మోసాల నుండి కస్టమర్లను, వారి డబ్బును కాపాడుకుంటున్నామని తెలిపారు.

**హైకోర్టులో 76వ గణతంత్ర దినోత్సవాలు**

**హైదరాబాద్ (చార్మినార్), జనవరి 26, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ఆధివారం ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడ్వకేట్ జనరల్



సుదర్శన్ రెడ్డి, హైకోర్టు బార్ అసోసి యేషన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డితో పాటు పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. హైకోర్టులో జరిగిన

## ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థ విధ్వంసం

### బ్యాంక్ యూనియన్ల పోరాటాలకు అండగా సిపిఐ

### పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



ఎపిటిబిఇఎఫ్ త్రైవార్షిక మహాసభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, చిత్రంలో ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం, బిఎస్ రాంబాబు తదితరులు

**హైదరాబాద్, జనవరి 26,ప్రభాతవార్త:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థ ను విధ్వంసం చేసే పాలకుల కుట్రలను బ్యాంకుల ఉద్యోగులు సమర్థవంతంగా ఎదుర్కోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కాచిగూడలోని పొట్లూరి నాగేశ్వరరావు సభా ప్రాంగణం (మ్యాడం అంజయ్య హాల్)లో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎపిటిబిఇఎఫ్) 30వ త్రైవార్షిక మహాసభల ముగింపు సభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు ప్రసంగించారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థను విధ్వంసం చేసేందుకు పాలకులు చేస్తున్న కుట్రలను బ్యాంకుల ఉ ద్యోగులు సమర్థవంతంగా ఎదుర్కోవాలని, ఇందు కోసం బ్యాంక్ యూనియన్లు చేసే పోరాటాలకు సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు, గుత్తె దారులకు ఊడిగం చేస్తూ పెట్టుబడిదారి అనుకూల విధానాలతో చట్టాలను చేస్తున్నదని, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తున్నదని ఆయన విమర్శించారు. ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా ఆర్థిక రంగంలో సైనికులైన బ్యాంకింగ్ ఉద్యోగులు కార్యాచరణతో ఉద్యమించాలన్నారు. కుల, మతాలను రెచ్చగొట్టి బిజెపి అధికారంలోకి వచ్చిందని, కుల, మతాల పేరుతో కాకుండా, ఎన్నికల్లో ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ప్రజా సంక్షేమమే ఎజెండాగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు రావాలని బిజెపిని ఆయన సవాల్ చేశారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు ఆమోదించి, ఎపిటిబిఇఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మంద కృష్ణమాదిగను సన్మానిస్తున్న దృశ్యం

## వర్గీకరణకు అడ్డుపడుతున్న మాల సామాజిక వర్గం

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ వర్గీకరణకు వ్యతి రేకమని, మాల సామాజిక వర్గం పార్టీలో అత్యధికంగా ఉండటం వల్ల వారు అడ్డు పడుతున్నారని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని, కాని మాలలు అడ్డుపడుతున్నా రని అందువల్లనే వర్గీకరణ జరగడం లేదని విమర్శించారు. ఫిబ్రవరి 7న కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 'లక్ష డప్పులు-వేలగొంతుకలు' కార్యమ్రానికి తెలంగాణ ఎరుకల ఆదివాసీ సంఘం ఆదివారం మద్దతుగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఆర్‌పిఎస్ ప్రజాస్వామిక ఉద్యమమని, దాన్ని గుర్తించి ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి తనకు పద్మశ్రీ అవార్డును ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా వంశతిలక్, బిజెపి నాయకులు గంజీ వంశీ, మందుల శ్రావణ్, రాము, బాబు, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గుండేటి శంకర్, ఎరుకల సంఘం నేత లోకిని రాజు తదితరులు కృష్ణమాదిగను ఘనంగా సత్కరించారు.

## యూనిఫైడ్ పెన్షన్ నోటిఫికేషన్‌ను నిరసిస్తూ 28న దేశవ్యాప్తంగా నిరసనలు

### ఎన్‌ఓపిఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ) జనవరి 26, ప్రభాతవార్త:** యూనిఫైడ్ పెన్షన్ నోటిఫికేషన్‌ని నిరసిస్తూ ఈనెల 28న దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఎన్‌ఎంఓపిఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ పిలుపు నిచ్చారు. ఆదివారం కేరళలో ఉద్యోగ ఉపాధ్యాయుల మహా ర్యాలీ జరిగింది. అనంతరం భారీ బహిరంగ సభలో స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన యూనిఫైడ్ పెన్షన్ విధానం నోటిఫికేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 28న ఉద్యోగ ఉపాధ్యాయ కార్యాలయాల్లో యుపిఎస్ ప్రతుల దగ్ధం చేయాలని, దేశ వ్యాప్తంగా నిరసనలు వివిధ రూపాల్లో తెలియజేయాలని పిలుపునిచ్చారు. కేరళలో మొదలైన నిరసనలు, ఫిబ్రవరి 7న కర్ణాటక బెంగళూరు కేంద్రంగా ఫ్రీడం పార్కు నందు యుపిఎస్ వద్దని ధర్నా చేపడుతున్నామని, మార్చి 2న తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నందు చలో ధర్నా చౌక్ పేరిట నిరసన కార్యక్రమాలుకు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరై నిరసనలు తెలపాలన్నారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ ఇప్పటికే రెండు దశాబ్దాలుగా సిపిఎస్ ఉద్యోగులని గందరగోళపరిచిందని, ఇప్పుడు కేంద్రం యూపీఎస్‌ను తెరపైకి తెచ్చి ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కంట్రిబ్యూషన్ లేకుండా ప్రభుత్వమే పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఓపిఎస్ అనేది ఉద్యోగుల నుండి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పదవీవిరమణ తర్వాత కచ్చితమైన పెన్షన్, పిఎఫ్, గ్రాట్యుటీ కల్పించే ట్రిపుల్ బెనిఫిట్‌స్కీం అని, సిపిఎస్, యుపిఎస్‌లో ఉద్యోగి సర్వీస్‌లో ఉన్నన్ని రోజులు కాంట్రి బ్యూషన్లను ఇస్తే, దాన్ని మొత్తం షేర్ మార్కెట్లో పెట్టి, పెన్షన్ నిర్ణయిస్తారు. ఈ యూపిఎస్ విధా నంలో



కేరళలో జరిగిన క్విట్ ఎంపిఎస్ మహార్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్‌ఓపిఎస్ సెక్రటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ

అదనంగా చేర్చిన టువంటి 8.5 ప్రభుత్వ వాటా మరింతగా పెట్టుబడులను షేర్ మార్కెట్లో పెట్టుబడులను ప్రోత్సహించడమైంది గాని ఉద్యోగి కుటుంబం బాగును దృష్టిలో పెట్టుకోలేదని అన్నారు. రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన సిపీఎస్ అత్యంత లోపం నిష్ప్ర యోజనకరమైనదని కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించింది. నూతన పెన్షన్ విధానంపై వేసిన టీవీ సోమనాథన్ కమిటీ సిపీఎస్‌లో రిటైర్మెంట్ అయిన, సర్వీస్‌లో చనిపోయిన ఉద్యోగి కుటుంబ సభ్యుల వాస్తవ పరిస్థితులను తెలుసుకొని రిపోర్టు ఇచ్చాడా లేదా అని, ఆర్టిఐ ద్వారా కమిటీ రిపోర్ట్‌ను అడిగితే, బహిర్గత పరచలేమనే సమాధానం కేంద్ర ఆర్థిక శాఖ నుంచి వచ్చిందని తెలిపారు.

ఈ సభలో కేరళ సిపిఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ రఫీక్, ప్రధాన కార్యదర్శి షాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్‌లో.. స్మృతి, దీప్తికి చోటు



**ఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్-2024 జట్టులో ఇద్దరు భారత ప్లేయర్లకు చోటు దక్కింది. గతేడాది అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన, స్పిన్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ ఈ టీమ్‌లో స్థానం సంపాదించించారు. కాగా స్మృతి 2024లో 13 వన్డేలు ఆడి 747 పరుగులు చేసింది. తద్వారా అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా నిలిచింది. ఇక 2024లో 13 వన్డే లాడిన దీప్తి శర్మ 186 పరుగులు చేయడంతో పాటు, 24 వికెట్లు పడగొట్టి ఈ జట్టులో చోటు దక్కించుకుంది. ఈ జట్టుకు దక్షిణాఫ్రికా స్టార్ లౌరా వాల్వర్ట్ సారథిగా ఎంపికైంది. మరోవైపు ఇంగ్లండ్ నుంచి అమీ జోన్స్, సోఫీ ఎకెల్‌స్టోన్, కేట్ క్రాస్ రూపంలో ముగ్గురు ప్లేయర్లు, ఆస్ట్రేలియా నుంచి ఆష్లే గార్డనర్, అనాబెల్ సథర్లాండ్ చోటు దక్కించుకున్నారు. సఫారీ ప్లేయర్ మరీనే కాప్‌తో పాటు, శ్రీలంక నుంచి చమరి ఆటపట్టు, వెస్టిండీస్ ప్లేయర్ హేలీ మాథ్యూస్ కూడా ఈ టీముకు ఎంపికయ్యారు. దీంతో ఐసీసీ మహిళల వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్-2024లో స్మృతి మంధాన, లారా వాల్వర్ట్ (కెప్టెన్), చమరి ఆటపట్టు, హేలీ మాథ్యూస్, మరీనే కాప్, ఆష్లే గార్డనర్, అనాబెల్ సథర్లాండ్, అమీ జోన్స్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, సోఫీ ఎక్లిస్టోన్, కేట్ క్రాస్ ఉన్నారు.

## ఛాంపియన్‌గా అమెరికా అమ్మాయి

### వరల్డ్ నంబర్ 1 సబలెంకపై గెలుపు



**ఢిల్లీ:**ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నమెంట్-2025 ఛాంపియన్‌గా మాడిసన్ కీస్ అవతరించింది. బెలారస్ టెన్నిస్ స్టార్ ప్రపంచ నెంబర్ 1 సబలెంకకు షాక్ తగిలింది. మెల్‌బోర్న్‌లో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్ పోరులో చివరకు ఆమె ఓడింది. టైటిల్ పోరులో సబలెంకను ఢీ కొట్టిన అమెరికా అమ్మాయి కీస్ ఛాంపియన్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో 6-3, 2-6, 7-5 తేడాతో సబలెంకను కీస్ మట్టికరిపించి తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించింది. పదేళ్ల క్రితం 19 ఏళ్ల ప్రాయంలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే మాడిసన్ కీస్ తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీ ఫైనల్‌కు చేరుకొని వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు పదేళ్ల తర్వాత అదే ఆస్ట్రేలియన్ ఓపెన్ లో ఆమె తన గ్రాండ్‌స్లామ్ టైటిల్ కలను నెరవేర్చుకుంది. 19వ సీడ్‌గా ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్లో బరిలోకి దిగిన ప్రపంచ 14వ ర్యాంకర్ మాడిసన్ కీస్ అందరి అంచనాలను తారుమారు చేసి చివరకు తొలి సారి చాంపియన్ సాధించింది. గత రెండేళ్ల ఈ టోర్నీలో విజేతగా నిలిచి, ఆస్ట్రేలియన్ ఓపెన్ సన్నాహకంగా జరిగిన బ్రిస్బేన్ ఓపెన్ టోర్నీలో టైటిల్ నెగ్గి జోరు మీదున్న బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ సబలెంకాను ఓడించిన కీస్ కెరీర్లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకుంది. విజేతగా నిలిచిన మాడిసన్ కీసుకు 35 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (భారత్ కరెన్సీలో 19 కోట్ల 3 లక్షల రూపాయలు), రన్నరప్ సబలెంకాకు 19 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు ( 10 కోట్ల 33 లక్షల పాయల) ప్రైజ్ మనీగా లభించాయి. టైటిల్ గెలిచేక్రమంలో కీస్ ముగ్గురు గ్రాం డ్స్లామ్ చాంపియన్లు (రిబా కినా, స్వియాటెక్, సబలెంకా) ఓడించడం విశేషం.

## ఐ లీగ్‌లో ఒడిదుడుకుల్లో శ్రీనిధి

**ఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ఐ లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ ఒడిదొడుకుల పయనం కొనసాగుతున్నది. బెంగుళూరులో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి ఎఫ్‌సీ 01తో స్పోర్టింగ్ క్లబ్ బెంగళూరు చేతిలో ఓటమిపాలైంది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు తరఫున అసిఫ్ (34ని) ఏకైక గోల్ చేశాడు.

ఈ మ్యాచ్ కోసం శ్రీనిధి ఎఫ్‌సీ 3 మార్పులు చేసినా లాభం లేకపోయింది. లీగ్‌లో ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లాడిన శ్రీనిధి జట్టు 11 పాయింట్లతో 9వ స్థానంలో కొనసాగుతున్నది.

## తెలంగాణ స్కేటర్ ప్రణవ్‌కు స్వర్ణం

### ఖేల్ ఇండియా వింటర్ గేమ్స్:



**ఢిల్లీ:** జమ్ము కశ్మీర్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో తెలంగాణ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. లడఖ్‌లో జరిగిన పురుషుల 500 మీటర్ల ఐస్ స్కేటింగ్‌లో తెలంగాణ యువ స్కేటర్ సూరపనేని ప్రణవ్ మాధవ్ పసిడి పతకంతో మెరిశాడు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో ప్రణవ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. రేసును 56.86 సెకన్లలో ముగించిన అతడు అగ్రస్థానంలో నిలువగా, సమ్రుద్ (1:00:31సె, కర్నాటక), సుమిత్ తప్కిర్ (1:00:58సె, మహారాష్ట్ర) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. టోర్నీలో ప్రస్తుతం రెండు స్వర్ణాలు దక్కించుకున్న తెలంగాణ టాప్‌లో కొనసాగుతున్నది. మరోవైపు పురుషుల ఐస్ హాకీలో ఉత్తరాఖండ్ 60తో హిమాచల్‌ప్రదేశ్‌పై విజయాలు సాధించాయి.

## మహిళల అండర్ 19 వరల్డ్ కప్: సూపర్ సిక్స్‌లో భారత్ మరో విజయం

### 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి

**ఢిల్లీ:** మహిళల అండర్-19, టీ20 వరల్డ్ కప్-2025లో భారత్ మరో విజయం సాధించింది. గ్రూప్ దశ మ్యాచ్‌లో అజేయంగా నిలిచిన టీమిండియా, సూపర్6లో రెండోవిజయం ఖాతాలో వేసుకుంది. బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 64 పరుగులు మాత్రమే చేసింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో కేవలం ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. కెప్టెన్ సుమయ్యా అక్తెర్ 21 పరుగులతో నాటౌట్, జన్నతుల్ మోకా 14 పరుగులు చేశారు. భారత బౌలర్లందరూ చాలా పొదుపుగా బౌల్ చేశారు. వైష్ణవీ శర్మ 3, షబ్నమ్ షకీల్, విజే జోషిత్, గొంగడి త్రిష తలో వికెట్ పడగొట్టారు. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ 7.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింది. ఓపెనర్ గొంగడి త్రిష (31 బంతుల్లో 40 పరుగులు, 8 సిక్సర్లు) మరోసారి మెరుపు ఇన్నింగ్స్ ఆడి భారత్ గెలుపునకు గట్టి పునాది వేసింది. జి కమలిని 3 పరుగులు, సనికా ఛల్కే 11 పరుగులు (నాటౌట్), కెప్టెన్ నికీ ప్రసాద్ 5 (నాటౌట్) పరుగులు చేశారు. ఇక బంగ్లాదేశ్ బౌలర్లలో అనిస అక్తెర్ శోభా, హబిబా ఇస్లాం పింకీ తలో వికెట్ పడగొట్టారు. సూపర్ సిక్స్‌లో భారత్ తదుపరి స్కాట్లాండ్‌తో ఈ నెల 28న ఆడనుంది. కాగా సూపర్ సిక్స్‌లో భారత్ గ్రూప్ 1లో ఉంది. ఈ గ్రూప్‌లో భారత్ రెండు మ్యాచ్‌లు ఆడి రెండిటిలోనూ విజయాలు సాధించింది. గ్రూప్ 1లో భారత్‌తో పాటు, ఆస్ట్రేలియా, శ్రీలంక, బంగ్లాదేశ్, స్కాట్లాండ్, వెస్టిండీస్ జట్లు ఉన్నాయి. ఈ గ్రూప్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఇక గ్రూప్2లో సౌతాఫ్రికా, ఇంగ్లండ్, నైజీరియా, యూఎస్ఏ, న్యూజిలాండ్, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. ఈ గ్రూప్‌లో సౌతాఫ్రికా టాపర్‌గా కొనసాగుతుంది. ఇదిలా ఉంటే, గ్రూప్1లో భాగంగా ఆదివారం నాడు జరగాల్సిన మరో మ్యాచ్ (శ్రీలంక, స్కాట్లాండ్) వర్షం కారణంగా రద్దైంది.





## భారత్ రెజ్లర్లకు షాక్!

### ఇలా అయితే మళ్లీ సస్పెన్షన్ వేటు..

### యుడబ్ల్యుడబ్ల్యు వార్నింగ్

**ఢిల్లీ:** రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ)కు వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) సమాఖ్య పాలక మండలి వార్నింగ్ ఇచ్చింది. సమాఖ్య వ్యవహారాల్లో రాజకీయ జోక్యాన్ని త్వరగా ముగించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. లేదంటే మళ్లీ సస్పెన్షన్ వేటు విధించాల్సి వస్తుందని పేర్కొంది. డబ్ల్యూఎఫ్ఐ స్వయం ప్రతిపత్తితో పని చేయాలని వెల్లడించింది. ఈ మేరకు యూడబ్ల్యూడబ్ల్యూ ప్రెసిడెంట్ నేనాద్ లాలోవిక్, డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్‌కు ఒక లేఖ రాశారు. "భారత రెజ్లింగ్ అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిథ్యం వహించే విషయమై మాకు సరైన విధానం కావాలి. జాతీయ సమాఖ్యల కోసం పబ్లిక్ గ్రాంట్స్ ను వినియోగించే విషయమై మినహా, సమాఖ్య వ్యవహారాల్లోని అంతర్గత విషయాల్లో పబ్లిక్ లేదా పొలిటికల్ అథారిటీస్ జోక్యాన్ని యూడబ్ల్యూడబ్ల్యూ అంగీకరించదు. యూడబ్ల్యూడబ్ల్యూ రాజ్యాంగంలోని 6.3 ఆర్టికల్ స్వయంప్రతిపత్తి వ్యవస్థ, స్వేచ్ఛను ఇచ్చింది. అది కచ్చితంగా ఫెడరేషన్స్ లోని ప్రతిఒక్కరూ పాటించాలి. కాబట్టి పూర్తి స్వయం ప్రతిపత్తితో పనిచేయలేకపోతే, గతంలో విధించిన సస్పెన్షన్‌ను మళ్లీ విధించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది." అని లాలోవిక్ లేఖలో పేర్కొన్నారు. ఒకవేళ యూడబ్ల్యూడబ్ల్యూ రాజకీయ జోక్యం కారణంగా డబ్ల్యూఎఫ్ఐని సస్పెండ్ చేస్తే భారత రెజ్లర్లు భవిష్యత్ లో అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనే అర్హతను కోల్పోతారు. "ఇప్పటికే నేషనల్ క్యాంప్స్‌ను సస్పెన్షన్ కారణంగా హోల్డ్‌లో ఉంచారు. కాబట్టి మంత్రిత్వ ఖాఖ ఈ సస్పెన్షన్ సమస్యకు ముగింపు పలకపోతే, డబ్ల్యూఎఫ్ఐపై వేటు పడుతుంది. దీని వల్ల క్రీడా వ్యవస్థకు, దేశంలోని రెజ్లర్లకు భారీ నష్టం కలుగుతుంది." అని డబ్లుఎఫ్ఐకి చెందిన ఓ ప్రతినిధి అన్నారు. కాగా 2023 ఆగస్టులో భారత రెజ్లింగ్ సమాఖ్య సభ్యత్వాన్ని వరల్డ్ రెజ్లింగ్ నిరవధికంగా సస్పెండ్ చేసింది. అప్పటి డబ్ల్యూఐ చీఫ్ బ్రిజ్ భూషణ్‌పై మహిళా రెజ్లర్లు అత్యాచార ఆరోపణలతో పాటు, ఆందోళన బాట పట్టడంతో నిర్ణీత గడువులోపు ఎన్నికలు నిర్వహించలేకపోయారు.

ఈ వ్యవహారం రాజకీయంగానూ పెద్ద ఎత్తున దుమారం రేపింది. ఈ విషయంలో కేంద్ర క్రీడా శాఖ కూడా జోక్యం చేసుకుంది. దీంతో భారత రెజ్లింగ్ సమాఖ్యను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత గతేడాది ఈ సస్పెండ్‌ను యుడబ్ల్యూడబ్ల్యూ ఎత్తివేసింది. కానీ సమాఖ్య వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఇంకా కొనసాగుతోందని, తొందరగా దీనికి ముగింపు పలకాలని, లేదంటే సస్పెన్షన్ వేటు తప్పదంటూ యుడబ్ల్యూడబ్ల్యూ తాజాగా మరోసారి హెచ్చరించింది.

## రియల్ ఎస్టేట్‌లో మహిళలే ఎక్కువ!

**ముంబై, జనవరి 26:** భారత దేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం లాభాలబాటలో పయనిస్తుంది. అయితే ఈ రంగంలో రాణించాలంటే చదువు కంటే ఎక్కువగా తెలివితేటలు ఉండాలి. రియల్ ఎస్టేట్ అనగానే ముఖ్యంగా పురుషులే ఈ వ్యాపారానికి అర్హులు అనుకుంటుంటారు. కానీ భారతదేశంలో రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేసే ఆడవాళ్ల సంఖ్య ఎంతో తెలిస్తే మీరు షాక్ అవుతుంది. భారతదేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అయితే ఈ రంగంలో మహిళలు



ఎక్కువ చొరవ తీసుకోవాల్సిన రంగంగా నిలుస్తోంది. భారత రియల్ ఎస్టేట్ రంగంలో పనిచే 7.1కోట్ల కార్మికుల్లో కేవలం 70లక్షల మంది మహిళలు మాత్రమేఉన్నారని తాజాగా ఓరిపోర్టు వెల్లడించింది. మ్యాక్స్ ఎస్టేట్స్, ఇన్ టాండమ్ గ్లోబల్ కన్సల్టింగ్ కాంక్రీట్ చేంజ్ మెరుగైన వేతన సమానత్వం, మహిళల సమానతను రియల్‌ఎస్టేట్‌లో చేర్చడం అనే రిపోర్టును రిలీజ్ చేసింది. ఈ నివేదికలో రియల్ ఎస్టేట్ రంగం ఇంకా సమానత్వాన్ని సాధించడంలో చాలా దూరం ఉందని సూచించింది. అయితే ఈ నివేదిక తెలిపిన వివరాల ప్రకారం భారతదేశ జనాభాలో మహిళలు 48.5 శాతం ఉండగా, అందులో సుమారు 1.2శాతం మాత్రమే రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. మహిళల తక్కువ ప్రాతినిథ్యం అన్ని స్థాయిల్లో సమానమైన వేతనాలు లేని సమస్య రియల్ ఎస్టేట్ రంగంలో ఎదురయ్యే అత్యంత పెద్దసవాళ్లలో ఒకటిగా పేర్కొంది. ఒక పెద్దఉద్యోగ అవకాశాన్ని కల్పించే రంగం అయినప్పటికీ, మహిళల కోసం అత్యంత సరిహద్దులు ఉన్న రంగంగా రియల్ ఎస్టేట్ అంగీకరించింది. లింగ వివక్షతను పరిష్కరించడం వల్ల పెద్ద ఆర్థిక ప్రయోజనాలను పొందవచ్చని తెలిపింది. ఇది ప్రొడెక్టివిటీని, ఆవిష్కరణను లాభాదాయకతను పెంచుతుందని నివేదిక పేర్కొంది. ఇక రియల్ ఎస్టేట్ రంగం కీలకమైన సవాళ్లను కూడా ఎదుర్కొంటుంది. ప్రత్యేకంగా లింగ వివక్షత సంబంధిత సమస్యలతో పాటు ఈ రంగంలో సుమారు 71 మిలియన్ కార్మికులు పని చేస్తున్నప్పటికీ వాటిలో కేవలం 7మిలియన్ మాత్రమేఉన్నారు. దీనివల్ల మహిళా శ్రమ వ్యవస్థలో పాల్గొనే రేటు 25.1 శాతం మాత్రమే ఉన్నట్లు రిపోర్టులో వెల్లడించింది. మహిళల కోసం ప్రత్యేకమైన స్కిల్స్ అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాల్సిన అవసరంఉందని రిపోర్టు సూచించింది. అలాగే సాంకేతికతలో సమగ్రత, నాయకత్వపాత్రలపై మహిళలకు అవకాశాలు కల్పించడం ఈమార్పు సాధించడంలో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొంది.

## కాఫీ ఎగుమతులు హైజంప్

**న్యూఢిల్లీ, జనవరి 26:** వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, భారతదేశం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఏడో అతి పెద్ద కాఫీ ఉత్పత్తిదారుగా ఉంది. దీని ఎగుమతులు 2024 ఆర్థిక సంవత్సరంలో 1.29 బిలియన్‌డాలర్లకు చేరుకున్నాయి. 2020-21లో జరిగిన 719.42 మిలియన్ల డాలర్లతో పోల్చితే ఇవి దాదాపు రెట్టింపు అయ్యాయి. మన కాఫీఉత్పత్తిలో దాదాపు మూడు వంతులు అరబికా, రోబస్టాబీన్స్ ఉంటున్నాయి. ఇవి కాల్చని బీన్స్‌గా ఎగుమతి అవుతాయి. అయితే కాల్చిన, తక్షణ కాఫీ తదితర విలువ ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. మన దేశంలో కాఫీ వినియోగం క్రమంగా పెరుగుతోంది. 2012 లో 84 వేల టన్నులు ఉండగా, అది 2023 నాటికి 91 వేల టన్నులకు చేరింది. అలాగే కాఫీని ఉత్పత్తి చేసేరాష్ట్రాల్లో కర్ణాటక ముందంజలో నిలిచింది. అక్కడ 2022-23లో 248.020 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి జరిగింది. ఆ తర్వాతి స్థానాల్లో కేరళ, తమిళనాడు నిలిచాయి. ఇంటిగ్రేటెడ్ కాఫీడెవలప్మెంట్ ప్రాజెక్టు (ఐసీడీపీ) ద్వారా కాఫీ సాగు విస్తరణకు, దిగుబడి పెంచడానికి, రైతులకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సాంప్రదాయేతర ప్రాంతాలలో సాగును విస్తరించడం, సాగును ప్రోత్సహించడం వంటి విషయాల్లో చాలా కీలకంగా వ్యవహరిస్తోంది. అరకు లోయలో పెరిగిన కాఫీ ఉత్పత్తి దీని ప్రధాన విజయంగా చెప్పుకోవచ్చు. అక్కడ కాఫీ బోర్డు, ఇంటిగ్రేటెట్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఐటీడీఏ) సహకారంతో 1.50 లక్షల గిరిజన కుటుంబాలు కాఫీఉత్పత్తిని 20శాతం పెంచాయి. అంతర్జాతీయంగా కాఫీ ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వివిధ రకాల చర్యలు తీసుకుంటోంది. అమెరికా, కెనడా, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఫిన్ లాండ్ తదితర దేశాలపై వ్యాపారానికి వీలుగా కొన్ని రాయితీలు కల్పిస్తోంది. మన రాష్ట్రంలో అరకు కాఫీకి ఎంతో ప్రత్యేకత ఉంది. అరకు లోయలోనే గిరిజ నులు దీన్ని సాగు చేస్తారు. 2018లో పారిస్ లో జరిగిన పోటీలో అరకు కాఫీకి బంగారు పతకం దక్కింది. దీనికి ఇంటర్నేషనల్ బ్రాండ్‌గా గుర్తింపు వచ్చింది. అరకు కాఫీని రుచి చాలా అద్భుతంగా ఉంటుంది.



## వాణిజ్యం

## గోల్డ్ లోన్‌లో మెలకువలు

**న్యూఢిల్లీ, జనవరి 26:** బంగారం నగలు మాత్రమే కాదు, ఎంతో ఉపయోగపడే ఆస్తి కూడా. కష్ట సమయాల్లో డబ్బు అవసరమైనప్పుడు బంగారాన్ని పెట్టుబడిగా ఉపయోగించవచ్చు. సాధారణంగా గోల్డ్ లోన్ అని పిలువబడే బంగారం పెట్టుబడి చాలా మందికి ఆర్థిక అవసరాలను తీరుస్తుంటుంది. గోల్డ్ లోన్ ద్వారా ఎవరైనా వారి బంగారాన్ని తాకట్టు పెట్టి డబ్బు ఏర్పాటు చేసుకోవచ్చు. మీరు కూడా కొన్ని కారణాల వల్ల గోల్డ్ లోన్ తీసుకోవాలనుకుంటున్నట్లయితే ముందుగా కొన్ని విషయాలు తెలుసుకోవాలి. ఆత్రుతతో లేదా తొందరలో గోల్డ్ లోన్ తీసుకోవడం వల్ల మీకు ఇబ్బందులు ఎదురవవచ్చు. గోల్డ్ లోన్ తీసుకునేటప్పుడు ఎలాంటి విషయాలు గుర్తుంచుకోవాలో తెలుసా.. గోల్డ్ లోన్ తీసుకునే ముందు మీ అవసరాలను ఒకసారి పరిగణించండి. కష్ట సమయాల్లో మాత్రమే గోల్డ్ లోన్ తీసుకోండి. బట్టలు, కారు లేదా ప్రయాణం వంటి మీ చిన్న చిన్న అవసరాల కోసం గోల్డ్ లోన్ తీసుకోకండి. అంతే కాకుండా, మీరు డబ్బు చెల్లించిన తర్వాత మీ బంగారాన్ని తిరిగి సొంతం చేసుకునేటట్టు చూసుకోండి. వడ్డీకి సంబంధించి ప్రతినెల లేదా 3 నెలల లేదా ఏడాదికి ఎంత కట్టాలో తెలుకోవడం మంచిది. ప్రభుత్వ బ్యాంకులు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌లు, ప్రయివేట్ బ్యాంకులు అందించే గోల్డ్ లోన్‌లపై వివిధ ప్రదేశాలలో బంగారు రుణాల వడ్డీ రేట్లు తెలుసుకోండి. బంగారు రుణాలు సాధారణంగా బ్యాంకులలో తక్కువ వడ్డీ రేట్లకు లభిస్తాయి. ఎన్‌బిఎఫ్‌సిలో ఎక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇస్తుంటారు. ఇలాంటి పరిస్థితిలో రుణం తీసుకునే ముందు అన్ని ప్రదేశాల నుండి వడ్డీరేట్లను చెక్ చేయండి. ఇంకా బ్యాంక్ లేదా ఎన్‌బిఎఫ్‌సిలో ఏది బెస్ట్ అని తెలివిగా సలెక్ట్ చేసుకోండి. గోల్డ్ లోన్ తీసుకునే ముందు మీరు లోన్ తిరిగి చెల్లించలేకపోతే మీ బంగారాన్ని బ్యాంక్ అధికారులు ఏం చేస్తారో తెలుసు కోండి. సాధారణంగా



గోల్డ్ లోన్ రీపేమెంట్ వ్యవధి 3 నెలల నుండి 3 సంవత్సరాల వరకు ఉంటుంది. అందుకే బంగారంని వృధాగా పెట్టుబడి పెట్టడం కాకుండా మీరు మీ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా లోన్ రీపేమెంట్ సెలెక్ట్ చేసుకోవచ్చు. అయితే సాధారణంగా కొన్ని బ్యాంకులు మీరు తీసుకున్న గోల్డ్ లోన్ తిరిగి టైంకి చెల్లించకపోతే బ్యాంకులు మీకు లోన్ రికవరీకి ముందస్తు నోటీసులు జారీ చేయవచ్చు ఒకవేళ గోల్డ్ లోన్ పూర్తిగా చెల్లించకపోతే, ఈ తాకట్టు పెట్టిన బంగారంని వేలం వేసి డబ్బు రికవరీ చేసేందుకు చర్యలు తీసుకోవచ్చు.

## ఫండ్స్‌లో రకాలెన్నో:

**ముంబై, జనవరి 26:** స్టాక్ మార్కెట్‌లో నేరుగా పెట్టుబడి పెట్టడానికి అనుభవం లేనివారు వీటిలో డబ్బులను ఇన్వెస్ట్ చేయవచ్చు. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ అనే మూడు రకాల మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు. వీటి మధ్య తేడాలు, ఇతర అంశాలను తెలుసుకుందాం. సాధారణంగా ఒక కంపెనీ విలువను స్టాక్ మార్కెట్ నిర్ణయిస్తుంది. దాని ఆధారంగా స్టాక్ మార్కెట్‌లో లిస్టు చేసిన కంపెనీలను లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ లుగా నిర్ణయిస్తారు. **లార్జ్ క్యాప్ ఫండ్స్** మార్కెట్ విలువ ఆధారంగా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసిన టాప్ 100 కంపెనీలను లార్జ్ క్యాప్ కంపెనీలుగా నిర్ణయిస్తారు. వీటిలోని స్టాక్‌లను కొనుగోలు చేసే మ్యూచువల్ ఫండ్స్‌ను లార్జ్ క్యాప్ ఫండ్స్ అని పిలుస్తారు. బ్లూచిప్ స్టాక్స్ అని పిలిచే ఈ ఫండ్స్ మంచి ట్రాక్ రికార్డు కలిగి ఉంటాయి వీటి మార్కెట్ విలువ సుమారు రూ.20 వేల కోట్లకు పైగా ఉంటుంది. **మిడ్ క్యాప్ ఫండ్స్** మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుని టాప్ 100 నుంచి 250 కంపెనీలను మిడ్ క్యాప్ కంపెనీలు అంటారు. వీటిలో పెట్టుబడి పెట్టే మ్యూచువల్ ఫండ్స్‌ను మిడ్ క్యాప్ ఫండ్స్ అంటారు. అయితే లార్జ్ క్యాప్ కన్నా వీటిలో పెట్టుబడులకు కొంచెం రిస్కు ఎక్కువే. **స్మాల్ క్యాప్ ఫండ్స్** మార్కెట్ విలువ ఆధారంగా 251వ నంబర్ నుంచి మిగిలిన కంపెనీలను స్మాల్ క్యాప్ కంపెనీలు అంటారు. వీటి స్టాక్‌లను కొనుగోలు చేసే మ్యూచువల్ ఫండ్స్‌ను స్మాల్ క్యాప్ ఫండ్స్ అంటారు. వీటి మార్కెట్ విలువ రూ.5 వేల కోట్ల లోపు ఉంటుంది. ఈ కంపెనీలకు పెద్దగా ట్రాక్ రికార్డు ఉండదు.

## రికార్డు స్థాయిలో స్మార్ట్‌ఫోన్ల ఎక్స్‌పోర్ట్

**న్యూఢిల్లీ, జనవరి 26:** వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీఓ) అంతర్జాతీయ వాణిజ్య వర్గీకరణ కోసం ఉపయోగించే హార్మోనైజ్డ్ సిస్టమ్ (హెచ్ఎస్) కోడ్‌ల ప్రకారం స్మార్ట్‌ఫోన్‌లు భారతదేశానికి సంబంధించిన రెండో అతిపెద్ద ఎగుమతి వర్గంగా మారిందని పేర్కొన్నాయి. ఆటోమోటివ్ డీజిల్ ఇంధన ఎగుమతులను సవాలు చేస్తూ ఈ విభాగం ఇప్పుడు అగ్రస్థానం కోసం పోటీ పడుతున్నట్లు విశ్లేషించింది. 2025 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ కాలంలో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 13.1 బిలియన్ల డాలర్లకు చేరుకున్నాయని హెచ్ఎస్ కోడ్ ఆధారిత ఎగుమతి వర్గాలలో రెండవ స్థానాన్ని పొందిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ డేటా వెల్లడించింది. ఇది గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులలో 8.9 బిలియన్ల డాలర్ల కంటే 46 శాతం పెరుగుదలను సూచిస్తుందని విశ్లేషించింది 2024 ఆర్థిక సంవత్సరంలో స్మార్ట్‌ఫోన్‌లు ఏప్రిల్‌నవంబర్ కాలంలో నాలుగో స్థానంలో ఉన్నాయి. కానీ ఇప్పుడు రెండు స్థానాలు ఎగబాకి రెండోస్థానానికి చేరుకున్నాయి. ఆపిల్ కంపెనీకు చెందిన ఐఫోన్ ఎగుమతుల్లో మూడింట రెండు వంతుల వాటాను కలిగి ఉంది.



ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎల్ఐ స్కీమ్ కారణంగానే ఇది సాధ్యమైందని నిపుణుల చెబుతున్నారు. ఆటోమోటివ్ డీజిల్ ఇంధనం భారతదేశం యొక్క అగ్ర ఎగుమతిగా ఉంది. ఏప్రిల్-నవంబర్ 2024 ఆర్థిక సంవత్సరంలో స్మార్ట్‌ఫోన్ల కంటే 10బిలియన్ల డాలర్లు ఉంది. అయితే 2025 ఆర్థిక సంవత్సరంలో ఈ అంతరం సంబంధిత కాలానికి కేవలం 400 మిలియన్ల డాలర్లకు తగ్గింది. 2019 ఆర్థిక సంవత్సరం నుంచి భారతదేశంలో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు చెప్పుకోదగిన వృద్ధిని సాధించాయి. అప్పట్లో 1.6 బిలియన్ల డాలర్లతో హెచ్ఎస్ కోడ్ ఎగుమతి వర్గాల్లో 23వ స్థానంలో నిలిచాయి. రెండుసంవత్సరాల తర్వాత పీఎల్ఐ స్కీమ్‌ను ప్రవేశపెట్టడం వల్ల భారతదేశంలో ప్రధాన ఐఫోన్ తయారీకేంద్రాలను స్థాపించిన ఆపిల్ ఫాక్స్‌కాన్, పెగాట్రాన్, విస్ట్రాన్ వంటి ప్రపంచ దిగ్గజాలను ఆకర్షించింది. ప్రముఖ కంపెనీ సామ్‌సంగ్ కూడా తన ఎగుమతి కార్యకలాపాలను విస్తరించింది. స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 2020 ఆర్థిక సంవత్సరంలో 2.9 బిలియన్ల డాలర్ల కు పెరిగాయి. ఎగుమతి ర్యాంకింగ్స్‌లో ఈరంగం 14వ స్థానంలో ఉంది. తర్వాత రెండు సంవత్సరాల్లో ఎగుమతులు ఊపందుకున్నాయి. 2021 ఆర్థిక సంవత్సరంలో 3 బిలియన్ల డాలర్లకు చేరింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.